మంగళవారం
18•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 354
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW.NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD







# జలవివాదాలు వద్దు

## తెలంగాణ, ఏపీ సీఎంలు కేసీఆర్, జగన్ నిర్ణయం!

### కాళేశ్వరం ప్రారంభానికి రావాలంటూ జగన్‌కు ఆహ్వానం



సోమవారం అమరావతిలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కాళ్వేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

- 9,10 షెడ్యూల్ సంస్థలు, విద్యుత్ ఉద్యోగుల విభజన సమస్యలపై ఇరు రాష్ట్రాల సీఎంల చర్చ
- బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న కేసీఆర్
- అమ్మవారి పాదాల చెంత కాళేశ్వరం ఆహ్వాన పత్రిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఈ నెల 21న నిర్వహిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆహ్వానించారు. ఒక రోజు పర్యటన నిమిత్తం సోమవారం విజయవాడ చేరుకున్న కేసీఆర్.. ఏపీ నూతన రాజధాని అమరావతిలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్‌తో సమావేశమయ్యారు. కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికిన జగన్.. ఆయనను సాదరంగా లోనికి తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను జగన్‌కు కేసీఆర్ అందజేశారు. అనంతరం దాదాపు గంటన్నర పాటు ఇద్దరు సీఎంలు విభజన సమస్యలు సహా వివిధ అంశాలపై చర్చలు జరిపినట్టు సమాచారం. రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలు ఉండొద్దని నిర్ణయించినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో తమ ఆధీనంలో ఉన్న భవనాలను తెలంగాణకు అప్పగించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించింది. దీనికి సంబంధించిన ప్రక్రియ దాదాపుగా పూర్తికావచ్చింది. ఈ నేపథ్యంలో షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనపై ఇద్దరు సీఎంలు చర్చించినట్టు సమాచారం. ప్రభుత్వరంగసంస్థల విభజనపై దృష్టిపెట్టడంతో పాటు.. విద్యుత్ ఉద్యోగుల విభజనపైనా చర్చించినట్టు తెలిసింది. ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలపై సమాలోచనలు జరిపిన సీఎంలు.. కృష్ణా, గోదావరి జలాలపై కోర్టులు, ట్రిబ్యునళ్లకు వెళ్లేందుకు ఆస్కారం లేకుండా అన్ని సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుందామని నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఈ నెల 24న హైదరాబాద్‌లో ఇరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శుల సమావేశం జరుగనున్నది.

**కేసీఆర్‌కు జగన్ విందు**

రాష్ట్ర పర్యటనకు వచ్చిన తెలంగాణ సీఎం కేసీఆర్‌కు ఏపీ సీఎం జగన్ విందునిచ్చారు. ఇద్దరు సీఎంలు కలిసి భోజనం చేశారు. కేసీఆర్‌తోపాటు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిలు, జగన్‌తోపాటు ఏపీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

మిగతా 2వ పేజీలో



సోమవారం విజయవాడలో విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారిగా సన్యాసాశ్రమ దీక్షను స్వీకరించిన స్వాత్మానందేంద్ర సరస్వతికి వెండి కిరీటధారణ చేస్తున్న తెలంగాణ, ఏపీ సీఎంలు కేసీఆర్, వైఎస్ జగన్

## అధర్మం ఓడిపోతుంది

- భవిష్యత్తును ఊహించే ఏకైక పీఠం శారదాపీఠం
- మహాభారతం ఔపోసనపట్టిన వ్యక్తి కేసీఆర్
- కేసీఆర్, జగన్ పదిహేనేండ్లు పాలించాలి
- అందుకోసం శారదాపీఠం తపస్సు చేస్తుంది
- పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

3

## అడ్డగోలుగా భూమి తొలగింపు

**ధర్మగంట**

- ఒకరికి చెందిన భూమి మరో వ్యక్తి పేరిట పట్టా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వికారాబాద్ రెవెన్యూ సిబ్బంది
- కంప్యూటర్లు పనిచేయడం లేదని కుంటిసాకులు చెప్తున్నారు: బాధితుడు

మన పేరిట ఉన్న రికార్డులు ఎలా మారుతాయిలే అని భరోసాతో ఉంటే.. ఉన్నది కాస్తా ఊడ్చుకుపోవడం ఖాయమన్నది నిజం చేసి చూపిస్తున్నారు రెవెన్యూ సిబ్బంది. మన భూమే అయినా.. మన పేరిట పాస్‌బుక్కులు ఉన్నా.. అప్పుడప్పుడు క్రాస్ చెక్ చేసుకొంటేగానీ విషయాలు బయటపడేట్లుగా లేవు. ఇలాంటి పరిస్థితే వికారాబాద్ జిల్లాలోని రైతు వెంకట్‌రెడ్డికి ఎదురైంది. తనకు తెలియకుండానే తన భూమిని మరోవ్యక్తి పేరిట ఇచ్చిన పట్టాను రద్దుచేయాలంటూ ఎన్నో రోజులుగా తాసిల్దార్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్న వెంకట్‌రెడ్డి.. చివరకు తనకు న్యాయంచేయాలంటూ ధర్మగంటను ఆశ్రయించాడు.

4

## అట్టహాసంగా గురుకుల పండుగ

- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 119 బీసీ గురుకులాలను ప్రారంభించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- 281కి చేరిన బీసీ గురుకులాల సంఖ్య
- మొత్తంగా 92,340 మందికి చదువుకునే అవకాశం
- ఆనందంలో విద్యార్థుల తల్లిదండ్రులు

7

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను ప్రారంభించిన కేసీఆర్

- భవన నిర్మాణాలు, సౌకర్యాలు బాగున్నాయి
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని ప్రశంసించిన సీఎం
- వెంటనే ప్రజాప్రతినిధులకు కేటాయించాలని అధికారులకు సూచన

5

## బెంగాల్ వైద్యుల సమ్మె విరమణ

- ముఖ్యమంత్రి మమతతో చర్చలు సఫలం
- దవాఖానల్లో భద్రత పెంపునకు సీఎం హామీ
- నోడల్ అధికారుల నియామకానికి ఆదేశాలు

8



## బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నడ్డా

9

- పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో నిర్ణయం
- జాతీయ అధ్యక్షుడిగా కొనసాగనున్న అమిత్ షా.. డిసెంబర్ వరకు పదవీకాలం





ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు HCL లో IT Engineer ఉద్యోగం
ఉద్యోగం చేస్తూనే degree పూర్తి చేసే అవకాశం

**ఉద్యోగ వివరాలు**

- Application and Infrastructure support, Testing and CAD support - రంగాలలో ప్రవేశ స్థాయి ఉద్యోగాలు
- విజయవంతంగా శిక్షణ పూర్తి అయిన తరువాత ఏడాదికి 2.0 లక్షల నుండి 2.2 లక్షల వేతనం.

**ఉద్యోగముతో పాటు ఉన్నత విద్య**

*HCL నుండి నిధుల సహాయముతో SASTRA UNIVERSITY నుండి BCA (3 Years) లేదా BITS PILANI నుండి B.Sc. (4 Years) పూర్తిచెయుట తప్పనిసరి.

**విద్యార్హతలు**

- ఇంటర్మీడియట్ 60% మరియు ఆ పై మార్కుల ఉత్తీర్ణత.
- గణితం /వ్యాపార గణితం తప్పనిసరి.
- 2018, 2019 ఏడాదిలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు మాత్రమే.

**IT ఉద్యోగ శిక్షణ**

- 12 నెలల శిక్షణ(ప్రతి నెల 10,000 వేతనం.
- ఫీజు: 2 లక్షలు +Taxes. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు మరియు శిక్షణ తదుపరి HCL లో విధులు చేపట్టిన మొదటి సంవత్సరము నుండి EMI ప్రారంభమవును

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి.

**WALKIN FOR SELECTION / INTERVIEW PROCESS ON 21ST, 22ND & 23RD JUNE 2019**

**ADILABAD** Venue: Skill Training Center, Bright Light Society, H.No.6-8-57/4, Bhuktpur, Radheshyam Complex, NH No.7 Road, Adilabad

**SIDDIPET** Venue: Skill Training Center, Bright Light Society, H.No.17-186/1, Shivaji Nagar, Siddipet, Telangana

**WARANGAL** Venue: Sri Balaji Junior College, H.No.2-9-780/1, 2-9-780/2, TNGOs Colony, 100ft Road, Waddepally, Hanmakonda, Warangal

**SECUNDERABAD** Venue: Skill Training Center,Bright Light Society, Near BBR Hospital,Besides Bharat Lodge –Chaina Bazar, Navajeevan Nagar, Balnagar, Secunderabad

**NIZAMABAD** Venue: Indian Red Cross Society,Nizamabad District Branch, Behind Thasildar office, Khaleelwadi, Nizamabad

**MAHABOOBNAGAR** Venue: Red Cross Blood Bank, Indian Red Society, Mahaboobnagar District Branch,Telangana Chowrasta Mahaboobnagar.

**MANCHIRYALA** Venue: Vivekavardhini Degree & PG College Behind Bus Stand Manchiryala

**NALGODNA** Venue: Indian Red Cross Society,Nalgonda District Branch, H.No.5-6-300, Red Cross Bhavan, Near Bustand, Nalgodna

**KHAMMAM** Venue: Khammam IT Solution, Revenue Bhavan, Beside Traffic Police Station Near Bustand, Khammam

To Register for the selection process, give a missed call to **8448 386 391**
Website: **www.hcltechbees.com** | Email **techbee.telangana@hcl.com**

HCL

$ 8.6 BILLION | 137,000+ MINDS | 44 COUNTRIES

HCL does not have any partners/ vendors for training & recruitment for jobs in HCL. Candidates are advised to contact HCL office.



సోమవారం విజయవాడలో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరిస్తున్న ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి



టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరిస్తున్న ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి



ఏపీ సీఎం నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును ఆశీర్వదిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు





విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహూకరిస్తున్న ఆలయ అధికారులు. చిత్రంలో ఎంపీ సంతోష్‌కుమార్, ఏపీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు కూడా ఉన్నారు.



ప్రకాశం బరాజ్ వద్ద కృష్ణానదిలోకి నాణేలు విసురుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఏపీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, తెలంగాణ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కూడా ఉన్నారు.

# నేడు రాష్ట్ర క్యాబినెట్ భేటీ

## కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

- కొత్త మున్సిపల్ చట్టానికి పచ్చజెండా
- కాళేశ్వరం సామర్థ్యం పెంపునకు ఆమోదం
- పలు అభివృద్ధి పనులకు లైన్ క్లియర్
- జులై మూడవ లేదా చివరి వారంలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు!

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మంగళవారం నిర్వహిస్తున్న మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారని తెలుస్తున్నది. ప్రగతిభవన్‌లో మధ్యాహ్నం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో.. కొత్తగా రూపొందించిన పురపాలక చట్టం, రెవెన్యూ చట్టంలో మార్పులు, చేర్పులపై చర్చ జరిగే అవకాశం ఉందని అంటున్నారు. కొత్త మున్సిపల్ చట్టానికి మంత్రివర్గం ఆమోదముద్ర వేయనున్నది. రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలిచిపోనున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంతోపాటు పలు సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై చర్చ జరుగనున్నది. నూతన సచివాలయ భవన నిర్మాణం ప్లాన్‌పైనా చర్చిస్తారని సమాచారం. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు చెక్‌పవర్ ఇవ్వాలన్న నిర్ణయానికి మంత్రివర్గం ఆమోదముద్ర వేయనున్నది. కాళేశ్వరం ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచే విషయానికి ఆమోదం తెలుపనున్నది. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు మూడు టీఎంసీలను తరలింపునకు కన్నెపల్లి, అన్నారం, సుందిల్ల వద్ద అదనపు మోటర్ల బిగింపునకు సుమారు రూ.1,250 కోట్లు ఖర్చవుతాయని అంచనా. ఈ పనులను పాత కాంట్రాక్టర్‌కే అప్పగించాలని స్టాండింగ్ కౌన్సిల్ సిఫారసు చేసింది. దీనిపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటారు. మిడ్‌మానేరు నుంచి మల్లన్నసాగర్ వరకు అదనపు టీఎంసీ తరలింపు, ఎల్లంపల్లి నుంచి ఎస్సారెస్పీ వరదకాల్వ వరకు రెండు టీఎంసీల తరలింపునకు పనులు పూర్తయ్యాయి. కానీ మూడో టీఎంసీని పైప్‌లైన్ ద్వారా తరలించాలా? లేక రిజర్వాయర్‌ను ఏర్పాటుచేయాలా? అనే విషయంపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నదని సమాచారం. 22 కొత్త జిల్లాల్లో టీఆర్‌ఎస్ కార్యాలయాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు, టీఎస్‌ఎస్పీఎఫ్‌కు ఎనిమిది ఎకరాలు, నేషనల్ పోలీస్ అకాడమిలో క్వార్టర్ల నిర్మాణానికి రెండెకరాలు, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి ఐదెకరాలు కేటాయింపుపై చర్చిస్తారని తెలుస్తున్నది. వీటితోపాటు తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ డెట్ రిలీఫ్- 2019 సవరణ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలియజేస్తుందని సమాచారం. మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా 14 మంది జీవితఖైదీలకు స్పెషల్ రెమిషన్ ఇచ్చే అంశాన్ని ఆమోదిస్తారని తెలుస్తున్నది. కేఎంసీ వరంగల్, రిమ్స్ ఆదిలాబాద్‌కు 636 పోస్టులు సృష్టించే ఫైలుపైనా మంత్రివర్గం చర్చించనున్నది.

### జూలై చివరివారంలో బడ్జెట్ సమావేశాలు!

వచ్చేనెలలో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు నిర్వహించడంపైనా మంత్రివర్గంలో చర్చించనున్నారు. జూలై చివరి వారంలో ఈ సమావేశాలు నిర్వహిస్తారని తెలుస్తున్నది. సచివాలయంలో నూతన భవన నిర్మాణానికి కూడా ఆమోదం తెలుపనున్నది.

# జలవివాదాలు వద్దు

మొదటిపేజీ తరువాయి...

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు. ఏపీ ముఖ్యమంత్రి నివాసంలో తిరుమల తిరుపతి దేవస్థాన వేదపండితులు సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించారు. వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కేసీఆర్‌కు అందజేశారు.

### కనకదుర్గమ్మ సన్నిధిలో సీఎం కేసీఆర్

ఏపీ పర్యటనకు వచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం తదితరులు కేసీఆర్ బృందానికి స్వాగతం పలికారు. తొలుత బెజవాడ కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి కేసీఆర్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఏపీ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్.. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్, ఆహ్వాన పత్రికను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం అర్చక స్వాములు కేసీఆర్‌కు ఆశీర్వచనాలు ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ అధికారులు బహూకరించారు. దాదాపు అరగంటపాటు కేసీఆర్ ఆలయంలో గడిపారు. అక్కడినుంచి తాడేపల్లిలోని సీఎం జగన్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో ప్రకాశం బరాజ్ వద్ద కాసేపు కారు నిలిపి, అక్కడి వాతావరణాన్ని ఆస్వాదించారు. బరాజ్ కట్టిన తీరును, నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. నదిలోకి నాణేలు వదిలారు.

## శిలాఫలకాలపై ముగ్గురు సీఎంల పేర్లు

### గవర్నర్ సమక్షంలో కాళేశ్వర ప్రారంభోత్సవం

**చారిత్రక** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమవుతున్నది. ప్రారంభోత్సవ ఘట్టాన్ని చరిత్రలో నిలిపే శిలాఫలాకాలు సిద్ధమవుతున్నాయి. మేడిగడ్డ బరాజ్‌తోపాటు కన్నెపల్లి పంపుహౌస్‌లో నీటి విడుదలకు సంబంధించి రెండు శిలాఫలకాలను సిద్ధంచేయడంలో ప్రొటోకాల్ ప్రకారం పేర్లను నిర్ణయించారు. ఈ రెండింటిపై గోదావరి బేసిన్‌లోని ప్రధాన రాష్ట్రాలైన మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పేర్లు ఉండనున్నాయి. గవర్నర్ నరసింహన్ సమక్షంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వీటిని ఆవిష్కరించనున్నారు. ముఖ్య అతిథులుగా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర జీ ఫడ్నవీస్, ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్లు ఉండనున్నాయి. మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి నీటి విడుదల.. ఈ రెండు కార్యక్రమాల్లో ఈ పేర్లు ఉండనున్నాయి. గౌరవ అతిథులుగా పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు బీ వెంకటేశ్ నేతకాని, కరీంనగర్ జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ, మంథని శాసనసభ్యుడు డీ శ్రీధర్‌బాబు, మహాదేవ్‌పూర్ ఎంపీపీ ఆకుల సదానందం, మహాదేవ్‌పూర్ జెడ్పీటీసీ మహ్మద్ హసీనా బాను, అంబట్‌పల్లి ఎంపీటీసీ రాచపల్లి సంపూర్ణ పేర్లు ఉండనున్నాయి. మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించి స్థానిక అంబట్‌పల్లి సర్పంచ్ ఎర్రవెల్లి విలాస్‌రావు, కన్నెపల్లి పంపుహౌస్ నీటి విడుదలకు సంబంధించి మెట్‌పల్లి సర్పంచ్ ములుకల శోభ పేర్లు శిలాఫలకాలపై ఉండనున్నాయి.

### ముహూర్తం

సూర్యోదయం: 5.46 గంటలకు

సూర్యాస్తమయం: 6.48 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం, పాడ్యమి మధ్యాహ్నం 2.33 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: మూల ఉదయం 11.51 వరకు, తదుపరి పూర్వాషాఢ, అమృతఘడియలు: తె.జా. 5.09 నుంచి ఉదయం 6.45 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.33 నుంచి సాయంత్రం 5.11 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.23 నుంచి 9.15 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.28 నుంచి 3.20 వరకు, వర్జ్యం: రాత్రి 8.24 నుంచి 10.00 వరకు.



## మెట్రోరైల్ కోచ్‌లు లేదా ఫ్రీక్వెన్సీ పెంచాలి

### అధికారులకు కేటీఆర్ సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా మెట్రో రైళ్లలో కోచ్‌లను లేదా రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, హైదరాబాద్ మెట్రోరైల్ సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిలకు సూచించారు. హైటెక్ సిటీ మార్గంలో విపరీతమైన రద్దీ ఉన్నందున మెట్రో కోచ్‌లను లేదా రైళ్ల ఫ్రీక్వెన్సీని ట్విట్టర్ ద్వారా ఓ వ్యక్తి చేసిన విజ్ఞప్తిని కేటీఆర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలను తీర్చేందుకు సమర్థమైన ప్రజారవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడమే మార్గమని కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

## ధార్మిక పరిషత్‌తోనే ఆలయాలకు మహర్దశ

- సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తిచేసిన అర్చక సమాఖ్య
- అర్చకుల రిటైర్‌మెంట్ వయస్సు పెంపుపై కృతజ్ఞతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేవాలయాల పరిరక్షణతోపాటు ఆధ్యాత్మిక భావనతో ఆలయాలను నిర్వహించడం, పరిపాలనా సౌలభ్యం కోసం ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ విజ్ఞప్తి చేశారు. శారదాపీఠం వారసుడి నియామక ప్రక్రియలో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దేవాదాయశాఖలో కొందరు అధికారుల అలసత్వంతో ఆలయాలు నిస్తేజంగా తయారవుతున్నాయని, ఆగమశాస్త్రం ప్రకారం పూజాక్రతువులు జరుగడంలేదని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో ధార్మిక పరిషత్ ఏర్పాటుచేయడంతో దేవాలయ వ్యవస్థను కాపాడుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆధ్యాత్మిక భావన అర్చకలోకానికి వరంగా మారిందని, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా అర్చకులకు వేతనాలు అందుతున్నాయన్నారు. అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించి, పదవీ విరమణ వయస్సును 58 ఏండ్ల నుంచి 65 ఏండ్లకు పెంచినందుకు అర్చకులంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో దేవాదాయశాఖ నుంచి అర్చక సంక్షేమనిధికి రూ.100 కోట్లు వచ్చాయని, వాటితో అర్చక సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి అర్చకులకు విద్య, వైద్యం, వివాహ, ఉపనయనాది కార్యక్రమాలకు రుణసాయం అందించాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. భూదానంగా వచ్చిన ఇనాం భూములను అర్చకులకు వదిలి, పాస్ పుస్తకాలు అందించి బ్యాంకుల్లో రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా ఉండగా, రాష్ట్రంలో ధార్మిక పరిషత్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని ఉపేంద్రశర్మ తెలిపారు. సీఎంను కలిసిన వారిలో బ్రాహ్మణ ఫ్రంట్ ప్రతినిధులు పవన్‌కుమార్, జీవీఎస్ శ్రీనివాసాచారి, రాజ్‌కుమార్, పురుషోత్తం తదితరులు ఉన్నారు.



విజయవాడ వచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి ధార్మిక పరిషత్ ఏర్పాటుచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ



మేడిగడ్డలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్‌తో భద్రత ఏర్పాట్లను చర్చిస్తున్న వరంగల్ రేంజ్ ఐజీ వై నాగిరెడ్డి

## మేడిగడ్డలో భారీ భద్రతా ఏర్పాట్లు

**మహదేవ్‌పూర్ (జయశంకర్ భూపాలపల్లి):** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో ముగ్గురు ముఖ్యమంత్రులు పాల్గొననున్న నేపథ్యంలో మేడిగడ్డ బరాజ్ వద్ద రెండువేల మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బరాజ్‌ను పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. పోలీస్, ఇరిగేషన్ అధికారులు మినహా ప్రైవేట్ వ్యక్తులు బరాజ్‌లోనికి రాకుండా ఆంక్షలు విధించారు. భద్రత పర్యవేక్షణ బాధ్యతను ప్రత్యేకంగా ఇద్దరు ఎస్పీలకు అప్పగించారు. ఇప్పటికే బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్లు బరాజ్ పరిసరాల్లో సమస్యాత్మక ప్రాంతాలు, కల్వర్టులను తనిఖీ చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వరంగల్ రేంజ్ ఐజీ వై నాగిరెడ్డి మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలించారు. సీఎంలు పర్యటించే ప్రాంతాల్లో తిరిగి, భద్రతాచర్యలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ ఆర్ భాస్కరన్, కాటారం ఏఎస్పీ సాయిచైతన్య, మహదేవ్‌పూర్ సీఐ రంజిత్‌కుమార్ ఉన్నారు.

### లోకం పోకడ



ఈ కొత్త టీవీ తీసుకోండి సార్.. మీరు స్వయంగా క్రికెట్ గ్రౌండ్‌లో వున్న ఫీలింగ్ కలుగుతుంది!

# 22 తర్వాతే తొలకరి పలుకరింపు

## కర్ణాటకలోకి రుతుపవనాలు.. గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

- 40 డిగ్రీల కంటే దిగువన నమోదు
- 20నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం
- నెలాఖరు నాటికి మరొకటి!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 12వ తేదీ నుంచి ఏదో కారణంగా వాయిదాపడుతున్న రుతుపవనాల రాక మరింత ఆలస్యమవుతున్నది. 22తర్వాతే తెలంగాణను తొలకరి పలుకరిస్తుందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్తున్నారు. నైరుతి రుతుపవనాలలో కదలిక వచ్చినా గాలిలో తేమశాతం తక్కువగా ఉండటం వల్ల అవి అనుకున్నంత వేగంగా ముందుకు కదలడం లేదని పేర్కొంటున్నారు. రుతుపవనాలు కేరళ అంతటా, తమిళనాడులోని చాలాప్రాంతాలలో విస్తరించాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ప్రస్తుతం కర్ణాటకలోకి ప్రవేశించిన రుతుపవనాలు మరో రెండ్రోజుల్లో రాయలసీమకు, తర్వాత కోస్తాంధ్రలోకి విస్తరిస్తాయని చెప్పారు. తెలంగాణలోకి ఈ నెల 22న లేదా 23న ప్రవేశించవచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో జూన్ 20 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని, ఇది బలమైనది కానప్పటికీ.. మధ్యభారతదేశంలోని వర్షాభావ ప్రాంతాల్లో దీని ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉన్నదని ప్రైవేటు వాతావరణ అధ్యయన సంస్థ స్కైమెట్ తెలిపింది. రుతుపవనాల కాలంలో అరేబియా సముద్రంలోనూ అల్పపీడనాలు ఏర్పడుతుంటాయి. అయితే, వీటి వల్ల మేలు కన్నా, కీడే ఎక్కువ. ప్రస్తుతం వాయు తుఫాన్ ఇదే విషయాన్ని రుజువుచేస్తున్నదని పేర్కొంది. జూన్ నెలాఖరుకు బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని అంచనావేసింది. కాగా రాష్ట్రంలో సోమవారం వాతావరణం చల్లగా మారింది. కొన్నిచోట్ల జల్లులు పడ్డాయి. ఒక్క నిజామాబాద్‌లో తప్ప ఇతర చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు తక్కువగానే నమోదయింది. ఆదిలాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 39.8, భద్రాచలంలో 31, హన్మకొండలో 38, హైదరాబాద్‌లో 37.5, ఖమ్మంలో 36.6, మహబూబ్‌నగర్‌లో 38.2, మెదక్‌లో 39.2, నల్లగొండలో 37, నిజామాబాద్‌లో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల 24 గంటల్లో హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. సోమవారం నగరంలో ఎండ తీవ్రత తగ్గినప్పటికీ గాలిలో తేమశాతం తక్కువగా ఉండడంతో ఉక్కపోత తప్పలేదు. గరిష్ఠ ఉష్ణోగ్రత 37.5, కనిష్ఠ ఉష్ణోగ్రత 25.0 డిగ్రీలు నమోదైనట్లు, వేడిగాలులు మరో రెండ్రోజులు కొనసాగే అవకాశమున్నది.



ఏరువాక పౌర్ణమి రోజున వరంగల్ నగర శివారు రెడ్డిపురంలో కమ్ముకొన్న మేఘాలు







1 సోమవారం విజయవాడలో విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి పుష్పాభిషేకం చేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

2 శారదా పీఠం ఉత్తరాధికారి సన్యాసాశ్రమ దీక్ష స్వీకరణ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటున్న విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

3 శారదా పీఠం ఉత్తరాధికారి సన్యాసాశ్రమ దీక్షస్వీకరణ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి. చిత్రంలో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఉన్నారు.



# అధర్మం ఓడిపోతుంది

- భవిష్యత్తును ఊహించే ఏకైక పీఠం శారదాపీఠం
- అందుకు నిదర్శనమే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు
- మహాభారతం ఔపోసనపట్టిన వ్యక్తి కేసీఆర్
- కేసీఆర్, జగన్ పదిహేనేండ్లు పాలించాలి
- పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- సన్యాసాశ్రమ దీక్ష స్వీకరించిన కిరణ్‌కుమార్‌శర్మకు స్వాత్మానందేంద్ర సరస్వతిగా నామకరణం
- హాజరైన తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, వైఎస్ జగన్



శారదా పీఠం ఉత్తరాధికారి సన్యాసాశ్రమ దీక్ష స్వీకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర సరస్వతి. చిత్రంలో తెలంగాణ, ఏపీ సీఎంలు కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అధర్మం ఓడిపోతుందని, ధర్మం గెలుస్తుందని శారదాపీఠం గతంలోనే చెప్పిందని, అందుకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఇద్దరు ముఖ్యమంత్రులు.. కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిదర్శనమని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. భవిష్యత్తును ఊహించే ఏకైక పీఠం శారదాపీఠమని పేర్కొన్నారు. శారదాపీఠం ఉత్తరాధికారి సన్యాసాశ్రమదీక్ష స్వీకరణ ముగింపు కార్యక్రమం సోమవారం విజయవాడలో అట్టహాసంగా సాగింది. విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారిగా సన్యాసాశ్రమ దీక్షను స్వీకరించిన కిరణ్‌కుమార్‌శర్మకు స్వాత్మానందేంద్ర సరస్వతిగా నామకరణం చేశారు. కృష్ణానదీతీరంలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో జరిగిన ఈ మహోత్సవానికి తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతికి.. కేసీఆర్, జగన్ ఫలపుష్పాలను సమర్పించి, ఆశీర్వాదం తీసుకున్నారు. స్వాత్మానందేంద్ర సరస్వతికి కేసీఆర్, జగన్ వెండి కిరీటధారణ చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పీఠాధిపతులు, వేదపండితులు తరలివచ్చారు. స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ మహాభారతం రెండుసార్లు చదివిన వ్యక్తి తెలంగాణ సీఎం కేసీఆర్ అని చెప్పారు. యాదాద్రి, వేములవాడ ఆలయాలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ప్రస్తుతం స్వాత్మానందేంద్ర సరస్వతిపై నిర్ణయాన్ని తెలుసుకున్న సీఎం కేసీఆర్.. రాజశ్యామల యాగ నిర్వహణ సమయంలో ఘనంగా సన్మానించి తెలంగాణ నుంచి ఏపీకి పంపించారని తెలిపారు. తమకు ఎంతో ప్రీతిపాత్రమైనవ్యక్తి ఏపీ సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. శారదాపీఠం ఉత్తరాధికారిగా బాలస్వామి నియమితులైన రోజు ఎంతో విశేషమైన రోజు అన్నారు. కేసీఆర్, జగన్‌లు తనకు అత్యంత ఇష్టమైన వ్యక్తులని, వారిద్దరికీ అత్యంత ఇష్టమైన వ్యక్తి స్వాత్మానందేంద్ర సరస్వతి అని పేర్కొన్నారు. ఇరువురు ముఖ్యమంత్రులు 15 ఏండ్లపాటు దిగ్విజయంగా పాలన చేయాలని అప్పటి వరకు శారదాపీఠం తపస్సు చేస్తూనే ఉంటుందని చెప్పారు. సన్యాసదీక్ష స్వీకరణ మహోత్సవాన్ని దేవతలు కూడా దీవించారని, అందుకే 45, 46 డిగ్రీల ఎండ వేడిలోనూ సన్యాసస్వీకరణకు వాతావరణం చల్లగా మారిందన్నారు.

**స్వాత్మ అంటే..**

బాలస్వామికి స్వాత్మానందేంద్ర సర్వసతి అని నామకరణం చేయడంపై స్వరూపానంద వివరణ ఇస్తూ.. స్వరూపం అన్నా.. స్వాత్మ అన్న ఒక్కటేనని చెప్పారు. తామిరువురం అద్వైత స్వరూపులమని పేర్కొన్నారు. కశ్మీర్ నుంచి లడఖ్ వరకు పాదయాత్ర చేసి.. అక్కడి మంచులోనూ తపస్సు చేసి వచ్చిన యోధుడు స్వాత్మానందేంద్ర సరస్వతి అని చెప్పారు. రాజశ్యామల మాత సాక్షిగా 2024 నాటికి పూర్తిగా పీఠం బాధ్యతలను స్వాత్మానందేంద్ర సరస్వతికి అప్పగిస్తానని, ఆ తర్వాత తన జీవితాన్ని తపస్సుకు అంకితం చేస్తానని ప్రకటించారు.

**స్వరూపానందే నాకు అన్నీ: స్వాత్మానందేంద్ర**

స్వరూపానందేంద్ర సరస్వతే తనకు తల్లి, తండ్రి, గురువు, దైవం అన్నీ అయ్యారని సన్యాసదీక్ష స్వీకరించిన ఉత్తరాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. దేశవిదేశాల్లో అద్భుత అద్వైత పీఠంగా వాసికెక్కిన శారదాపీఠానికి ఉత్తరాధికారిగా తనను నియమించారని, ఇది స్వరూపానందేంద్రుల దయ తప్ప మరొకటి కాదని వివరించారు. స్వామి ఆదేశాలను, వారి మార్గాన్ని ఔదలదాల్చి భవిష్యత్తులో శారదాపీఠం ముమ్మందుకుసాగేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమాన్ని శారదాపీఠం ట్రస్టీలు డీ నరసింహరెడ్డి, ఎన్ సుబ్బారావు, దొబ్బి శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, ధర్మాధికారి కామేశ్వరశర్మ, ఆస్థాన పండితుడు కృష్ణశర్మ, విరంచి ఫ్యాషన్స్ అధినేత ఎం రామకృష్ణారెడ్డి, సిమ్స్ కాలేజీల అధినేత భరత్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, టీ సుబ్బిరామిరెడ్డి పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



రాష్ట్రప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఒకే రోజు బీసీ గురుకులాలను ప్రారంభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. సోమవారం హైదరాబాద్‌లోని వివేకానందనగర్ బీసీ గురుకుల విద్యాలయం ప్రాంగణంలో టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కిశోర్‌గౌడ్, నాయకులు పాండుగౌడ్, నరేశ్, రాజు, శ్రవణ్, నవీన్, భాను, మురళీ తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## మూడోతరం సోలార్‌సెల్స్
# పనితీరు మెరుగుపరిచాం

- ఐఐటీ హైదరాబాద్ వెల్లడి

**హైదరాబాద్:** మూడో తరం సోలార్ సెల్స్ పనితీరును మెరుగుపరిచే విధానాన్ని అభివృద్ధి చేసినట్టు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్ సోమవారం ప్రకటించింది. డై సెన్సిటైజ్డ్ సోలార్ సెల్స్‌ను అభివృద్ధి చేసే క్రమంలో కొత్త ప్రక్రియను రూపొందించినట్టు తెలిపింది. దీని ప్రకారం యానోడ్‌లో అయస్కాంత నానో కణాలను చొప్పించడం ద్వారా కాంతి నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం గణనీయంగా మెరుగుపడినట్టు వెల్లడించింది. ధర, పర్యావరణ ప్రయోజనాల రీత్యా డై సెన్సిటైజ్డ్ సోలార్ సెల్స్‌కు డిమాండ్ ఉందని, వాటి పరితీరును మెరుగుపరిస్తే సిలికాన్ ఆధారిత సోలార్‌సెల్స్‌ను అవి అధిగమించే అవకాశం ఉందని పేర్కొంది. బృందానికి నేతృత్వం వహించిన ఐఐటీ-హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ జే సూర్యనారాయణ మాట్లాడుతూ.. మొదటితరం సిలికాన్ ఆధారిత సెల్స్ ధరతోపాటు, రెండోతరం సోలార్ సెల్స్ ధర కూడా అధికంగానే ఉందన్నారు. మూడోతరం ధర చాలా తక్కువని, మునుపటి వాటికంటే ఎక్కువ పర్యావరణ హితమని చెప్పారు. వీటి పనితీరును మెరుగుపర్చాలన్నారు. పరిశోధన వివరాలు సోలార్ ఎనర్జీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



మన్సూరాబాద్‌లో బీసీ గురుకులాలను ప్రారంభించాక విద్యార్థినికి స్కూల్ బ్యాగ్, పుస్తకాలను అందజేస్తున్న మంత్రులు కొప్పుల ఈశ్వర్, వీ శ్రీనివాస్‌గౌడ్, మహమూద్‌అలీ, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు జూలూరు గౌరీశంకర్, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఈ ఆంజనేయగౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తదితరులు



మన్సూరాబాద్‌లోని బీసీ గురుకులానికి తరలివస్తున్న విద్యార్థినులు

# విద్య ద్వారానే సామాజిక ప్రగతి

- కేసీఆర్ పాలనలో విద్యకు ప్రాధాన్యం
- కార్పొరేట్‌కు దీటుగా గురుకులాలు
- బీసీ గురుకులాల ద్వారా 92వేల మందికి నాణ్యమైన, ఉచిత విద్య
- కేజీ టు పీజీ విద్యావిధానం అమలుకు కృషి
- మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్



మన్సూరాబాద్‌లోని బీసీ గురుకులంలో ముస్తాబైన తరగతి గది

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పేదవర్గాలకు చెందిన కుటుంబాలు విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక ప్రగతి సాధించగలరనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర సంక్షేమశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. హైదరాబాద్‌లోని మన్సూరాబాద్ వివేకానందకాలనీలో ఏర్పాటు చేసిన ముషీరాబాద్, జూబ్లీహిల్స్, గోషామహల్ నియోజకవర్గాలకు చెందిన బీసీ గురుకుల విద్యాలయాలను సోమవారం మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, వీ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ గురుకులాల అకడమిక్ క్యాలెండర్‌ను, విద్యార్థులకు స్టడీ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మంత్రి కొప్పుల మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన సమయంలో 19 మాత్రమే ఉన్న బీసీ గురుకులాల సంఖ్యను సీఎం కేసీఆర్ 281కి పెంచారని చెప్పారు. వాటిల్లో 92,340 మంది విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. గురుకుల విద్యాలయాలను ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్ది బడుగు బలహీనవర్గాలకు చెందినవారి పిల్లల భవిష్యత్‌ను మార్చారని చెప్పారు. విద్యద్వారా పేద కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని. ఈ భావనతోనే రాష్ట్రంలో గురుకుల విద్యాలయాలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్న కారణంగానే పేద కుటుంబాల నుంచి వచ్చి గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు వైద్యులుగా, ఇంజినీర్లుగా వివిధ రంగాలలో ప్రవేశాలు పొంది ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశం దక్కుతుందన్నారు. ప్రభుత్వం అన్నిరంగాలకు ప్రాధాన్యం కల్పించి పలు కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా బంగారు తెలంగాణ సాధన దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. గత సంవత్సరం విద్యార్థులు సాధించిన ప్రగతిని దృష్టిలో పెట్టుకొని గురుకులాల్లో చేరేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారని, ఎక్కువ మందికి అవకాశం కల్పించాలన్న ఉద్ధేశంతోనే గురుకులాల సంఖ్యను ఏటా పెంచుతున్నట్టు వెల్లడించారు.

**ఆదర్శంగా తెలంగాణ గురుకులాలు: మహమూద్ అలీ**

హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలకు ప్రభుత్వపరంగా విద్యావకాశాలు కల్పిస్తున్నామన్నారు. అందులోభాగంగానే ఆయావర్గాల వారికి ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించే ఉద్దేశంతో రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గురుకులాల నిర్వహణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతికశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అధ్వానపరిస్థితులు ఉండేవని.. నీళ్లచారు, పురుగుల అన్నం, అపరిశుభ్ర వాతావరణంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ చదువులు కొనసాగించాల్సి వచ్చేదని తెలిపారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, తెలంగాణ ప్రభుత్వం గురుకులాల ద్వారా కార్పొరేట్ స్థాయిలో విద్యావకాశాలు కల్పిస్తున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ కేజీ టు పీజీ విద్యావిధానం అమలుచేస్తున్నారన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించడం టీఆర్‌ఎస్ సర్కారుకే సాధ్యమైందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్.రాములు, సభ్యులు జూలూరు గౌరీశంకర్, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఈ ఆంజనేయగౌడ్, బీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్‌కుమార్, బీసీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి మల్లయ్యభట్టు పాల్గొన్నారు.



నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE





రైతు నర్సింగ్‌రావుకు పాస్‌పుస్తకం అందజేస్తున్న మాక్లూర్ తాసిల్దార్ భూపతి

## మాదాపూర్ రైతుకు అందిన పాస్‌బుక్

- 'పట్టాదారు పాస్‌బుక్ ఇస్తలేరు' కథనానికి స్పందన

**మాక్లూర్:** 'పట్టాదారు పాస్‌బుక్ ఇస్తలేరు' అనే శీర్షికతో ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి నిజామాబాద్ జిల్లా మాక్లూర్ తాసిల్దార్ భూపతి స్పందించారు. మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన అల్వాల నర్సింగ్‌రావుకు సర్వే నంబర్ 658లోని 1.30 ఎకరాల భూమిపై క్షేత్రస్థాయిలో సోమవారం విచారణచేపట్టారు. ఈ భూమి నర్సింగ్‌రావుకు చెందినదని ధ్రువీకరించారు. 1.30 ఎకరాల భూమిని బాధిత రైతు పేరిట నమోదుచేసి ఆయనను తాసిల్ కార్యాలయానికి పిలిపించుకొని కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ను అందజేశారు. ఆయన సోదరుడు అల్వాల్ సత్యనారాయణరావుకు సైతం 1.30 ఎకరాలను నమోదుచేసి పాస్‌బుక్‌ను ఇచ్చారు. ఎన్నో నెలలుగా సమస్యకు పరిష్కారం దొరకకపోవడంతో తాము 'ధర్మగంట'ను ఆశ్రయించామని, తమకు పాస్‌బుక్‌లు వచ్చాయని రైతులు సంతోషం వ్యక్తంచేశారు.

# అడ్డగోలుగా భూమి తొలగింపు

### ఒకరికి చెందిన భూమి మరో వ్యక్తి పేరిట పట్టా
### ఫిర్యాదుచేసినా పట్టించుకోని వికారాబాద్ రెవెన్యూ సిబ్బంది
### సిస్టం పనిచేయడంలేదని కుంటిసాకులు చెప్తున్నారని బాధితుడి ఆవేదన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండల పరిధిలోని పీలారం గ్రామంలో సర్వే నంబర్ 9/ఈలో 7.27 ఎకరాల భూమి ఆదొండ రాంరెడ్డి, వారి బంధువు ఆదొండ రాంచంద్రారెడ్డి పేరిట జాయింట్ పట్టాగా నమోదై ఉన్నది. ఈ భూమి వారసత్వంగా వారికి సంక్రమించింది. 1964 నుంచి 2000 సంవత్సరం వరకు వారి పేరిటే ఆ భూమి రికార్డుల్లో ఉన్నది. రాంరెడ్డి, రాంచంద్రారెడ్డి మరణాంతరం 2001లో రాంరెడ్డి మనుమడైన వెంకట్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి సోదరుడైన నారాయణరెడ్డి ఆ భూమిని పంచుకొన్నారు. వెంకట్‌రెడ్డికి 4.27 ఎకరాలు, నారాయణరెడ్డికి మూడెకరాల భూమి వచ్చింది. ఇద్దరి అంగీకారం మేరకు పంచుకొన్నట్టుగానే 2001లో రెవెన్యూ అధికారులు వారి పేరిట పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా మంజూరుచేసి, రికార్డులోకి ఎక్కించారు. అయితే వెంకట్‌రెడ్డి పేరిట ఉన్న 4.27 ఎకరాల నుంచి 38 గుంటల భూమిని ఆన్‌లైన్ నుంచి చెప్పాపెట్టకుండా అధికారులు తొలగించారు. ఆ భూమిని 2019 ఏప్రిల్ 25వ తేదీన అధికారులు ఆదొండ సులోచన పేరిట నమోదుచేశారు. ఈవిధంగా అక్రమంగా పట్టా ఎందుకు మార్చారని అధికారులను బాధితుడు ప్రశ్నిస్తే.. మీ తాత రాంరెడ్డి 1982లోనే సులోచనకు విక్రయించారని, ఆ డాక్యుమెంట్ ఆధారంగా వారి పేరిట పట్టా మార్చినట్టు సమాధానమిచ్చారని వెంకటరెడ్డి వాపోతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని, కంప్యూటర్లు పనిచేయడంలేదంటూ కుంటిసాకులు చెప్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### రెండుసార్లు రైతుబంధు వచ్చినా..



రెవెన్యూ అధికారులు నా భూమిని అక్రమంగా మార్చడమే కాకుండా.. మా తాత భూమి అమ్మాడని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. 1982లో 9/ఈ సర్వే నంబర్‌లోని 4.27 ఎకరాల భూమి మా తాత రాంరెడ్డి, రాంచంద్రారెడ్డి పేరిట జాయింట్ పట్టాగా నమోదై ఉన్నది. రాంరెడ్డి ఒక్కడే ఆ భూమి అమ్మితే ఎలా చెల్లుతుంది? తాత చనిపోయినప్పటి నుంచి మేమే కాస్తులో ఉన్నాం. ఈ భూమిపై రెండుసార్లు రైతుబంధు సాయం కూడా అందుకొన్నాను. అలాంటిది రెవెన్యూ అధికారులే అక్రమంగా నా భూమిని వేరే వ్యక్తి పేరును పట్టాలోకి ఎక్కించారు.

- ఆదొండ వెంకట్‌రెడ్డి, బాధితుడు

### అధికారుల తప్పిదంతోనే..

వెంకట్‌రెడ్డి పేరిట 2001లో పట్టాపుస్తకం మంజూరు చేసేటప్పుడు ఎవరూ అభ్యంతరం చెప్పకపోవడంతో ఆయన పేరిట పాస్‌బుక్ మంజూరుచేశాం. పాస్‌బుక్ మంజూరయ్యాక 38 గుంటల భూమిని 1982లో రాంరెడ్డి తమకు అమ్మారంటూ వారి బంధువు సులోచన డాక్యుమెంట్ చూపించారు. అప్పుడు విచారించి పట్టాలో పేరు మార్చారు. రాంరెడ్డి మరణాంతరం 2001లో వెంకట్‌రెడ్డికి పట్టా మార్చేటప్పుడు రెవెన్యూ అధికారులు పరిశీలించి పట్టాలో పేరు మార్చిఉంటే ఈ సమస్య తలెత్తేది కాదు. ఇది ముమ్మాటికీ అధికారుల తప్పిదం వల్లే జరిగింది. అప్పటి అధికారులు చేసిన తప్పిదాన్ని సరిచేసేందుకే సర్వేచేసి పట్టాలో పేరు మార్చాం.

- చిన్న అప్పలనాయుడు, తాసిల్దార్, వికారాబాద్

# రైతుబంధు కోల్పోతున్నాం..

- చెప్పులు అరిగేలా తిరిగినా పని కావడంలేదు
- నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి తాసిల్ ఎదుట రైతుల ఆందోళన
- గౌరారం వీఆర్వోను వెంటనే మార్చాలని డిమాండ్



నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి తాసిల్ ఎదుట ఆందోళన చేస్తున్న గౌరారం రైతులు

**బిజినేపల్లి/కోడేరు:** చెప్పులు అరిగేలా తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని కావడంలేదని నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గౌరారం రైతులు వాపోయారు. సోమవారం బిజినేపల్లిలోని తాసిల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి తాసిల్దార్ కృష్ణకు తమ సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వీఆర్వో శ్రీనును వెంటనే తొలగించి కొత్త వీఆర్వోకు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్‌చేశారు. భూముల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాస్‌పుస్తకాలు అందక రైతుబంధు పథకానికి అనర్హులమయ్యామని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో మొత్తంలో 128 సర్వే నంబర్లు ఉన్నాయని, వాటిలో 75శాతం సమస్యలు ఉన్నాయని, కేవలం 25 శాతం మాత్రమే సక్రమంగా చేశారని వివరించారు. పాస్‌పుస్తకాలు ఎవరికీ రాలేదని, డిజిటల్, విరాసత్ సమస్యలు చాలా ఉన్నాయని చెప్పారు. సమగ్ర సర్వే తర్వాత గ్రామంలోని భూముల రికార్డులు గందరగోళంగా తయారయ్యాయని, ఈ భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని, కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వాలని ఆర్డీవో, కలెక్టర్లకు ఫిర్యాదుచేశామని తెలిపారు. వీఆర్వో గ్రామానికి రావడం లేదని వాపోయారు. చాలా మంది బతుకుదెరువు కోసం వలస వెళ్తుంటారన్నారు. రైతుల భూములను వీఆర్వో తారుమారు చేశారని, డబ్బులు తీసుకొని కూడా పనులు చేయడం లేదని ఆరోపించారు. వీఆర్వో పనితీరు బాగాలేదని, అతడిని ఇక్కడి నుంచి బదిలీచేయాలని డిమాండ్‌చేశారు. ఏడాదిగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం తాసిల్దార్ కృష్ణకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై స్పందించిన తాసిల్దార్.. ఈ నెల 20వ తేదీ తర్వాత గ్రామానికి డిప్యూటీ తాసిల్దార్, ఆర్‌ఐ, రెవెన్యూ సిబ్బందిని పంపించి భూముల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

**కోడేరు తాసిల్ ఎదుట రైతుల ధర్నా**

తమ భూములను కంప్యూటరీకరణ చేయాలంటూ సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు తాసిల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తాసిల్దార్ సుందర్‌రాజు కార్యాలయానికి చేరుకొని భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

### విరాసత్ చేస్తలేరు



భూమిని విరాసత్ చేస్తలేరు. విరాసత్ కోసం వీఆర్వోకు రూ.2 వేలు ఇచ్చాను. నా భర్త పేరు మీద 2.30 ఎకరాల భూమి ఉన్నది. ఏడాదిగా విరాసత్ కోసం తిరుగుతున్నా అధికారులు పట్టించుకొంటలేరు. మాకు న్యాయంచేయండి.

- లక్ష్మమ్మ, గౌరారం

### 1.20 ఎకరాలే వచ్చింది



5.20 ఎకరాలకు ఆన్‌లైన్‌లో 1.20 ఎకరాలే ఎక్కింది. సమగ్ర సర్వేకు ముందు 5.20 ఎకరాలు ఉండేది. కొత్త పాస్‌పుస్తకం 1.20 ఎకరాలకు మాత్రమే వచ్చింది. మిగతా నాలుగెకరాలను కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించాలని తిరుగుతున్న.

- కుంటమ్మ, గౌరారం

# పాస్‌పుస్తకాలు ఇప్పించండి

### ఖమ్మం జిల్లా బోనకల్లు తాసిల్ కార్యాలయం ఎదుట ఆళ్లపాడు రైతుల ధర్నా
### భూసమస్యలను పరిష్కరించని వీఆర్వోను సస్పెండ్‌చేయాలని డిమాండ్
### వీఆర్వోను కలెక్టర్‌కు సరెండర్ చేస్తానని తాసిల్దార్ రమేశ్ హామీ
### సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తానని ప్రకటన

**బోనకల్లు:** ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ఆళ్లపాడు గ్రామానికి చెందిన రైతులు సోమవారం తాసిల్ కార్యాలయం ఎదుట పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం ధర్నాచేశారు. వీఆర్వో ప్రకాశ్ స్థానికంగా ఉండకపోవడంతోపాటు రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించకపోవడంతో రైతుబంధు, రైతుబీమా వంటి రైతు సంక్షేమ పథకాలు అందకుండాపోతున్నాయని అన్నదాతలు ఉదయాన్నే పెద్దఎత్తున తాసిల్ కార్యాలయానికి తరలివచ్చి ధర్నాకు దిగారు. రైతులు కొనుగోలుచేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములకు, వారసత్వంగా వచ్చిన భూములపై హక్కులు ఉన్నప్పటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వకపోవడం, ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. గ్రామంలో సన్న, చిన్నకారు రైతులు ఉన్నారని, వారి సమస్యలు పరిష్కరించి పాస్‌పుస్తకాలు అందించాలని వీఆర్వోను వేడుకున్నా పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్క ఆళ్లపాడులోనే 200 ఎకరాలకుపైగా భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందాల్సి ఉన్నదని వివరించారు. రైతులకు రైతుబంధు అందకుండా ఇబ్బందులకు గురిచేసిన వీఆర్వోను వెంటనే సస్పెండ్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. రైతుల ధర్నాపై స్పందించిన తాసిల్దార్ రమేశ్.. ఆళ్లపాడు రెవెన్యూ పరిధిలోని రైతులకు పాస్‌పుస్తకాలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వోను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తానని హామీ ఇచ్చారు. ఆళ్లపాడు రైతుల భూసమస్యలను 15 రోజుల్లో పరిష్కరించి అర్హులందరికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తానని చెప్పారు. వాస్తవంగా గ్రామంలో 238 మందికి పాస్‌పుస్తకాలు అందాల్సి ఉన్నయన్నారు. కానీ వీటిలో కొన్ని వివిధ కారణాల వల్ల పాస్‌పుస్తకాలు నిలిచిపోయాయని, వాటి ని పరిశీలించి అందిస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.



ఖమ్మం జిల్లా బోనకల్లు తాసిల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన ఆళ్లపాడు రైతులు

# పట్టా కోసం ఆందోళన

### జగిత్యాల జిల్లా రాయికల్ తాసిల్ ఎదుట కట్కాపూర్ రైతు కుటుంబం బైఠాయింపు

**రాయికల్ రూరల్:** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య తనకు పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలంటూ తాసిల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబసభ్యులు, గ్రామస్థులతో కలిసి సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాధితుడు మల్లయ్య మాట్లాడుతూ.. కాట్కాపూర్ గ్రామ శివారులో తనకు సర్వే నంబర్ 155-1, 78-2, 375-5-2 సర్వే నంబర్లలో కలిపి 61 గుంటల భూమి ఉన్నదని, కానీ పట్టా కాలేదని తెలిపారు. తన పేరిట ఈ భూమిని పట్టా చేయాలంటూ ఫిబ్రవరిలో కోర్టు ద్వారా తాసిల్ కార్యాలయానికి నోటీసు కూడా వచ్చిందని పేర్కొన్నారు. నాలుగు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో స్పందించిన తాసిల్దార్ ఈ నెల చివరలో పట్టా చేస్తానని హామీ ఇచ్చారు. తాసిల్దార్ నర్సయ్య చెప్పిన విషయం నమ్మశక్యంగా లేకపోవడంతో అక్కడి నుంచి నేరుగా జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లారు.



కట్కాపూర్‌వాసులతో మాట్లాడుతున్న జగిత్యాల జిల్లా రాయికల్ తాసిల్దార్ నర్సయ్య

### భూపరిహారం కోసం
# ఆత్మహత్యాయత్నం

### కుటుంబంతోసహా ఒంటిపై కిరోసిన్ పోసుకున్న ఇబ్రహీంపట్నంవాసి
### ఎనిమిదేండ్లుగా పోరాడుతున్నా న్యాయం దక్కలేదని ఆవేదన
### తన పరిహారాన్ని అధికారులు కాజేశారని ఆరోపణ

**ఇబ్రహీంపట్నం, నమస్తే తెలంగాణ/ఖైరతాబాద్:** భూపరిహారం కోసం ఓ వ్యక్తి కుటుంబంతోసహా ఆత్మహత్యాయత్నంచేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన మాశమోని ఐలేశ్ సోమవారం భార్య అనురాధ, పిల్లలు అక్షిత (7), మణితేజ (6), వేణుతేజ (4)తో కలిసి హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ సమీపంలోకి చేరుకొన్నారు. వెంట తెచ్చుకొన్న కిరోసిన్‌ను మీద పోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకొని వారిని పంజాగుట్ట స్టేషన్‌కు తరలించారు. అనంతరం బాధితుడు మీడియా ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. తన తండ్రి వెంకయ్యకు 1979లో ఇబ్రహీంపట్నం సమీపంలోని సర్వేనంబర్ 58లో భూదాన్‌బోర్డు ఐదెకరాల భూమి కేటాయించిందన్నారు. 2010లో ఆ సర్వేనంబర్‌లోని భూమిని నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్‌ఎస్‌జీ)కు కేటాయించగా, అందులో తన భూమి కూడా ఉన్నదని చెప్పారు. పరిహారంగా ప్రభుత్వం ఎకరాకు రూ.5.40 లక్షలు చెల్లించిందని తెలిపారు. అయితే అప్పటి వీఆర్వో రాంరెడ్డి, తాసిల్దార్ విక్టర్, ఆర్డీవో రాజేందర్, మరో ముగ్గురు ఉద్యోగులు, భూదాన్ బోర్డు చైర్మన్ కలిసి తమ భూమికి దొంగ పత్రాలు సృష్టించి పరిహారాన్ని కాజేశారని ఆరోపించారు. ఈ విషయమై నిలదీస్తే నంబర్ తప్పు పడిందని, మరోచోట భూమి చూపిస్తామని రెండు మూడేండ్లు వారి చుట్టూ తిప్పుకొన్నారని వాపోయారు. అనంతరం డబ్బు ఖర్చవుతుందని సుమారు రూ.8 లక్షల వరకు తన నుంచి లాగారని చెప్పారు. 2014లో భూదాన్ బోర్డు రద్దు కావడంతో తాము ఏమీ చేయలేమంటూ సదరు అధికారులు చేతులెత్తేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 2017 నవంబర్‌లో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, ఎఫ్‌ఐఆర్ సైతం నమోదుచేశారని, కానీ నేటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాచకొండ సీపీతోపాటు రెవెన్యూ ఉన్నతాధికారులను కూడా కలిశానని తెలిపారు. అదే క్రమంలో వీఆర్వో రాంరెడ్డి తన వద్దకు వచ్చి లారీతో గుద్దించి చంపేస్తానని బెదిరించారని ఆరోపించారు. ప్రస్తుతం తన కుటుంబం అర్ధాకలితో అలమటిస్తున్నదని, దీంతో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు యత్నించినట్టు వాపోయారు. తనకు ప్రాణహాని ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం పోలీసులు వారిని ఇబ్రహీంపట్నం ఠాణాకు తరలించారు.



పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఐలేశ్ కుటుంబం

**బాధితుడి ఫిర్యాదుపై గతంలోనే కేసు నమోదు**

తనకు రావాల్సిన పరిహారాన్ని అధికారులు ఇతరులతో కుమ్మక్కై కాజేశారని బాధితుడు ఐలేశ్ చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి ఆర్డీవో, తాసిల్దార్, వీఆర్వోతోపాటు పరిహారాన్ని పొందిన మరో ముగ్గురిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదుచేశారు. బాధితుడు పూర్తి ఆధారాలను సమర్పించినందున ఉన్నతాధికారులు వెంటనే కేసు నమోదుచేయాలని ఆదేశించడంతో 2017 డిసెంబర్‌లో ఐపీసీ 420, 468, 471సెక్షన్ల కింద కేసు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు.

# పట్టాలులేక ప్రభుత్వ పథకాలకు దూరం

### ఏడాదిగా రెవెన్యూ కార్యాలయంచుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం
### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కుంటల్లతండా రైతుల ఆవేదన



భూమి పత్రాలు చూపుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కుంటల్లతండా రైతులు

**టేకులపల్లి:** తాతలకాలం నుంచి సాగుచేసుకొంటున్న భూములకు పట్టాలు మంజూరుకాకపోవడంతో గిరిజన రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలతోపాటు బ్యాంకుల్లో పంట రుణాలు పొందులేకపోతున్నారు. రెవెన్యూ అధికారులకు అనేకసార్లు దరఖాస్తు చేసినప్పటికీ.. పట్టాల మంజూరు కలగానే మిగిలిపోయింది. దీంతో రైతులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కుంటల్లతండాలో సుమారు 15 కుటుంబాలు ఆరేడు దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. సదరు భూములు 1960 కంటే ముందు నుంచి కూడా 1-బీలో ఒకరిద్దరు భూస్వాముల పేరిట ఉండటం, ఆ రికార్డులను అప్‌డేట్ చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఆ భూములకు సంబంధించిన క్రయవిక్రయాలను కేవలం దస్తావేజుల్లో మాత్రమే జరుపుతూ కాలంవెళ్లదీస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలుచేస్తున్న నేపథ్యంలో వాటికి దూరమైన రైతులు ఇప్పటికైనా తమకు పట్టాలు మంజూరుచేయాలని ఏడాదిగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వారు చెప్పిన వివరాల ప్రకారం.. కుంటల్లతండాకు చెందిన బానోత్ బాలుకు 5 ఎకరాలు, బానోత్ మంగ్యాకు 4 ఎకరాలు, బానోత్ ద్వాళీకి 15 ఎకరాలు, బానోత్ బాలుకు 5.20 ఎకరాలు, బానోత్ బావ్‌సింగ్‌కు 5 ఎకరాలు, బానోత్ వాలుకు 4.30 ఎకరాలు, కేళోత్ గామియాకు 3 ఎకరాలు, ఇస్లావత్ హేమ్లాకు 3 ఎకరాలు, బానోత్ శంకర్‌కు 5 ఎకరాల చొప్పున భూమి ఉన్నది. వీరికి సంబంధిచిన భూములు 170/4 సర్వే నంబర్‌లో నమోదై ఉన్నప్పటికీ వీరికి పట్టాలు మంజూరుకావడంలేదు.

### తాతలకాలం నుంచి సాగుచేస్తున్నాం

మా తాతలతండ్రుల కాలం నుంచి భూములను సాగుచేసుకొంటున్నాం. రెవెన్యూరికార్డుల్లో అనాదిగా ఒకరిద్దరి పేర్ల మీద భూములు ఉండటంతో మాకు పట్టాలు రావడంలేదు. ఇప్పటివరకు కంప్యూటర్ పట్టా (ఆన్‌లైన్ పహాణీ) ఎలా ఉంటుందో కూడా మాకు తెలియదు. పట్టాల కోసం పదులసార్లు దరఖాస్తు చేసినం. పట్టాలు రాలేదు. రైతుబీమా, రైతుబంధు ప్రభుత్వ పథకాలకు అర్హత పొందలేకపోతున్నాం. నాకు ఐదెకరాలకు, నా భార్య ద్వాళీ పేరిట రెండెకరాలకు పట్టా రావాలి.

- బానోత్ బాలు, రైతు, కుంటల్లతండా

### ఉన్నతాధికారులు స్పందించి పట్టాలివ్వాలి

మా నాన్న పేరిట ఐదెకరాల భూమి ఉన్నది. మేము ఇద్దరం అన్నదమ్ములం. వారసత్వపట్టా కోసం పలుమార్లు దరఖాస్తుచేశాం. ఇంతవరకు రాలేదు. మా గ్రామంలో ఒకరిద్దరికి తప్ప ఎవరికీ పట్టాలులేవు. ఉన్నతాధికారులు స్పందించి మాకు పట్టాలు మంజూరుచేయించాలి.

- బానోత్ హరిలాల్, రైతు, కుంటల్లతండా

### పట్టాల కోసం తిరుగుతున్నాం

తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలులేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడంలేదు. చాలా నష్టపోయాం. గత ఏడాదిగా పట్టాల కోసం తిరుగుతున్నా పని కావడంలేదు. పదేపదే తిప్పుతున్నారు. సర్వే నంబర్ 170/4లో 8ఎకరాల భూమికి పట్టా రావాలి. మాకు న్యాయంచేయండి.

- కేళోత్ షక్రు, రైతు, కుంటల్లతండా

### సమస్యను పరిష్కరిస్తాం

నేను కొత్తగా బాధ్యతలు తీసుకున్నాను. కుంటల్లతండా రైతుల సమస్య మా దృష్టికి వచ్చింది. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం.

- గౌతమ్, టేకులపల్లి తాసిల్దార్




సోమవారం హైదరాబాద్‌లోని హైదరగూడలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస గృహసముదాయాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో స్పీకర్ పోచారం, మండలి తాత్కాలిక చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఈటల, తలసాని, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, జీహెచ్ఎంసీ మేయర్ రామ్మోహన్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాస సముదాయంలో గృహప్రవేశం చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

# ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను ప్రారంభించిన కేసీఆర్

- నిర్మాణాలు, సౌకర్యాలు బాగున్నాయని ప్రశంసించిన సీఎం
- వెంటనే కేటాయించాలని అధికారులకు సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల కోసం హైదర్‌గూడలో కొత్తగా నిర్మించిన నివాస సముదాయాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. సోమవారం ఆయన అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు శాసనసభా వ్యవహారాలు, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి పూజలు నిర్వహించి ఈ క్వార్టర్స్‌ను ప్రారంభించారు. అనంతరం క్వార్టర్స్‌లో కేసీఆర్ కలియతిరిగి నిర్మాణాలను పరిశీలించారు. భవన నిర్మాణ వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. ఈ నిర్మాణాలు, వసతులు బాగున్నాయని మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ప్రశంసించారు. ఈ క్వార్టర్స్‌ను వెంటనే ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కేటాయించాలని అధికారులకు సూచించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, ఈటల రాజేందర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జీ జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఏ ఇంద్రకరణ్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహచార్యులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 120 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివసించేలా రూ.166 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవన సముదాయాన్ని నిర్మించారు.

**ఆహ్లాదకర పచ్చదనం.. విశాలమైన గదులు**

ఆహ్లాదకరమైన పచ్చదనం మధ్య విశాలమైన గదులు, అద్దంలా మెరిసే కారిడార్లు, అత్యాధునిక బాత్‌రూంలు, వంటగది, విశాలమైన హాల్, వెయిటింగ్ రూం, డైనింగ్ హాల్‌తో ఒక్కో క్వార్టర్స్‌ను 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది కూర్చోవడానికి వీలుగా ఒక గదిని నిర్మించారు. అన్ని గదుల్లోనూ కప్‌బోర్డులు, ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటుచేసి నాణ్యమైన పెయింట్ వేశారు. ఈ భవన సముదాయానికి లాన్‌తోపాటు ఆరు లిఫ్టలను ఏర్పాటుచేశారు. తమను కలవడానికి వచ్చేవారి ప్రజలతో ఎమ్మెల్యేలు భేటీ అయ్యేందుకు గ్రౌండ్ ఫ్లోర్‌లో 23 క్యాబిన్‌లను ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రెండు కార్లను పార్క్‌చేసుకునే వీలు కల్పించారు. రూ.166 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 4 ఎకరాల 26 గుంటల స్థలంలో ఈ భవన సముదాయం నిర్మితమైంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎటువైపు చూసినా పచ్చదనం కనిపించేలా మొక్కలను పెంచారు. ఈ భవన సముదాయానికి అనుబంధంగా 325 చదరపు అడుగులతో 120 సర్వెంట్ క్వార్టర్స్‌ను, సిబ్బందికి 36 క్వార్టర్స్‌ను నిర్మించారు. మొత్తం విస్తీర్ణం 34వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నిర్మాణాలు జరిగాయి.



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాస సముదాయం

# డిగ్రీ కాలేజీల్లో తొలి విడుత 70 వేలమందికి ప్రవేశాలు

- రెండో విడుత కౌన్సెలింగ్‌కు 66 వేల మంది హాజరు
- వారికి 20న సీట్ల కేటాయింపు
- అదే రోజునుంచి మూడో విడుతకు పేర్ల నమోదు
- 'దోస్త్' కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తొలి విడుత కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇందులో 1,05,346 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించగా.. 70,153 మంది విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేశారని దోస్త్-2019 కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి వెల్లడించారు. రెండో విడుత కౌన్సెలింగ్‌కు కొత్తగా 34,733 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, రెండో విడుత వెబ్ కౌన్సెలింగ్‌లో మొత్తం 66,299 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరిలో తొలి విడుత రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు, సీట్లు పొంది కాలేజీల్లో రిపోర్టు చేసినవారు కలిపి 31,566 మంది ఉన్నారని, రెండో విడుత కౌన్సెలింగ్‌లో పాల్గొన్నవారికి ఈ నెల 20న సీట్లు కేటాయిస్తామని వివరించారు. మూడో విడుత దోస్త్ కౌన్సెలింగ్‌లో పాల్గొనదలిచిన విద్యార్థులు అదే రోజు (20వ తేదీ) నుంచి పేర్లు నమోదుచేసుకోవాలని ప్రొఫెసర్ లింబాద్రి పేర్కొన్నారు.



సచివాలయం ఎల్ బ్లాక్ నుంచి ఏపీకి చెందిన ఫర్నిచర్ ఇతర ఫైళ్లను అమరావతికి తరలిస్తున్న దృశ్యం

# జల భాండాగారం

## బేసిన్‌లోనే అత్యధిక జలాల నిల్వకు వేదికగా తెలంగాణ

### ఒక్క కాళేశ్వరం పరిధిలోనే 141 టీఎంసీల రిజర్వాయర్లు.. 100 మీటర్ల నుంచి 600 మీటర్లకు జలాల తరలింపు

### ఆసియాలోనే అతి పెద్ద 139 మెగావాట్ల మోటరు వినియోగం.. రికార్డులకు కేంద్ర బిందువుగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం



మేడిగడ్డ బరాజ్ (ఫైల్)

**అన్ని ఎత్తిపోతల పథకాలు ఒక ఎత్తు.. కాళేశ్వరం ఒక ఎత్తు! అనేక ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లు, కాల్వలు, సొరంగాల సమాహారంగా నిర్మితమవుతున్న ఈ అద్భుతకట్టడం వెనుక అనే ఆసక్తికర అంశాలున్నాయి.. విస్తుపోయే వాస్తవాలున్నాయి.. విచిత్రమనిపించే విషయాలున్నాయి! నీరు పల్లమెరుగు అనే నానుడిని మార్చి.. పల్లం నుంచి ఎగువకు నీరు ఎగబాకే అద్భుతం ఈ ప్రాజెక్టు సొంతం! ఒక ఉప నది.. ఓ మహా నదీగర్భాన్ని జలంతో నింపి.. నదినే రిజర్వాయర్‌గా మలిచే విశేషం ఇది! పూర్వపు ప్రాణహిత- చేవెళ్ల ఎత్తిపోతల పథకం లోపాలను సవరించి, రీడిజైన్ చేయడంతో ఓ మహా జల భాండాగారంగా అవతరించిన స్వరూపమే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. తలాపున గోదారి పారుతున్నా.. దశాబ్దాల తరబడి గోసపడుతున్న తెలంగాణ రైతాంగానికి వరప్రదాయనికానున్న ప్రాజెక్టు పూర్వాపరాలు, విశేషాలే ఈ కథనం!**

**గుండాల కృష్ణ**
**హైదరాబాద్, నమస్తే తెలంగాణ**

ప్రాణహిత జలాలను తెలంగాణ బీడు భూములకు మళ్లించాలనే ఆలోచనతో ఉమ్మడి ఏపీ సర్కారు మహారాష్ట్రతో 1978లోనే ఒప్పందం చేసుకుంది. కానీ గోదావరిపై ప్రాజెక్టులు కడితే ధవళ్వేరం బరాజ్‌కు నీటి ప్రవాహం తగ్గుతుందనే కుయుక్తితో సమైక్య పాలకులు దశాబ్దాలపాటు విస్మరించారు. చివరకు 2007లో తమ్మిడిహట్టి దగ్గర బరాజ్ నిర్మించి 160 టీఎంసీల నీటిమళ్లింపు ద్వారా 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ. 17,875 కోట్ల అంచనా వ్యయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టింది. కానీ.. 19 నెలలపాటు తట్టెడు మట్టి పనులు చేయకుండానే వ్యయాన్ని రూ. 38,500 కోట్లకు, తదుపరి 2010లో రూ. 40,300 కోట్లకు పెంచారు. కానీ.. దీనికి కీలకమైన మ హారాష్ట్రతో అంతర్రాష్ట్ర ఒప్పందాన్ని మాత్రం పట్టించుకోలేదు. 2014 జూన్ వరకు ప్రాజెక్టుపై రూ.7వేల కోట్లకు పైగా ఖర్చు చేసినా.. గోదావరి నది నుంచి నీటిని మళ్లించేందుకు డిజైన్ చేసిన తమ్మిడిహట్టి బరాజ్ పనుల్ని అసలు మొదలే పెట్టలేదు. అంటే తల వదిలి.. ఎడాపెడా కాల్వలు, టన్నెల్స్ తవ్వడంతోనే 'సంతృప్తి' చెందారు. ఫలితంగా ప్రజాధనం రూ. 7వేల కోట్లకు పైగా ఖర్చయింది. ఒక్క నీటి చుక్క పొలాలకు పారలేదు. తమతో ఒప్పందం చేసుకోకుండా వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరవుతుందంటూ 2013లో అప్పటి మహారాష్ట్ర సీఎం పృధ్వీరాజ్ చౌహాన్, అప్పటి ఏపీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి తీవ్ర హెచ్చరికతో లేఖరాశారు. కానీ ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఉలకలేదు.. పలుకలేదు.

**అంగీకరించని మహారాష్ట్ర**

తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం వెనువెంటనే ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుపై దృష్టిసారించింది. ఈ ప్రాజెక్టును తమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మించి, త్వరితగతిన రైతులకు నీళ్లు ఇవ్వాలని ఆకాంక్షించింది. ఆ మేరకు అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు 2014 జూలైలో ముంబై వెళ్లి మహారాష్ట్ర జలవనరులశాఖ మంత్రితో సమావేశమయ్యారు. కానీ.. అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం ససేమిరా అన్నది. అక్కడ ఎన్నికలు పూర్తై, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ స్వయంగా 2015 ఫిబ్రవరి 15న ముంబై వెళ్లి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు తామే దీనిని వ్యతిరేకించి, ఇప్పుడెలా అంగీకరిస్తామంటూ ఆయన కూడా ఆసక్తిచూపలేదు. ఈ సమయంలోనే కేంద్ర జల సంఘం నుంచి 2015 మార్చి 4న ప్రాణహిత- చేవెళ్ల డిజైన్‌లోని (కాంగ్రెస్ హయాంలో తయారుచేసింది) కీలక లోపాలను ఎత్తి చూపుతూ లేఖ వచ్చింది. ఒకవైపు మహారాష్ట్ర అభ్యంతరం, మరోవైపు డిజైన్‌లోనే లోపం.. ఇక ఒక్క అడుగు కూడా ముందుకుపోలేమన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది.

**కేంద్ర జల సంఘం ఎత్తి చూపిన లోపాలు**

తమ్మిడిహట్టి దగ్గర 273.14 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని డీపీఆర్‌లో పేర్కొన్నా.. వాస్తవానికి నీటి లభ్యత 165 టీఎంసీలేనని సీడబ్ల్యూసీ తేల్చి చెప్పింది. అందులో ఎగువ రాష్ట్రాలు 63 టీఎంసీలు వాడుకుంటే మిగిలేది 120 టీఎంసీలైతే.. తమ్మిడిహట్టి నుంచి 160 టీఎంసీలు ఎలా తరలిస్తారు? 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు ఎలా అందిస్తారు? అని ఘాటుగా విమర్శించింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో కేవలం 11.43 టీఎంసీల నీటి నిల్వ కోసం రిజర్వాయర్లు ప్రతిపాదించారు. దీంతో ఈ నిల్వ సామర్థ్యం సరిపోనందున కొత్త రిజర్వాయర్లైనా నిర్మించుకోవాలని లేకపోతే ఆన్‌లైన్ రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించింది. తమ్మిడిహట్టి నుంచి 160 టీఎంసీలను లిఫ్టు చేయాల్సి ఉండగా.. డీపీఆర్‌లోని పంపుల సామర్థ్యాన్ని పరిశీలిస్తే 90 టీఎంసీలు మాత్రమే ఉందనే మరో బండారాన్ని బయటపెట్టింది. ఇదేదో కాంట్రాక్టర్ల హితంకోసం చేపడుతున్నదా? అనే అనుమానాన్నీ వ్యక్తంచేసింది.

**చారిత్రాత్మక ఒప్పందం..**



మేడిగడ్డ బరాజ్ నిర్మాణానికిగాను మహారాష్ట్రతో ఒప్పందం చేసుకునేందుకు 2016 మార్చి 8న తెలంగాణ-మహారాష్ట్ర అంతర్రాష్ట్ర బోర్డు ఏర్పాటుచేశారు. ఆ తర్వాత జరిగిన బోర్డు సమన్వయ, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో రెండు రాష్ట్రాల ఇంజినీర్లు విస్తృతంగా సాంకేతిక చర్చలు జరిపారు. తుదకు సాంకేతిక అంశాలన్నీ కొలిక్కిరావడంతో 2016 ఆగస్టు 23న తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు కే చంద్రశేఖర్‌రావు, దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో రెండు రాష్ట్రాల మధ్య చారిత్రక అంతర్రాష్ట్ర ఒప్పందం సాకారమైంది. అంటే కేవలం తొమ్మిది నెలల వ్యవధిలోనే డిజైన్ చేసి, ప్రాజెక్టును పట్టాలెక్కించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కింది. నీటి లభ్యత విషయంలో మేడిగడ్డ మేలైన ఎంపికగా కేంద్ర జల సంఘం కూడా ధ్రువీకరించింది.

**నీటి వినియోగం..**

| | |
|---|---|
| కొత్త ఆయకట్టుకు సాగునీరు: | 134.50 టీఎంసీలు |
| హైదరాబాద్ తాగునీటి అవసరాలు: | 30 టీఎంసీలు |
| ఎన్‌రూటెడ్ గ్రామాల తాగునీటి అవసరాలు: | 10 టీఎంసీలు |
| పారిశ్రామిక అవసరాలు: | 16 టీఎంసీలు |

**నదికే నడక నేర్పిన రీడిజైనింగ్**

మహారాష్ట్ర అభ్యంతరం.. కేంద్ర జల సంఘం ఎత్తిచూపిన సాంకేతిక లోపాలు.. ప్రాణహిత-



చేవెళ్ల అడుగు ముందుకు వేయలేని పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ ఒక ఇంజినీర్‌లా రీడిజైనింగ్ చేపట్టారు. ఆ క్రమంలో లైడార్ సర్వేలు, నిపుణుల సూచనలు, కేంద్ర జలసంఘం రికార్డుల పరిశీలన, వ్యాప్కోస్ నివేదిక.. ఇలా జరిగిన మేధోమథనం ద్వారా రూపుదిద్దుకున్నదే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. బీడు భూముల్లోకి పారాల్సిన గోదావరిజలాలు దిగువకు పరుగులు పెడుతుంటే.. వాటిని బరాజ్‌ల్లో ఒడిసిపట్టి నదీ మార్గంలోనే వెనక్కి తరలించేలా రూపొందించిన రీడిజైన్.. నదికే నడక నేర్పింది. తమ్మిడిహట్టి బరాజ్ ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్ చేసి.. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల వంటి వరుస బరాజ్‌ల ద్వారా తరలించే గోదావరిజలాలతో కాళేశ్వరం ప్రాజెక్టు కింద దాదాపు 40 లక్షల ఎకరాలకు జీవంపోసేలా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. నదీ ప్రవాహమార్గంలోనే రివర్స్‌బుల్ పంపింగ్ ద్వారా సుమారు 35వేల ఎకరాల ముంపును నదీగర్భానికే పరిమితం చేయడమనేది కాళేశ్వరం ప్రత్యేకత.



**112 గంటల లైడార్ సర్వే..**

దేశంలోనే తొలిసారిగా సాగునీటి ప్రాజెక్టు డిజైన్ కోసం తెలంగాణ సర్కారు అత్యాధునిక లైడార్ సర్వేను చేపట్టింది. 2015 ఆగస్టులో 29 రోజులపాటు 112 గంటలు, 3550 చదరపు కిలోమీటర్ల పరిధిలో సర్వేతో గోదావరి సాంకేతిక గుట్టును బయటికితీశారు. అందులో భాగంగానే అత్యధిక నీటి లభ్యత ఉన్న ప్రాంతంగా మేడిగడ్డను గుర్తించి.. అక్కడ ప్రధాన బరాజ్ నిర్మాణాన్ని చేపట్టారు.

**కాళేశ్వరం ప్రాజెక్టు ముఖచిత్రం**

| | |
|---|---|
| ప్రాజెక్టు అంచనా వ్యయం | : రూ.80,499.71 కోట్లు |
| లిఫ్టులు | : 20 |
| పంపుహౌస్‌లు | : 19 |
| అవసరమయ్యే విద్యుత్ | : 4992.47 మెగావాట్లు (రోజుకు రెండు టీఎంసీలు ఎత్తిపోస్తే), 7,152 మెగావాట్లు (రోజుకు మూడు టీఎంసీలు ఎత్తిపోస్తే) |

**కాళేశ్వరం ప్రత్యేకతలు**

- సంవత్సరకాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్నిరకాల అనుమతులు సాధించడం దేశంలోనే రికార్డు.
- ఆసియా సాగునీటిరంగ చరిత్రలోనే తొలిసారిగా 139 మెగావాట్ల (రామడుగు పంపుహౌస్) సామర్థ్యం ఉన్న మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోయనున్నారు.
- వరుస బరాజ్‌లతో 199 కిలోమీటర్ల మేర గోదావరి ఏడాది మొత్తం నీటితో సజీవంగా కళకళలాడనున్నది.
- మేడిగడ్డ బరాజ్ ఎఫ్ఆర్ఎల్ 100 మీటర్లు. ఆపై వివిధ దశల్లో నీటిని ఎత్తిపోస్తారు. ఇలా తెలంగాణ పరిధిలో గరిష్ఠంగా సముద్రమట్టానికి 618 మీటర్ల ఎత్తువరకు (కొండ పోచమ్మ రిజర్వాయర్) జలాల్ని తీసుకుపోనున్నారు. అంటే ఈ ప్రాజెక్టులో గోదావరి జలాల్ని దాదాపు 518 మీటర్ల మేర ఎత్తునకు తరలిస్తారు.



**కాళేశ్వరం నీటి వినియోగం ఇలా..**

| అంశాలు | నీటి పరిమాణం టీఎంసీల్లో |
|---|---|
| గోదావరి నుంచి మళ్లింపు | 195 |
| ఎల్లంపల్లి ప్రాజెక్టు కమాండ్ ఏరియా నుంచి వచ్చే అదనపు గోదావరిజలాలు | 20 |
| ఎల్లంపల్లి వద్ద నీటి లభ్యత | 215 |
| చెరువుల ద్వారా | 10 |
| ఇరిగేషన్ రీచార్జి ద్వారా భూగర్భజలాలు | 25 |
| ఆవిరి నష్టాలు | 10 |
| ప్రాజెక్టుకు నికర నీటి లభ్యత (ఎల్లంపల్లి+చెరువులు+భూగర్భజలాలు) | 250 |
| నీటి ఆవిరి నష్టం | 10 |
| మొత్తం | 240 |

**కొత్త రిజర్వాయర్ల ద్వారా నీటి నిల్వ (టీఎంసీల్లో)**




# మైనార్టీ స్టడీ సర్కిల్‌లో.. ఉచితంగా సివిల్స్ శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మైనార్టీ విద్యార్థులకు సివిల్స్ శిక్షణ ఉచితంగా ఇవ్వనున్నట్టు మైనార్టీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బీ షఫీఉల్లా తెలిపారు. ఈ నెల 20 నుంచి జూలై 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మైనార్టీ స్టడీసర్కిల్ నిర్వహించే పోటీపరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా వందమందిని శిక్షణకు ఎంపికచేస్తామని తెలిపారు. వారికి ప్రైవేట్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్లు స్పాన్సర్ చేస్తాయన్నారు. దరఖాస్తు చేసుకోవటానికి www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. వచ్చేనెల 14న హైదరాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, సంగారెడ్డి, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

# 18 నుంచి ఓపెన్ వర్సిటీ ప్రవేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో యూజీ, పీజీ కోర్సులకు ఈ నెల 18 నుంచి ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ, పీజీ డిప్లొమాలో పలు రకాల సర్టిఫికెట్ కోర్సులకు ప్రవేశాలు ఉంటాయని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. పూర్తి వివరాల కోసం www.braouonline.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. 2018-19 విద్యాసంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులతోపాటు అంతకు ముందు సంవత్సరం సకాలంలో ఫీజు చెల్లించలేని విద్యార్థులకు ఆగస్టు 16 వరకు ఫీజులు చెల్లించే అవకాశాన్ని కల్పించామని, మరిన్ని వివరాల కోసం ఓపెన్ యూనివర్సిటీ సహాయ కేంద్రం 73829 29570/ 580/ 600 నంబర్లకు ఫోన్‌చేయాలని తెలిపారు. డిగ్రీ ఓల్డ్ బ్యాచ్ రెండో, మూడో సంవత్సరం విద్యార్థులు (2011-12 విద్యా సంవత్సరం నుంచి 2015-16 వరకు) కూడా ట్యూషన్ ఫీజులు చెల్లించవచ్చని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

# ఆన్‌లైన్ ద్వారా టీసీలు

- ఈ ఏడాది నుంచే అమలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యార్థులు పాఠశాల మారేందుకు అవసరమయ్యే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లను (టీసీలను) ఆన్‌లైన్ ద్వారా జారీచేయాలని పాఠశాల విద్యాశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలుచేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇకమీదట విద్యార్థులు టీసీల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

# బొగ్గు ఉత్పత్తి పెంచాలి

- హరితహారం ముమ్మరంగా చేపట్టాలి
- సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో తగినన్ని బొగ్గు నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలని, ఉత్పత్తి లక్ష్యాన్ని త్వరగా చేరుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సింగరేణిభవన్ నుంచి అన్ని ఏరియా జీఎంలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు. ఆర్జీ ఓసీ-3, ఖైరిగూడ, ఇతర ఓపెన్‌కాస్ట్‌లతో పాటు.. భూగర్భగనులైన కేటీకే-8, వీకే-7, ఆర్కే-8, జీడీకే-1, జీడీకే-2, 2ఏ, శాంతిఖని, శ్రీరాంపూర్ ఏరియా గనుల్లో ఉత్పత్తి పెంచాలన్నారు. కొత్త ఓసీల కోసం స్థలసేకరణ వేగవంతం చేయాలన్నారు. ఇందారం, కేటీకే 3, కోయగూడెం 3, జీడీకే-5 ఓపెన్ కాస్టులను సత్వరమే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారంలో భాగంగా గతంలో కంటే ఎక్కువగా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు.



నాకు ఎవరితో వ్యక్తిగత శత్రుత్వం లేదు. మేం ప్రజాప్రతినిధులం. బీజేపీ వారు కూడా ప్రజాప్రతినిధులే. మేం ప్రజల సమస్యలపై గొంతెత్తుతాం. పార్లమెంటులో మాట్లాడుతాం. అంతే కానీ యుద్ధభూమిలో లాగా పోట్లాడుకోం.

**అధిర్ రంజన్ చౌదరి, పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ నేత**

వైద్యుల భద్రత కోసం కొత్త చట్టాన్ని తెచ్చే అవకాశాలపై అధ్యయనం చేస్తున్నాం. ఈ విషయంలో మమతా బెనర్జీతో సహా ముఖ్యమంత్రులందరికీ లేఖ రాశాను. అట్లనే మేము కూడా కేంద్రంలో కొత్త చట్టాన్ని తీసుకునిరావడానికి ప్రయత్నిస్తాం.

**హర్షవర్ధన్, కేంద్ర ఆరోగ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1682**

అమెరికాలోని ఫిలడెల్ఫియాను కనుగొన్న విలియం పెన్.

**1815**

వాటర్‌లూ యుద్ధం. నెపోలియన్ సేనలను ఓడించిన బ్రిటిష్ సేనలు.






**1946**

పోర్చుగీసు పాలన నుంచి గోవా విముక్తి కోసం ప్రత్యక్ష పోరాటానికి పిలుపునిచ్చి రామ్ మనోహర్ లోహియా.

పాఠశాల విద్యకు బడ్జెట్ తగ్గించడం బ్రిటన్ ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల్లో ఒకటి. ప్రధాని పదవి నుంచి వైదొలుగుతున్న థెరెసా మే పాఠశాల విద్యారంగానికి మూడేండ్ల కోసం 27 బిలియన్ పౌండ్లు కేటాయించాలని నిర్ణయించారు. కానీ ఆమె అధికారంలో ఉన్నంతకాలం విద్యారంగం పట్ల చిన్నచూపు చూశారు. 2009 నుంచి పాఠశాల విద్యకు నిధులు 8 శాతం తగ్గాయి. 21వ శతాబ్దంలో కూడా పాఠశాల వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య తేడా ఉండటం మన దేశానికి చెరిగిపోని మచ్చ.

**ది గార్డియన్**

ఒకప్పుడు యురోపియన్ యూనియన్ అంటే ఆచితూచి మాట్లాడుతుందనే అభిప్రాయం ఉండేది. కానీ ఇటీవల శ్రీలంక వచ్చిన ఈయూ బృందం ఇక్కడి మీడియా ఒక సామాజికవర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదనే ప్రకటన ఇచ్చింది. ఈ యురోపియన్ 'మానవ హక్కుల దేవుళ్ల'కు తమ దేశాలలో జరిగేది కనిపించదు. వీరు శ్రీలంక పరిస్థితులపై ప్రకటన జారీచేసిన సమయంలోనే స్విట్జర్లాండ్‌లో మహిళలు తమకు పురుషులతో సమాన వేతనం ఉండాలని డిమాండ్ చేస్తూ ఊరేగింపు తీశారు. మిగతా కొన్ని యురోపియన్ దేశాలలో కూడా ఇటువంటి పరిస్థితులే ఉన్నాయి.

**ది ఐలాండ్**



# వైద్యులకు భద్రత

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సమావేశమైన అనంతరం వైద్యులు సమ్మె విరమించడం హర్షణీయం. రాజకీయనాయకులు కొందరు మాట్లాడుతున్న తీరు వల్ల సమస్య మరింత జటిలమవుతున్నదనే ఆందోళన కలిగింది. కానీ ఇరుపక్షాలు విజ్ఞతతో వ్యవహరించి ఉద్రిక్తలను సడలింపజేశాయి. 'మా వైద్యులు మాకు గర్వకారణం. మా ప్రభుత్వం పట్ల మీకు కోపంగా ఉండవచ్చు. కానీ దయచేసి విధులకు వెళ్ళండి. మీరు సమ్మె విరమిస్తే సంతోషిస్తా' అని ముఖ్యమంత్రి అంటే, 'ముఖ్యమంత్రి మా సంరక్షకురాలు' అని వైద్యుల ప్రతినిధులు వ్యాఖ్యానించారు. సమస్యను పరిష్కరించు కోవడానికి వచ్చామని, అవాంఛనీయ ఘటనలపై చర్య తీసుకోవాలని వైద్యులు విజ్ఞప్తిచేశారు. మమతాబెనర్జీ వైద్యుల భద్రతకు ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వ దవాఖానలలో పనిచేస్తున్న వైద్యులు తగిన మౌలిక సదుపాయాలు లేకపోవడంతోపాటు, విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడులు ఎదుర్కొంటున్నారు. వైద్యులపై ఈ మధ్యకాలంలో రోగుల బంధువులు దాడులకు పాల్పడుతుండటం తీవ్రంగా ఖండించవలసిన విషయం. పశ్చిమబెంగాల్‌లో ఇటీవల రోగి బంధువులు దాడిచేయడంతో వైద్యులు సమ్మెకు దిగారు. ఈ నిరసనలు ఇతర రాష్ర్టాలకు కూడా విస్తరించాయి. భారతీయ వైద్యసంఘం కూడా దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపు ఇచ్చింది. ఈ దాడి, తదనంతర సమ్మెపై సాగిన రాజకీయం సంగతి ఎట్లా ఉన్నా, వైద్యులపై దాడులు ఎందుకు సాగుతున్నాయి, వారికి భద్రత కల్పించడంతోపాటు వైద్య రంగంలో చేపట్టవలసిన సంస్కరణలు ఏమిటనే విషయమై విస్తృతంగా చర్చించవలసి ఉన్నది.

వైద్యరంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చొరవ తీసుకోవలసిన కేంద్ర ప్రభుత్వం వైద్యుల సమ్మె ఉదంతాన్ని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని మరింత వేధించడానికి ఉపయోగించుకున్నది. పశ్చిమబెంగాల్‌లో అధికారాన్ని చేపట్టడానికి ఆరాటపడుతున్న బీజేపీ ఈ ఘటనను మతం రంగు పులమడానికి ప్రయత్నించడం మరీ దారుణం. ఒక మతానికి చెందిన వారు దాడిచేశారని పేర్కొంటూ, ఓట్ల రాజకీయం కోసం మమతాబెనర్జీ వారిపై చర్య తీసుకోవడం లేదని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు. వైద్యులది, దాడిచేసిన వారిది వేర్వేరు మతాలు కావడం యాదృచ్ఛికం. ఆ క్షణంలో వైద్యులకు కానీ, రోగి బంధువులకు కానీ మత పరమైన భావన ఏ మాత్రం లేదు. వైద్య రంగంలో ఇటీవల కొన్ని అవాంఛనీయ పోకడలు చోటు చేసుకుంటుండవచ్చు. ఇందుకు విధాన పరమైన కారణాలున్నాయి. కానీ వైద్యులు కులమత వివక్షతో వ్యవహరించిన సందర్భాలు పశ్చిమ బెంగాల్‌లోనే కాదు మరే రాష్ట్రంలోనూ లేవు. రాజకీయ లబ్ధి కోసం ఇటువంటి సామాజిక విభజనలు తేవడం మంచిది కాదు. వైద్యులపై దాడులు పశ్చిమ బెంగాల్‌కే పరిమితమైనవి కావు. అందుకే దేశవ్యాప్తంగా వైద్యులలో కదలిక కనిపించింది. మహారాష్ట్ర వైద్యులు తమకు మారణాయుధాలు కలిగి ఉండేందుకు అనుమతించాలని కోరారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వైద్యులపై దాడులు జరుగకుండా పలు రాష్ర్టాలు చట్టాలు కూడా చేశాయి. కానీ ఇవేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. అందువల్ల సమస్య ఎక్కడున్నదనేది మరింత లోతుగా చర్చించుకోవడం అవసరం. అందుకు కేంద్ర ప్రభుత్వం, వైద్య సంఘాలు ముందుకు రావాలె.

> **వైద్య చికిత్సలో లోపాలున్నా, అవసరం లేకున్నా పరీక్షలు, శస్త్రచికిత్సలు జరిపినా, ఎక్కువ ఫీజులు వసూలు చేసినా రోగులకు న్యాయం చేసే సమర్థవంతమైన వ్యవస్థ ఇప్పటికీ లేదు. ప్రజలకు చౌకగా, సమర్థవంతమైన వైద్యాన్ని అందుబాటులోకి తేవడానికి కూడా ప్రభుత్వాలు ప్రయత్నించడం లేదు. దీని వల్ల ప్రజలకు ఈ వ్యవస్థపై కూడా ఎప్పుడో ఒకసారి అసంతృప్తి పెల్లుబుకవచ్చు. రాజకీయపక్షాలు తమ స్వార్థ ప్రయోజనాలకు అతీతంగా వ్యవహరించి, వైద్యులకు భద్రత, రోగులకు వైద్యం కల్పించే విషయంపై దృష్టి సారించాలె.**

ఏదైనా ఒక చికిత్సలో వైద్యుడి ప్రయత్నంలో లోపం ఉండకపోవచ్చు. అయినా దాడి జరుగడానికి కారణాలు ఇతరమైనవై ఉంటాయి. వైద్యులపై విశ్వాసం సన్నగిల్లడం వల్ల కూడా దాడులు జరుగుతుంటాయి. అందువల్ల వైద్యులపై నమ్మకం పెంచడం ఎట్లా అనేది కూడా ఆలోచించాలె. సర్కారు దవాఖానకు పోయినప్పుడు అక్కడి వ్యవస్థ రోగి బంధువులకు ఇబ్బంది కలిగించేదిగా ఉంటుంది. ఒక విద్యార్థి లేదా వికలాంగుడు ఏదైనా ధ్రువపత్రం కోసం వెళ్ళినా అక్కడ పట్టించుకునేవారుండరు. అదే వైద్యం కోసమే అయితే అక్కడి పరిస్థితులు రోగి బంధువులకు ఆవేదనను, ఆగ్రహాన్ని కలిగిస్తాయి. రోగి మరణించినప్పుడు ఆ ఆగ్రహం వైద్యుడిపైకి మళ్ళుతుంది. రోగులకు కూడా హక్కులుంటాయి. వారికి సమాచారం అందించవలసిన బాధ్యత వైద్య వ్యవస్థకు ఉంటుంది. అందువల్ల రోగులకు సమాచారం అందించడానికి, వారికి అనుమానాలుంటే నివృత్తి చేయడానికి, ఫిర్యాదులు ఉంటే స్వీకరించి పరిష్కరించడానికి తగిన వ్యవస్థ ఏర్పాటు చేయాలె. ప్రైవేటు వైద్యరంగ పోకడలు కూడా ప్రజలలో ఆగ్రహానికి కారణమవుతున్నాయి. ఎప్పుడో ఒకసారి ఈ ప్రైవేటు వైద్య వ్యవస్థపై కూడా ప్రజల ఆగ్రహం బయటపడవచ్చు. వైద్య చికిత్సలో లోపాలున్నా, అవసరం లేకున్నా పరీక్షలు, శస్త్రచికిత్సలు జరిపినా, ఎక్కువ ఫీజులు వసూలు చేసినా రోగులకు న్యాయం చేసే సమర్థవంతమైన వ్యవస్థ ఇప్పటికీ లేదు. ప్రజలకు చౌకగా, సమర్థవంతమైన వైద్యాన్ని అందుబాటులోకి తేవడానికి కూడా ప్రభుత్వాలు ప్రయత్నించడం లేదు. దీనివల్ల ప్రజలకు ఈ వ్యవస్థపై కూడా ఎప్పుడో ఒకసారి అసంతృప్తి పెల్లుబుకవచ్చు. రాజకీయపక్షాలు తమ స్వార్థ ప్రయోజనాలకు అతీతంగా వ్యవహరించి, వైద్యులకు భద్రత, రోగులకు వైద్యం కల్పించే విషయంపై దృష్టి సారించాలె.

విశ్లేషణ



**రాజేష్ సేరుపల్లి**

# ప్రజాస్వామ్యానికే ప్రమాదం

పొలిటికల్ కన్సల్టెన్సీలలో పనిచేసేవారంతా సాధారణంగా పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీల నుంచి వచ్చిన వారుంటారు. ఐఐటీ, ఐఐఎం, టీఐఎస్ఎస్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లోనుంచి వచ్చిన వారికి చాలా ఆకర్షణీయమైన జీవభత్యాలుంటాయి. వారు నిర్దేశిత లక్ష్యంతో అహర్నిశలు పనిచేస్తారు. అనుకున్న ఫలితాలను రాబడుతారు. దానికోసం వారు తమ శక్తియుక్తులను, నైపుణ్యాలను వెచ్చిస్తారు.

సరళీకరణ ఆర్థిక విధానాల అమలు తర్వాత దేశంలో అనేక గుణాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా వీటి పర్యవసానాలు, ఫలితాలు 2014 ఎన్నికల నుంచి స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోంచే రాజకీయపార్టీల్లో, ఎన్నికల ప్రచారంలో గుణాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే.. 'పొలిటికల్ కన్సల్టెన్సీ'లు మొత్తం ఎన్నికల రూపురేఖలనే మార్చివేశాయి. ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీకి (ఐపీఏసీ) చెందిన ప్రశాంత్ కిషోర్ కుటుంబాల వారీగా ఓటర్ల సమగ్ర సమాచారం కలిగి ఉండి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల ప్రబల శక్తిగా ఎదిగారు. ఇలాంటి పొలిటికల్ కన్సల్టెన్సీలపై ఆధారపడే మోదీ తాను ఎన్నికల్లో గెలువబోతున్నానని ఎన్నికలకు ముందే దీమాగా చెప్పగలిగారు. ఈ విధమైన రాజకీయ పొలిటికల్ కన్సల్టెన్సీ సంస్కృతి ఇవ్వాళ దేశవ్యాప్తంగా విస్తరించింది. అన్ని రాష్ర్టాల్లో వ్యక్తిగతస్థాయి నుంచి పార్టీల దాకా పొలిటికల్ కన్సల్టెన్సీలను నియమించుకొని ఎన్నికల ప్రచార వ్యూహాలను, ఎత్తుగడలను పన్నుతున్న స్థితి ఏర్పడింది. మరో మాటలో చెప్పాలంటే పొలిటికల్ కన్సల్టెన్సీల కనుసన్నల్లోనే నేటి ఎన్నికలన్నీ నిర్వహించబడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే నేను ఏపీలో సోషల్ పోస్ట్ పొలిటికల్ కన్సల్టెన్సీ ( ఇప్పుడు Rastra) అనే పొలిటికల్ కన్సల్టెన్సీలో పనిచేశాను. అసెంబ్లీ ఎన్నికలు మొదలు లోక్‌సభ ఎన్నికల దాకా నా పని కొనసాగింది. మారిన పరిస్థితుల్లో నైతే పొలిటికల్ కన్సల్టెన్సీల పాత్ర చాలా పెరిగిపోయింది. అవే అన్నింటినీ నిర్ణయించే స్థాయికి చేరుకున్నాయి. ఈ విధమైన స్థితి ప్రజాస్వామ్యానికి హానికరం కాదా అని ఆలోచించకపోవటమే నేటి విషాదం.

పొలిటికల్ కన్సల్టెన్సీలు ఎలా పనిచేస్తాయి-ప్రతి పొలిటికల్ కన్సల్టెన్సీకి తనదైన కార్యాచరణ దృక్పథం, విధానం ఉంటుంది. ఒక వ్యక్తి గురించే ఒక అసెంబ్లీ స్థానం వరకే పనిచేయాలంటే ఇద్దరు, ముగ్గురు పనిచేస్తారు. ఇందులో ఉంటే ప్రజా సంబంధాలను చూసే అతను ఆ ప్రాంతంలోని అన్నిరకాల ప్రజాసమూహాలు, కులాలతో సమావేశాలను ఏర్పాటుచేస్తాడు. ఇందులో కులపెద్దలతో పాటు, స్వపార్టీలోని అసమ్మతి నేతలు, విపక్షంలోని వారితో కూడా సంప్రదింపులు, సమావేశాలు నిర్వహిస్తారు. ఒకరకంగా ఈ పీఆర్‌ఓ రాజకీయ నేతకు- పార్టీకీ.. ఓటరుకు మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తారు. ప్రచార, ప్రసార సాధనాల గురించి ఉండే పీఆర్‌ఓ మీడియాలో వచ్చే సమాచారాన్ని సంబంధిత నేతకు, పార్టీకి వివరిస్తాడు. ఇందులో పత్రికల్లో వచ్చిన అనుకూల, ప్రతికూల వార్తల గురించిన సమాచారాన్ని సంక్షిప్తంగా వివరిస్తాడు. కానీ కొత్తగా వచ్చిన పొలిటికల్ కన్సల్టెన్సీల నుంచి వచ్చే అతను చేసేపని మరింత విస్తృతి కలిగి ఉంటుంది. సోషల్‌మీడియాలో వాట్సప్ గ్రూపు లు నిర్వహించటం, వాటికి దిశానిర్దేశం చేయటం కాన్నుంచి అభ్యర్థి రోజువారీ కార్యక్రమాన్ని కూడా వారే నిర్దేశిస్తారు. ఇలా రోజువారీ కార్యక్రమం మొదలు మొత్తంగా నిర్ణీత కాలవ్యవధికి సంబంధించిన కార్యక్రమం అంతా ఓ పద్ధతి ప్రకారం ఒకదాని తర్వాత ఒకటిగా మెట్టు మెట్టుగా అమలుచేస్తారు. ఇలాంటి పొలిటికల్ కన్సల్టెన్సీల సాయం ఇవ్వాళ వ్యక్తుల నుంచి పార్టీల దాకా తీసుకుంటున్నాయి, లేదా వాటి కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ నేత జగన్ కూడా మా ఐపాక్ సంస్థను పొలిటికల్ కన్సల్టెన్సీగా నియమించుకొని సేవలు పొందారు.

ఓ టీమ్ లీడర్‌గా నేను వైఎస్ జగన్ పీఆర్‌ఓకు రోజువారీ కార్యక్రమం గురించి విస్పష్టమైన కార్యాచరణను రూపొందించి ఇచ్చేవాడిని. వాటి అమలును రోజువారీగా సమీక్షించి, ఫలితాలను బేరీజు వేసేవాడిని. ఆచరణలో ఎదురవుతున్న సమస్యలు వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలు చర్చించేవాడిని. ఎదురవుతున్న ప్రతి సమస్యకు ఓ పరిష్కారం మేం ఇచ్చేవారం. నేను 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అన్నిరకాల వ్యవహారాలను పర్యవేక్షించాను. క్షేత్రస్థాయి కార్యకర్త నుంచి మీడియా వ్యక్తుల దాకా అన్నీ నా పర్యవేక్షణలోనే నడిచాయి. ఇవన్నీ కేంద్ర కార్యాలయానికి అందజేసి వాటన్నింటిని క్రోడీకరించి సమీక్షించి అంతిమ ఫలితాలను రాబట్టేవాళ్లం. కేంద్ర కార్యాలయంలో మా దగ్గర రాజకీయ సలహా టీం మొదలు, రచయితలు, పరిశోధకులు, డిజైనర్లు, డాటా అనలిస్టులు, సోషల్ మీడియా హ్యాండ్లర్స్ ఉంటారు. ఈ అందరి సమిష్టి కార్యాచరణతో తుది కార్యాచరణను, ఫలితాన్ని రాబట్టడానికి కార్యాచరణను రూపొందించేవాళ్లం. ఇది ఒకరకంగా చెప్పాలంటే.. సమ్మతిని ఉత్పత్తి చేయటమే. అంటే మేం పనిచేస్తున్న వ్యక్తికి, పార్టీకి అనుకూలంగా ప్రజలు, ఓటర్ల సమ్మతిని మార్చటమే మా పని.

పొలిటికల్ కన్సల్టెన్సీలలో పనిచేసేవారంతా సాధారణంగా పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీల నుంచి వచ్చిన వారుంటారు. ఐఐటీ, ఐఐఎం, టీఐఎస్‌ఎస్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లోనుంచి వచ్చిన వారికి చాలా ఆకర్షణీయమైన జీవభత్యాలుంటాయి. వారు నిర్దేశిత లక్ష్యంతో అహర్నిశలు పనిచేస్తారు. అనుకున్న ఫలితాలను రాబడుతారు. దానికోసం వారు తమ శక్తియుక్తులను, నైపుణ్యాలను వెచ్చిస్తారు.

> ప్రస్తుత రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. కొత్తతరం నేతలంతా కార్పొరేట్ తరహా జీవన సరళినుంచి రాజకీయరంగంలోకి వస్తున్నారు. తండ్రుల వారసత్వంగా రాజకీయాల్లోకి వస్తున్నవారూ, కొంద రు కార్పొరేట్ శక్తులు కూడా నేరుగా రాజకీయాల్లోకి వచ్చి వారు రాజకీ య కార్యకలాపాల నిర్వహణ కోసం కన్సల్టెన్సీలపై ఆధారపడుతున్నారు. నిజానికి కన్సల్టెన్సీల సంస్కృతి ఇక్కడినుంచే వచ్చింది.

పొలిటికల్ కన్సల్టెన్సీలతో సంప్రదాయ రాజకీయపార్టీలు, కమిటీలు, కార్యకర్తలపై తీవ్ర ప్రభావం పడుతున్నది. సాధారణంగా ప్రధాన రాజకీయ పార్టీలన్నీ దశలవారీగా అంచెలంచెలుగా నాయకత్వం, క్షేత్రస్థాయి కార్యకర్తల బలంగాపై ఆధారపడుతాయి. వారితో సజీవ సంబంధాలే గెలుపోటములు నిర్ణయించే స్థితి ఉంటుంది. కానీ ఇప్పుడు పొలిటికల్ కన్సల్టెన్సీలు వచ్చిన తర్వాత పాత తరహా సంబంధాల సమాహారం పూర్తిగా తెగిపోయింది. కార్యకర్తకు, నాయకునికి, పార్టీకి సబంధం తెగిపోయింది. ఇప్పుడు పొలిటికల్ కన్సల్టెన్సీలు వచ్చి మధ్య చేరి అన్నింటినీ నిర్దేశిస్తున్నాయి. రాజకీయపార్టీలు, నేతలు కూడా సులభ పనికోసం పొలిటికల్ కన్సల్టెన్సీలపైనే ఆధారపడుతున్నారు. కన్సల్టెన్సీల కారణంగా ముఖ్యంగా జరుగుతున్న పరిణామం ఏమంటే.. స్థానిక కార్యకర్తలపై నేతలకు అజమాయిషీ ఉండటం లేదు. క్షేత్రస్థాయి కార్యకర్తలను, కార్యాచరణను సమస్తం పొలిటికల్ కన్సల్టెన్సీలే నిర్వహించటం మూలంగా నేతలకు పార్టీ కార్యకర్తలపై పట్టుసడలిపోతున్నది. ఫలితంగా ఎమ్మెల్యే, ఎంపీ ఎవరైనా పూర్తిగా పొలిటికల్ కన్సల్టెన్సీపైనే ఆధారపడుతున్నారు. మరో వైపు ఈ కన్సల్టెన్సీలు తమ పట్టుతో ఎంపీ, ఎమ్మెల్యేలనే శాసించేస్థాయికి చేరుకుంటున్నారు. ఎందుకంటే.. క్షేత్రస్థాయిలో పనిచేస్తూ, కేంద్రస్థాయి కార్యాలయానికి విశ్వసనీయ సమాచారం అంటూ పంపించేది వ్యతిరేకంగా పంపుతామని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను బెదిరించిన ఉదంతాలూ ఉన్నాయి. కన్సల్టెన్సీ వ్యక్తులు చెప్పినట్లు వినకపోతే అక్కడి నుంచి కన్సల్టెన్సీ తన అభ్యర్థులను ఉపసంహరించుకున్నది. ఈ విధంగా అనేక విధాలుగా పార్టీలను, అభ్యర్థులను తమ అదుపాజ్ఞల్లో ఉంచుకోవటానికి పొలిటికల్ కన్సల్టెన్సీలు చాలా చేశాయి.

హ్యూమన్ రైట్స్ ఫోరం కార్యకర్త రోహిత్ గుత్తా పరిశీలన ప్రకారం.. మోదీ ఎదుగుదలతో ఢిల్లీ కేంద్రంగా ఉన్న ఉదారవాద మీడియా అంత చంద్రబాబును కాదని మోదీకి మద్దతుగా నిలిచింది. అలాగే ఆయన భారత ఎన్నికల రంగంపై పొలిటికల్ కన్సల్టెన్సీల ప్రభావం గురించి కూడా అధ్యయనం చేశారు. ఆయన ప్రకారం.. బాబు కార్యకర్తలను సంతృప్తి పర్చటంలో వైఫల్యం కారణంగానే ప్రజల్లో పునాది కోల్పోయారు. మరో వైపు వైఎస్సార్‌సీపీ మాత్రం బీజేపీ కనుసన్నల్లో మెలుగుతూనే ఐపాక్ లాంటి కన్సల్టెన్సీ సాయాన్ని తీసుకున్నది. రాజకీయ ప్రచార వ్యూహం మొదలు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమీకరించటం, పని విభజన చేయటం, ఫలితాలు రాబట్టటం దాకా వైఎస్సార్‌సీపీ కన్సల్టెన్సీ సాయాన్ని తీసుకుని ముందుకుపోయింది. టీడీపీ కూడా ఇలాంటి కన్సల్టెన్సీను వినియోగించుకున్నది. కానీ పార్టీగతంగా కాకుండా వ్యక్తిగతంగా వాడుకున్నది. ఫలితంగా టీడీపీకి కన్సల్టెన్సీల సాయం సఫలీకృతం కాలే దు. పొలిటికల్ కన్సల్టెన్సీలు ఎన్నికల్లో గెలువటానికి ఉపయోగపడవచ్చు. కానీ దీర్ఘకాలికంగా చూస్తే కన్సల్టెన్సీలతో తీవ్ర ప్రమాదం ఏర్పడుతుంది. కన్సల్టెన్సీలతో చేగూరే దంతా స్టెరాయిడ్స్ (ఉత్ప్రేరకం)తో ఒనగూడే శక్తి లాంటిది.

కానీ ప్రస్తుత రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. కొత్తతరం నేతలంతా కార్పొరేట్ తరహా జీవన సరళినుంచి రాజకీయరంగంలోకి వస్తున్నారు. తండ్రుల వారసత్వంగా రాజకీయాల్లోకి వస్తున్నవారూ, కొందరు కార్పొరేట్ శక్తులు కూడా నేరుగా రాజకీయాల్లోకి వచ్చి వారు రాజకీయ కార్యకలాపాల నిర్వహణ కోసం కన్సల్టెన్సీలపై ఆధారపడుతున్నారు. నిజానికి కన్సల్టెన్సీల సంస్కృతి ఇక్కడినుంచే వచ్చింది. రాజకీయాలు, రాజకీయ ఉద్యమాల గురించి ఏమీ తెలియనివారు రాజకీయాల్లో నెగ్గుకురావాలంటే ఈవెంట్ మేనేజ్‌మెంట్ తరహా పనివిధానాన్ని ఎంచుకుంటున్న స్థితి ఉన్నది. ఈ క్రమంలో కన్సల్టెన్సీల ప్రాధాన్యం పెరిగి వాటి నియామక విలువలు ఆకాశాన్నంటుతున్నాయి. వ్యక్తులకు కొంత కాలానికి లక్షల్లో ఉంటే పార్టీకి వందలకోట్ల ధరలు పలికే పరిస్థితి వచ్చింది. నేను ఆరు నెలల వ్యవధి కాలానికి 30 లక్షలకు పనిచేశాను. గుంటూరు అసెంబ్లీ అభ్యర్థికి ఎన్నికలకు కొన్నిరోజుల ముందే విధుల్లో చేరి ఐదు లక్షలు వసూలు చేశాను. అదే పార్టీలకు వచ్చేసరికి వందల కోట్లకు చేరుకుంటుంది. మనం ఇప్పుడు మార్కెట్ నడిపిస్తున్న సమాజంలో నివసిస్తున్నాం. ఇప్పుడు ఎన్నికల్లో నిలబడుతున్న వ్యక్తులు, పార్టీలు కూడా ఒక తరహా బ్రాండ్ వస్తువుల మాదిరిగా మారిపోయారు. వీరిని మార్కెట్లో వస్తువులుగా ఎంబీఏ పట్టభద్రులు మార్కెట్ చేస్తున్నారు. వారు వ్యక్తులు, పార్టీల విధివిధానాలతో సంబంధం లేకుండానే వారు పనిచేస్తున్న సంస్థలకు, వ్యక్తులకు పెద్ద ప్రచారంతో ఆకాశంలో ప్రతిష్ఠిస్తారు. వారినే పాలకులుగా తయారుచేసి మనముందు నిలుపుతారు. ఇక ప్రజలు, ప్రజాకాంక్షలు, ప్రజాస్వామ్యానికి తావు ఎక్కడ ఉంటుంది!

**(వ్యాసకర్త: పరిశోధకులు, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) 'ది వైర్' సౌజన్యంతో...**

# మేల్కోకుంటే ముప్పు తప్పదు

నీరు



**ఎం.దానకిశోర్ (ఐఏఎస్)**

ఈ నెల 15న ఢిల్లీలో జరిగిన నీతిఆయోగ్ ఉన్నతస్థాయి సమావేశంలో భారత ప్రధాని మోదీ 'పర్ డ్రాప్..మోర్ క్రాప్' పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ, వినియోగంపై అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో చాలా ప్రాంతాల్లో ఏర్పడిన కరవు, వర్షాభావ పరిస్థితులు ఎదుర్కోవాలంటే ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టుకోవాలన్నారు. ఇదే సమయంలో భారత ప్రధానమంత్రి అన్ని గ్రామాల సర్పంచ్‌లకు లేఖలు కూడా రాశారు. ప్రతి వర్షపు నీటిబొట్టును ఒడిసిపట్టుకొని భూగర్భ జలాలు పెంపొందించుకోవాలని, వర్షం నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టి గ్రామాల్లో నీటి సమస్యను నివారించాలని ప్రధాని ఆ లేఖలో పేర్కొన్నారు. కొన్నిరోజుల్లో వాన కాలం ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున వాన నీరు వృథా కాకుండా తగిన చర్యలు చేపట్టాలని, ప్రతి వర్షపు బొట్టును భూమిలోకి ఇంకేవిధంగా గ్రామసభల్లో చర్చించి, తగినన్ని చెక్‌డ్యామ్స్, చెరువులు, కుంటలతో పాటుగా ఇళ్లల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. నిజానికి ఈ విషయం కొత్త కాకపోవచ్చును కానీ ప్రజల్లో వీటిపట్ల ఉన్న అశ్రద్ధ, నిరాసక్తతను మరోమారు జ్ఞాపకం చేస్తూ వారిని మళ్లీ కార్యోన్ముఖులుగా మారాలని లేఖ సారాంశం.

హైదరాబాద్ మహానగరానికి రోజుకు 440 మిలియన్ గ్యాలన్స్ మంచినీటిని జలమండలి నిత్యం సరఫరా చేస్తున్నది. సుమారు కోటి ముప్పై లక్షల మంది ప్రజల దాహార్తిని తీర్చడంలో జలమండలి కృషిచేస్తున్నది. ఈ ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితులను నిలదొక్కుకొని కూడా నాగార్జునసాగర్ నుంచి కృష్ణానది నీటిని ఎమర్జెన్సీ పంపింగ్ చేస్తూ నగర ప్రజల దాహార్తిని రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా తీర్చడం జరుగుతున్నది. వర్షాలు పడేంతవరకు ఈ పని చేయగలం, కానీ తగినన్ని వానలు పడకపోతే పరిస్థితి ఏమిటి? నీటిని ఏ ఫ్యాక్టరీలోనో తయారుచేయలేం కదా.. నీరు ప్రకృతి ఇచ్చిన వరం. వర్షాలు పడినప్పుడు ఇంకుడు గుంతల ద్వారా పొదుపు చేసుకున్న నీరు మాత్రమే మనల్ని ఈ ఆపత్కాలంలో రక్షిస్తుంది.

హైదరాబాద్ నగరంలో భూగర్భ జలం నానాటికి అడుగంటిపోతున్నట్లు ఇటీవల కేంద్ర భూగర్భ జల శాఖ తమ నివేదిలో పేర్కొన్నారు. భూగర్భంలో ఇంకుతున్న నీటికన్నా మూడింతలు ఎక్కువగా ప్రజలు నీటిని తోడుకుంటున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. శాస్త్రీయంగా 700 మీటర్ల కన్నా ఎక్కువ లోతులో ఉండే నీటిని తోడటం వల్ల మేలుకన్నా కీడు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. భూమిలో డైనమిక్ వాటర్ అని, స్టాటిక్ వాటర్ అని రెండు రకాలుంటాయి. డైనమిక్ వాటర్ 700 మీటర్ల లోతులో ఉంటుంది. ఈ నీటిని ఉపయోగించడం వల్ల ప్రమాదం లేదు. కానీ, 700 మీటర్ల కింద ఉన్న స్టాటిక్ వాటర్‌ను ఉపయోగించడం వల్ల భవిష్యత్‌లో ఉపద్రవాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. స్టాటిక్ వాటర్ భూమి లోపలి పొరల్లోని వేడిని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. భూమిని బ్యాలెన్సింగ్‌గా ఉంచడానికి స్టాటిక్ వాటర్ ఉపయోగపడుతుంది. ఆ స్టాటిక్ వాటర్‌ను కూడా మనం తోడుకోవడం వల్ల భూమి అడుగుపొరల్లో నీటి తేమ హరించుకుపోవడం వల్ల భూ కంపాలు, పెను విపత్తులు సంభవించే అవకాశాలుంటాయని నిపుణులు అంటారు. హైదరాబాద్‌కన్నా దుర్భరమైన పరిస్థితి బెంగళూరు, చెన్నై నగరాల్లో ఉన్నది. అక్కడి ప్రజలు నీటికోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ జనాభా కన్నా ఎక్కువగా ఉన్న ఈ రెండు నగరాల్లో అక్కడి జలమండలి ఇచ్చే రోజువారీ నీటిలో కనీసం 40 శాతం కూడా ఇవ్వలేకపోతున్నాయి. ఒక ట్యాంకర్ నీటికోసం కిలోమీటర్ల దూరం వరకు బిందెలను వరుసలో పెట్టి నిరీక్షిస్తున్నారు. బెంగళూరు నగరంలోని కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ ఆఫీసుల్లో నీళ్ల లేకపోవడంతో ఇంటినుంచే పనిచేయమని సిబ్బందిని ఆదేశించడం అక్కడున్న నీటి కరవును, నీటి దుస్థితిని తెలియచేస్తుంది. ఈ దుస్థితి అంతటికీ కారణం ప్రజల్లో నీటిపై అజమాయిషీ లేకపోవడం. నీటిపై వారికుండే అలసత్వం, నీటిపై ఒక చులకనభావం మాత్రమే ఇంతటి దుర్భరమైన పరిస్థితికి కారణమని తెలుసుకోవాలి. ఆకాశం, భూమి, నీరు, అగ్ని, వాయువు పంచభూతాలు. సృష్టిలోని ప్రతి ప్రాణికి వీటి అవసరం ఉంటుంది. ఒకప్పుడు అన్నీ ఉచితంగా లభించినవే. నీరు ప్రకృతి ప్రసాదం. సృష్టిలోని ప్రతి ప్రాణికి నీరు అవసరం. సకాలంలో వర్షాలు పడకపోవడం, పడిన వర్షపు నీటిని పొదుపు చేసుకోకపోవడం రెండూ మానవ తప్పిదాలే. వర్షాలు పడకపోవడానికి కారణం చెట్లు నరకడం, వాయు కాలుష్యాన్ని పెంచడం, విపరీతమైన ప్లాస్టిక్ పదార్థాలను వాడటం కారణం కాగా, పడిన వర్షపు నీటిని ఇంకుడు గుంతలు నిర్మించుకొని పొదుపుగా వాడుకోకపోవడం, విలువైన నీటిని పెద్దపెద్ద పైపులతో కార్లు కడుగటం, వాహనాలు కడుగటం, ఇంటి ఆవరణలు కడుగటం, కుక్కపిల్లలకు స్నానాలు చేయించడం, షవర్ బాతింగ్‌తో వందలాది లీటర్ల నీటిని వృథా చేయడం కూడా మానవ తప్పిదమే.

> నీళ్లను సంరక్షించుకోడం మన బాధ్యత అని ప్రతి పౌరుడు గుర్తుపెట్టుకోవాలి. నీటి విలువను తెలుసుకోవాలి. మహా నగరంలో డబ్బులు ఖర్చు పెడితే నీళ్లు దొరుకుతాయి. కానీ గ్రామాల్లో ఒక బిందెడు నీటికోసం కిలోమీటర్ల దూరం వరకు వెళ్లాల్సి వస్తుంది. రైతులకు నీళ్లు దొరక్క పోతే ప్రజలకు ఆహారం దొరుకదు. ఇవన్నీ ప్రతీ పౌరుడు ఆలోచించాలి. నీటి వృథా ను అరికట్టాలి.

నీళ్లను సంరక్షించుకోడం మన బాధ్యత అని ప్రతి పౌరుడు గుర్తుపెట్టుకోవాలి. నీటి విలువను తెలుసుకోవాలి. మహా నగరంలో డబ్బులు ఖర్చుపెడితే నీళ్లు దొరుకుతాయి. కానీ గ్రామాల్లో ఒక బిందెడు నీటికోసం కిలోమీటర్ల దూరం వరకు వెళ్లాల్సి వస్తుంది. రైతులకు నీళ్లు దొరక్క పోతే ప్రజలకు ఆహారం దొరుకదు. ఇవన్నీ ప్రతీ పౌరుడు ఆలోచించాలి. నీటి వృథాను అరికట్టాలి. హైదరాబాద్ నగరంలో రోజుకు 20 మిలియన్ గ్యాలన్స్ నీళ్లు వృథాగా పోతున్నాయని లెక్కలు చెబుతున్నాయి. కేవ లం మానవ తప్పిదాల వల్లనే ఈ నీళ్లు వృథా జరుగున్నాయని తేలింది. నల్లాలకు ఆన్, ఆఫ్ ట్యాప్స్ సరిగ్గా ఉండకపోడం, పైపులు లీకేజ్ కావడం, నల్లాలు ఓపెన్‌చేసి ఆఫీసులకు లేదా ఊళ్లకు వెళ్లడం, ఓవర్‌హెడ్ ట్యాంకు లు నిండిపోయి నీళ్లన్నీ వృథాగా రోడ్లపై పారడం, నీళ్ల డ్రమ్ముల్లో ఉన్నప్పటికీ వాటిని పారబోసి మళ్లీ కొత్తగా పట్టుకోవడం మొదలైన పనులన్నీ నగరంలోని దాదాపు ప్రతి ఇంట్లో జరిగే పనులు. ఇకముందు ఇలాకాకుండా నీటి ఔన్నత్యాన్ని కాపాడాలి. నీటి అవసరాన్ని గుర్తుంచుకోవాలి. నేడు నీటిని కాపాడుకుంటే రేపు నీరు మనల్ని కాపాడుతుంది.

**జనగళం**

## కొత్త చెరువుల ఏర్పాటు

తెలంగాణలోని చెరువుల్లో పూడికతీత, గట్ల నిర్మాణంతో పాటు చెరువు గట్లలో మామిడి, కొబ్బరి, నిమ్మ, బత్తాయి వంటి ఆదాయాన్నిచ్చే చెట్ల పంపకం చేపట్టాలి. అన్ని చెరువుల్లోనూ చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ ప్రతి చెరువును నిరుపేదలైన మత్స్యకారులకు ఇవ్వాలి. తద్వారా ఎన్నో కుటుంబాలకు ఉపాధి కల్పించినవారమవుతాం. నగరంలో చేపల కొరత తీవ్రంగా ఉన్నది. దీనికి మొన్న జరిగిన చేపల చెరువుల్లో దొంగ తనమే నిదర్శనం. కాబట్టి ప్రభుత్వం పాత చెరువులను పునరుద్ధరించడమే కాకుండా కొత్త చెరువుల ఏర్పాటు పట్ల దృష్టి సారించాలి. చెరువు గట్లను ఆకర్షణీయంగా తయారుచేయాలి. అధికారులు, ప్రజాప్రతి నిధులు, ఆ దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉన్నది.

**-యెలిశెట్టి శంకరరావు, హైదరాబాద్**

## రెగ్యులరైజ్ చేయాలె

హైకోర్టు విభజనలో ఉభయ రాష్ర్టాలకు చెందిన న్యాయశాఖ కాంట్రాక్టు సిబ్బందికి తీవ్ర అన్యాయం జరిగింది. ఈ విషయాన్ని రెండు రాష్ర్టాల ముఖ్యమంత్రులైన కేసీఆర్, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలు ప్రధాని మోదీ, కేంద్ర న్యాయశాఖ వ్యవహారాలశాఖ మంత్రి టి.రవిశంకర్‌ల దృష్టికి తీసుకు వెళ్లాలి. ఈ విషయాన్ని అసెంబ్లీ, పార్లమెంట్‌లలో ప్రస్తావించి రెండు రాష్ర్టాలకు సమన్యాయం చేయాలని కోరాలి. స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు, న్యాయశాఖ ఒప్పంద సిబ్బంది ఐదేండ్లకు పైబడి పనిచేసిన వారిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు సిబ్బందిని ఏ విధంగా రెగ్యులరైజ్ చేస్తారో అదే విధంగా ఉమ్మడి హైకోర్టులో పనిచేసినవారిని కూడా రెగ్యులరైజ్ చేయాలి.

**- ఆర్. కవిత, రాజేంద్రనగర్, హైదరాబాద్**

## జోరు కొనసాగించాలె

వరల్డ్‌కప్‌లో భారత్ వరుస విజయాలతో జోరు కొనసాగిస్తున్నది. సమిష్టి కృషితోనే ఈ విజయాల పరంపర కొనసాగుతున్నది. సిరీస్ మొత్తం ఇలాగే గెలుపు బాటన పయనిస్తూ భారత్ మరోసారి ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవాలి. అభిమానుల ఆకాంక్షను నెరవేర్చాలి.

**- నారదాసు రాజేందర్, తార్నాక, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# స్టేషన్ బెయిల్‌కు రూ.20 వేల లంచం

- అయినా ఆగని ఎస్సై, కానిస్టేబుల్ వేధింపులు
- ఏసీబీకి పట్టించిన బాధితుడి భార్య

**బొల్లారం:** ఓ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందు ఎస్సై, కానిస్టేబుల్ రూ.20 వేలు లంచం తీసుకొని, మరిన్ని డబ్బుల కోసం బాధితుడిని వేధించిన ఘటనలో ఏసీబీ అధికారులు ఇద్దరినీ అరెస్టు చేశారు. నగర విభాగం ఏసీబీ డీఎస్పీ అచ్చేశ్వర్ రావు కథనం ప్రకారం.. బొల్లారం పీఎస్ పరిధి ఆదర్శనగర్‌లో నివాసముండే నర్సింగరావు వద్ద ఏడాది క్రితం సిద్దిపేట జిల్లా వర్గల్‌కు చెందిన గోపి అనే వ్యక్తి పని చేస్తానంటూ రూ.18 వేలు అడ్వాన్స్ తీసుకున్నాడు. కానీ గోపి పనికి రాకపోగా డబ్బులు చెల్లించలేదు. ఏడాది తరువాత ఈనెల 3న నర్సింగరావుకు గోపి కనిపించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో నర్సింగరావు గోపిపై చేయి చేసుకున్నాడు. గోపి బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నర్సింగరావుపై సెక్షన్ 324, 384పై కేసులు నమోదుచేశారు. అరెస్టు భయంతో అప్పటి నుంచి నర్సింగరావు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో ఎస్సై బ్రహ్మాచారి నర్సింగరావుకు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం రాకపోవడంతో కానిస్టేబుల్ నగేశ్‌ను రంగంలోకి దించాడు. నర్సింగరావుతో సెల్‌ఫోన్‌లో మాట్లాడిన నగేశ్ రూ.20 వేలిస్తే స్టేషన్ బెయిల్ ఇప్పిస్తామంటూ చెప్పాడు.


ఎస్సై బ్రహ్మాచారి, కానిస్టేబుల్ నగేశ్

దీంతో డబ్బులు ఇంట్లో తన భార్యవద్ద తీసుకోవాలని సూచించగా, ఈనెల 8న నర్సింగరావు భార్య అంబిక దగ్గర రూ.10 వేలు తీసుకున్నారు. మిగతావి ఈనెల 13న ఫోన్‌పే యాప్ ద్వారా చెల్లించాడు. రూ.20 వేలు ఇచ్చినా బెయిల్ రాకపోవడం.. మరో రూ.5 వేలు ఇవ్వాలని కానిస్టేబుల్ డిమాండ్ చేయడంతో నర్సింగరావు భార్య అంబిక ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఎస్సై బ్రహ్మాచారి, కానిస్టేబుల్ నగేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. లంచం తీసుకున్నట్టు పక్కా ఆధారాలు ఉండటంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు.


వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మండలం బండౌతాపురంలో చెరువులో రైతులు సోమవారం జేసీబీతో పూడిక తీస్తుండగా పురాతన విగ్రహం బయటపడింది. పరిశీలించిన గ్రామస్థులు వేంకటేశ్వర స్వామి విగ్రహంగా గుర్తించారు.
- వర్ధన్నపేట, నమస్తే తెలగాణ



ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్‌లో ఏరువాక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేసి సాగు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషిచేస్తున్నారని తెలిపారు.
- మిర్యాలగూడ, నమస్తే తెలంగాణ

## జూలైలో ఎస్సారెస్పీ నీటి విడుదలపై ప్రణాళిక

### చీఫ్ ఇంజినీర్ శంకర్ వెల్లడి

**తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ:** ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే వచ్చే నెల మొదటి వారంలో ఎస్సారెస్పీ నీటి విడుదలపై హైదరాబాద్‌లో ఈఎన్‌సీ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందిస్తామని ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ శంకర్ తెలిపారు. సోమవారం కరీంనగర్ జిల్లా ఎల్‌ఎండీ కాలనీలోని ఎస్సారెస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీలో ఆశించిన స్థాయిలో నీరు లేదనీ, వర్షాలు సమృద్ధిగా పడి ప్రాజెక్టుల్లోకి నీరు చేరితే వానాకాలం యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. ప్రస్తుతం పోచంపాడ్‌లోని ఎస్సారెస్పీలో 5.66 టీఎంసీల నీరు, ఎల్‌ఎండీలో 3.722 టీఎంసీల నీరు ఉందని చెప్పారు.



## ఉద్యోగాల పేరుతో మహిళ మోసం

**మంచిర్యాలటౌన్, నమస్తే తెలంగాణ:** గురుకుల విద్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి 132 మంది నుంచి రూ.కోటికిపైగా వసూలు చేసి తీరా ఐపీ నోటిసులిచ్చిన ఘటన సోమవారం మంచిర్యాల జిల్లాలో వెలుగు చూసింది. బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఠాకూర్ సుమలత కస్తూర్బా విద్యాలయంలో ఏఎస్ఓగా పని చేస్తున్నాననీ, పైఅధికారులతో పరిచయాలు ఉన్నాయని ఉద్యోగాలు పెట్టిస్తానని ఒక్కొక్కరి దగ్గర రూ.లక్ష నుంచి రూ.2లక్షల దాకా వసూలు చేసింది. మంచిర్యాల జిల్లాతో పాటు పెద్దపల్లి, భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, ఆసిఫాబాద్‌కు చెందిన బాధితులున్నారు. కాగా, తాను చేసిన బట్టల వ్యాపారం, చిట్టీల వ్యాపారంలో నష్టం వచ్చిందని నాలుగు రోజుల క్రితం సుమలత వారికి ఐపీ నోటీసులు పంపించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని బెల్లంపల్లి వన్ టౌన్ సీఐకి ఆదేశాలు జారీ చేసినట్టు మంచిర్యాల డీసీపీ రక్షిత కె మూర్తి తెలిపారు.

## స్కూల్ బస్సు బోల్తా

**దేవరకొండ, నమస్తేతెలంగాణ:** నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొర్రతాకుతండా వద్ద సోమవారం సాయంత్రం పాఠశాల బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులతోపాటు ఆయాకు గాయాలయ్యాయి. క్షత గాత్రులను దేవరకొండ దవాఖానకు తరలించారు.

**పొద్దుగాలనే తాగి నడిపిండు**

**పటాన్‌చెరు రూరల్:** ఉదయం ఏడు గంటలకే మద్యం తాగి కాలేజీ బస్సు నడిపిన ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ఎంవీఐ రజామహమ్మద్, ట్రాఫిక్ సీఐ వేణుకుమార్ పటాన్‌చెరు జాతీయ రహదారిపై పాఠశాల బస్సులు తనిఖీ చేస్తుండగా, ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలకు చెందిన బస్సును నిలిపారు. డ్రైవర్ చిట్టి(36)కి బ్రీత్ అనలైజింగ్ టెస్టు నిర్వహించగా, 180 పాయింట్లు నమోదవ్వడంతో కేసు నమోదు చేశారు.

## భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించిన భర్త


మణెమ్మ(ఫైల్)

**తిరుమలగిరి, నమస్తే తెలంగాణ:** మద్యం మత్తులో ఓ వ్యక్తి తన భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి లో ఆదివారం అర్ధ రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన మణెమ్మ(29)కు అదే గ్రామానికి చెందిన ఉపేందర్‌తో 2009 లో వివాహం జరిగింది. వీరికి ఐదేండ్ల కొడుకు ఉన్నాడు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఉపేందర్, తరచూ మద్యం తాగి వచ్చి భార్యను వేధించేవాడు. ఆదివారం సైతం తాగి వచ్చిన ఉపేందర్ భార్యతో గొడవపడి మద్యం మత్తులో ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన మణెమ్మను చికిత్స పొందుతూ మృతి చెందింది.



## తృటిలో తప్పిన పెనుప్రమాదం

**ఏన్కూరు:** ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి మరో ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కనే ఉన్న గోడను ఢీకొన్న ఘటనలో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన ఖమ్మం జిల్లా ఏన్కూరులో సోమవారం చోటు చేసుకుంది. భద్రాద్రికొత్తగూడెం జిల్లా మణుగూరు డిపోకు చెందిన బస్సు ఖమ్మం నుంచి మణుగూరుకు బయల్దేరింది. మార్గమధ్యలో ఏన్కూరు సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి పక్కనే ఉన్న కాలువ రక్షణ గోడను ఢీకొట్టి నిలిచిపోయింది. ఆ సమయంలో బస్సులో 66 మంది ప్రయాణికులు ఉన్నారు. చుట్టుపక్కల వారు ప్రయాణికులను రక్షించారు.


సూర్యాపేట జిల్లా చివ్వెంలలో బీసీ గురుకులాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్


వనపర్తి జిల్లా నాగవరంలో గురుకులాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి


మహబూబ్‌నగర్ జిల్లా ధర్మాపూర్‌లో పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో గురుకుల విద్యాలయాన్ని ప్రారంభించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# అట్టహాసంగా గురుకుల పండుగ

- ఏకకాలంలో 119 బీసీ గురుకులాలు ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- 281కి చేరిన బీసీ గురుకులాల సంఖ్య
- మొత్తంగా 92,340 మందికి చదువుకునే అవకాశం
- ఆనందంలో విద్యార్థుల తల్లిదండ్రులు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్:** రాష్ట్రంలో సోమవారం గురుకుల పాఠశాలల ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఆకాంక్షలకు అనుగుణంగా బీసీ విద్యార్థుల కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో బాలురకు 63, బాలికలకు 56 గురుకులాలను కేటాయించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పండుగ వాతావరణం ఏర్పడింది. ఏకకాలంలో 119 బీసీ గురుకులాలు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, ఇతర సామగ్రి అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో కేవలం 19 గురుకులాలు మాత్రమే ఉండగా తెలంగాణ వచ్చిన వెంటనే 24 గురుకులాలను టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తరువాత 2017-18 విద్యా సంవత్సరంలో 119 బీసీ గురుకులాలను ఒకేసారి ప్రారంభించగా, తాజాగా 2019-20 విద్యాసంవత్సరానికి గాను 119 నియోజకవర్గాల్లో ప్రారంభించడం విశేషం. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 281 బీసీ గురుకుల విద్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో 92,340 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం దక్కింది.

**గ్రేటర్ హైదరాబాద్‌లో..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్, జూబ్లీహిల్స్, గోషామహల్ నియోజకవర్గాలకు సంబంధించిన మూడు బీసీ గురుకులాలను మన్సూరాబాద్‌లో ఒకేచోట సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, హోం మంత్రి మహమూద్ అలీ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు.

**గురుకులాల్లో నాణ్యమైన విద్య: ఈటల**

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో బాలుర గురుకుల పాఠశాలను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నారని తెలిపారు. వనపర్తి జిల్లా వనపర్తి మండలం నాగవరంలో బాలుర గురుకుల పాఠశాలను ప్రారంభించిన సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేజీ నుంచి పీజీ విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గురుకుల వ్యవస్థను పటిష్ట పరుస్తున్నదన్నారు.


కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మంత్రి ఈటల రాజేందర్

**బంగారు బాటలు వేసేలా సర్కార్ చదువు..**

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రానికి మంజూరైన పాఠశాలను చివ్వెంల మండల కేంద్రంలో, మరోటి హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన బీసీ గురుకులాలను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా ప్రభుత్వ విద్యను అందిస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండలో రవాణా శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కలెక్టర్ రామ్మోహన్‌రావుతో కలిసి బీసీ బాలికల గురుకులాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, బీసీలు విద్యాపరంగా మరింత అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం నియోజకవర్గానికి ఒకటి చొప్పున బీసీ గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు.

**కార్పొరేట్‌కు దీటుగా గురుకులాలు: ఎర్రబెల్లి**

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వరంగల్ అర్బన్ జిల్లా మామునూరులో ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌తో కలిసి, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యతో కలిసి, పాలకుర్తి నియోజకవర్గంలోని కొడకండ్ల మండలం గిర్నితండా (మొండ్రాయి) వద్ద గురుకుల పాఠశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. తెలంగాణలో కార్పొరేట్ విద్యకు దీటుగా గురుకుల పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యను పూర్తిగా భ్రష్టుపట్టించిన వాళ్లు ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని మండిపడ్డారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ధర్మపురి నియోజకవర్గానికి కేటాయించిన గురుకులాన్ని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలో బాలుర పాఠశాలను ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుతో కలిసి మంత్రి కొప్పుల ప్రారంభించారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో గొప్ప విద్యాయజ్ఞం కొనసాగుతున్నదన్నారు.

**సకల వసతులతో సర్కారు విద్య..**

మహబూబ్‌నగర్ జిల్లా ధర్మాపూర్‌లో బీసీ గురుకుల పాఠశాలను ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో పౌష్టికాహారంతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, సన్నబియ్యంతో భోజనం వంటి ఎన్నో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో బీసీ గురుకుల బాలికల పాఠశాలను దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లోల మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యతో ప్రైవేటు పాఠశాలలకు స్వస్తి పలికి గురుకులాల్లో చేరుతున్నారన్నారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం బోగారంలోని తిరుమల ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన మేడ్చల్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల గురుకుల పాఠశాలలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో కలిసి కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. గురుకులంలో నాణ్యమైన విద్య, ఇతర సౌకర్యాల కోసం ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం ఏటా రూ.1.20 లక్షలు వెచ్చిస్తున్నదన్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన గురుకులాలను కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డితో కలిసి సిద్దిపేట జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ ప్రారంభించారు.


వేములవాడలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు మొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు


నిజామాబాద్ జిల్లా బాల్కొండలో బీసీ గురుకులాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి


నిర్మల్ జిల్లా కేంద్రంలో గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


మేడ్చల్ జిల్లా బోగారంలో గురుకులాన్ని ప్రారంభించి చిన్నారులకు బ్యాగు, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

## పలుచోట్ల ఓ మోస్తరు వర్షం


సూర్యాపేటలో సోమవారం కురిసిన వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

- ఖమ్మంలో భారీ వర్షం
- వరంగల్, నల్గొండలో జల్లులు
- చల్లబడ్డ వాతావరణం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** భానుడు శాంతించడం, వరుణుడు కరుణించడంతో పలు జిల్లాల్లో సోమవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గత కొద్దిరోజులుగా ఎండలతో అల్లాడిపోతున్న జనం ఒక్కసారిగా చల్లబడిన వాతావరణంతో ఉపశమనం పొందారు. ఖమ్మం నగరంలో సోమవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. రఘునాథపాలెం, కొణిజర్ల, కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ఏన్కూర్ తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం కారణంగా నగరంలోని ప్రధాన వీధులు, పలు కాలనీల్లోకి వరద నీరు చేరింది. వర్షం కురవడంతో ఆయా మండలాలకు చెందిన రైతులు ఖమ్మం నగరానికి వచ్చి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంతోపాటు కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకర్గాల్లోని అన్ని మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీచాయి. నాంపల్లి, దామరచర్ల, తిప్పర్తి, నకిరేకల్, కేతేపల్లితోపాటు పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. వరంగల్ నగరం, మహబూబాబాద్ పట్టణంలో సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలుచోట్ల సోమవారం ఉదయం నుంచి చిరు జల్లులు కురిశాయి. మణుగూరు ఓపెన్‌కాస్ట్ గనుల్లో నీరు నిలవడంతో పనులు నిలిచిపోయాయి.

## రైలు నుంచి జారిపడి యువతి మృతి

**స్టేషన్‌ఘన్‌పూర్‌టౌన్:** జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్-రఘునాథపల్లి రైల్వే స్టేషన్ల మధ్యలో సోమవారం సాయంత్రం ఢిల్లీ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ఓ గుర్తుతెలియని యువతి ప్రమాదవశాత్తు జారిపడింది. వెంటనే గుర్తించిన ప్రయాణికులు చైను లాగి రైలును నిలిపివేశారు. తీవ్రంగా గాయపడిన యువతిని అదే రైలులో జనగామకు తరలించారు. 108లో జనగామ ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. యువతికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని కాజీపేట జీఆర్పీ తెలిపారు. మృతురాలు సుమారు 20 ఏండ్ల వయస్సు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## ● సర్పంచ్ చొరవతో బడిబాట..


రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం చిన్నరావిరాల సర్పంచ్ సూరకంటి వనజా శ్రీనివాస్‌రెడ్డితోపాటు పాలకవర్గ సభ్యులు బడిబాటలో భాగంగా సోమవారం ఇంటింటికీ తిరిగి 25 మంది పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా నోట్‌బుక్స్ కూడా అందజేశారు. విశ్వశాంతి కాలనీకి చెందిన ఈ చిన్నారులు కిలోమీటరు దూరంలోని స్కూల్‌కు వచ్చేందుకు గాను వ్యాన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. - అబ్దుల్లాపూర్‌మెట్

## తండ్రి మందలించాడని బలవన్మరణం

**ములకలపల్లి:** బడికి వెళ్లమని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఓ బాలిక పురుగుల తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం గుట్టగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కొర్రి వెంకటేశ్- లక్ష్మిల కుమార్తె సమీర (14) ములకలపల్లి కస్తూర్బా పాఠశాలలో చదువుతున్నది. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో సోమవారం తండ్రి పాఠశాలకు వెళ్లమని మందలించాడు. దీంతో మనస్తాపానికి చెందిన సమీర ఇంట్లో ఎవరూ సమయంలో పురుగుల మందు తాగింది. కొంతసేపటికి గుర్తించిన కుటుంబ సభ్యులు పాల్వంచ ఏరియా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది.


పోలీసులు విడుదల చేసిన మావోయిస్టుల చిత్రాలు

## తప్పుదోవ పట్టిస్తున్న మావోయిస్టులు

- వారి సమాచారమిస్తే 5 లక్షల రివార్డు
- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ వెల్లడి

**కొత్తగూడెం అర్బన్:** పోడు భూముల విషయంలో అమాయక ప్రజలను మావోయిస్టులు తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇలాంటి చర్యలను ఉపేక్షించేలేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ సునీల్‌దత్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని కరగూడెం, ఏడూళ్ల బయ్యారం, గుండాల, మణుగూరు ఏరియాల్లో హరిభూషణ్, దామోదర్, లచ్చన్న, రీనా, రాజిరెడ్డి అలియాస్ వెంకన్న, భద్రు, మంగు, మంగ్లూతో పాటు మరో 30మంది గత ఇరువై రోజులుగా అమాయక ప్రజలను పోడు భూముల విషయంలో తప్పుదోవ పట్టిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. మావోయిస్టుల గురించి కచ్చితమైన సమాచారం ఇచ్చిన వారికి రూ.5 లక్షల నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం బూరుగుడలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడిండ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.24 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. -ఆసిఫాబాద్ టౌన్



ఈదుకుంటూ వస్తున్న బాధితులను రక్షిస్తున్న అధికారులు

## వలసప్రజలతో వెళ్తున్న పడవ మునక

- 12 మంది మృతి.. టర్కీలో ఘటన

**అంకారా, జూన్ 17:** గ్రీస్ దేశానికి వలసప్రజలతో వెళ్తున్న ఓ పడవ.. టర్కీ తీరంలో మునిగిపోయిన ఘటనలో 12 మంది చనిపోయారు. ఏజియన్ సముద్రంలో బోడ్రమ్ తీరంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో మరో 31 మంది వలసదారులను టర్కీ తీర రక్షక దళం సిబ్బంది కాపాడారు. పడవ మునకకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. గల్లంతైన మరికొంత మంది ఆచూకీ కోసం తీర రక్షక దళం అధికారులు పడవలు, హెలికాప్టర్లతో గాలింపు చర్యలను చేపడుతున్నారు. కాగా, వలసదారులు ఏ దేశానికి చెందిన వారో ఇంకా తెలియాల్సి ఉంది.

## హాంకాంగ్ జైలు నుంచి వాంగ్ విడుదల



**హాంకాంగ్, జూన్ 17:** హాంకాంగ్ ప్రజాస్వామ్య హక్కుల కార్యకర్త జాషువా వాంగ్ సోమవారం జైలు నుంచి విడుదలయ్యారు. చైనా అనుకూల విధానాలను అవలంబిస్తున్న హాంకాంగ్ సీఈఓ కారీ లామ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలో పాల్గొనాలని ఆయన భావిస్తున్నారు. 'అంబ్రెల్లా మూవ్‌మెం ట్' పేరిట 2014లో జరిగిన ప్రజాస్వా మ్య అనుకూల ఉద్యమానికి సారథ్యం వహించిన వాంగ్‌ను హాంకాంగ్ ప్రభు త్వం గతంలో జైలుకు పంపినా ఆయన సత్ప్రవర్తనతో విడుదల అయ్యారు.

## వికటించిన ఇంద్రజాలం

హుగ్లీ నదిలో మెజీషియన్ గల్లంతు

**కోల్‌కతా:** ఓ ఇంద్రజాలికుడి సాహస యత్నం అతని ప్రాణాల మీదికి తెచ్చింది. కాళ్లు, చేతులు కట్టేసుకొని, కండ్ల కు గంతలు కట్టుకొని ఓ ఇనుప బోనులో హుగ్లీ నదిలోకి దిగిన మెజీషియన్ చంచల్ లాహిరి (40) బయటకు రాలేదు. దీంతో అతడు నదిలోనే గల్లంతయ్యాడని, ప్రాణాలతో బయటపడే అవకాశం లేదని భావిస్తున్నారు. దక్షిణ కోల్‌కతా వాసి లాహిరి 2013లోనూ హుగ్లీ నదిలో ఇదే సాహసం చేసి.. విజయవంతంగా తన బంధనాలను తెంచుకొని బయటకు వచ్చాడు. లాహిరిని ఈసారి దురదృష్టం వెన్నాడింది. అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఇంద్రజాలికుడు హ్యారీ హౌడిని వందేండ్ల క్రితం 'బంధనాలను తెంచుకొని తప్పించుకొనే' ఈ సాహస క్రీడకు ప్రాచుర్యం కల్పించారు. ఆ స్ఫూర్తితో ఇప్పటికి పలువురు ఇంద్రజాలికులు ఈ సాహసం విజయవంతంగా ప్రదర్శించారు. కానీ, లాహిరి విషయంలో మాత్రం అనుకున్నట్టు జరుగలేదు. పోలీసులతోపాటు విపత్తు సహాయ బృందం లాహిరి కోసం నదిలో గాలించినా ఫలితం లేకపోయింది. తన సాహస యత్నానికి లాహిరి కోల్‌కతా పోలీసులు, పోర్ట్ ట్రస్ట్ నుంచి అనుమతి పొందినట్టు అధికారులు చెప్పారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన కథనం ప్రకారం.. లాహిరి ఆదివారం మధ్యాహ్నం చిన్న పడవలో నదిలోకెళ్లాడు. అతని సహాయకులు లాహిరి కండ్లకు గంత లు కట్టారు. ఆయన కాళ్లు, చేతులూ కట్టేసి, ఓ బోనులోకి అతడిని దించారు. ఆరడుగుల పొడవున్న బోనుకు ఆరు తాళాలు వేశారు. దానిని హౌరా బ్రిడ్జిపై ఉన్న క్రేన్ సాయంతో నదిలోకి దించారు. నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం పంజరం నదిలో పడగానే లాహిరి తన బంధనాలను ఛేదించుకొని నీటిపై తేలాలి. హౌరా వంతెనకున్న 28వ పిల్లర్ వద్ద నుంచి లాహిరి బోన్ పైకెత్తిన క్రేన్.. అక్కడే నదిలోపడేసింది. కానీ పది నిమిషాలైనా లాహిరి బయటకు రాకపోవడంతో ప్రేక్షకులు ఆందోళనకు గురయ్యారు. ప్రేక్షకుల్లో ఒకరు సమాచారమందించడంతో విపత్తు సహాయ బృందం, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నలుగురు గజ ఈతగాళ్లు గాలించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



బోనులో నదిలోకి వెళ్తున్న లాహిరి

### అణ్వాయుధాలు తగ్గాయి!

**స్టాక్‌హోమ్:** ప్రపంచవ్యాప్తంగా గతేడాది అణు వార్‌హెడ్‌ల సంఖ్య తగ్గినప్పటికీ, ఆయా దేశాలు తమ అణ్వాయుధాలను ఆధునీకరించాయని తాజా నివేదికలో వెల్లడైంది. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, ఇండియా, పాకిస్థాన్, ఇజ్రాయెల్, ఉత్తరకొరియా వద్ద మొత్తం 13,865 అణ్వాయుధాలు ఉన్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషన్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తన నివేదికలో అంచనావేసింది. 2018 ఏడాదితో పోలిస్తే 600 అణ్వాయుధాలు తగ్గినట్లు తెలిపింది. చైనా, భారత్, పాకిస్థాన్ తమ ఆయుధాల పరిమాణాన్ని పెంచుకున్నాయని తెలిపింది. అమెరికా, రష్యా కారణంగా గత కొన్నేండ్లలో అణ్వాయుధాల సంఖ్య తగ్గిందని, అయితే ఇప్పటికీ ప్రపంచం మొత్తం అణ్వాయుధాల్లో 90 శాతం వీటి వద్దే ఉన్నాయని వివరించింది.



## ముజఫర్‌పూర్‌లో ఆగని మృత్యుకేళి

- వ్యాధిని గుర్తించలేకపోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- 103కు పెరిగిన మృతుల సంఖ్య



**ముజఫర్‌పూర్:** బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో మృత్యుకేళి ఆగడం లేదు. మెదడువాపు వ్యాధి లక్షణాలతో మృతిచెందుతున్న చిన్నారుల సంఖ్య సోమవారం నాటికి 103కు పెరిగింది. శ్రీకృష్ణ మెడికల్ కాలేజీలో 83 మంది, కేజ్రీవాల్ దవాఖానలో 17 మంది మరణించినట్టు అధికారులు తెలిపారు. మరో 300 మందికి పైగా ఈ రెండు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. అయితే ఈ వ్యాధి గురించి అవగాహన లేకపోవడంతో ఎలాంటి చికిత్స అందించాలో తెలియడం లేదని, దీంతో మృతుల సంఖ్య పెరుగుతున్నదని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సైతం ఒప్పుకున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ సోమవారం ఢిల్లీలో ఎయిమ్స్, ఐసీఎంఆర్‌కు చెందిన ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పిల్లల మరణాలపై క్షేత్రస్థాయిలో పరిశోధన జరిపేందుకు మరో అత్యున్నత స్థాయి బృందాన్ని ముజఫర్‌పూర్‌కు పంపించాలని ఆదేశించారు. ఈ బృందంలో హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్‌కు చెందిన నిపుణులు కూడా ఉన్నారు.

**ఎన్ని వికెట్లు పడ్డాయి**

ముజఫర్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీహార్ ఆరోగ్యశాఖ మంత్రి మంగళ్‌పాండే అనవసర వ్యాఖ్యలు చేసి చిక్కుల్లో పడ్డారు. విలేకరులు ప్రశ్నలు అడుగుతుండగా.. ఆయన భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ను ఉద్దేశిస్తూ 'ఎన్ని వికెట్లు పడ్డాయి' అని ఆరాతీశారు. దీంతో పిల్లల మరణాల కంటే క్రికెట్ మ్యాచ్‌పై మంత్రి ఆసక్తి చూపారంటూ విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఆయన రాజీనామా చేయాలని ఆర్జేడీ, కాంగ్రెస్, హెచ్ఏఎం పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

**76కు చేరిన వడదెబ్బ మృతులు**

మరోవైపు బీహార్‌లో భానుడి భగభగలకు ఆ రాష్ట్ర ప్రజలు విలవిలలాడిపోతున్నారు. గత మూడు రోజుల్లో వడదెబ్బ కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 76కు చేరింది. ఔరంగాబాద్‌లో అత్యధికంగా 33 మంది చనిపోయారు. గయలో 31, నవాడాలో 12 మంది మృతి చెందినట్లు విపత్తు నిర్వహణ విభాగం వెల్లడించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలకు ఈ నెల 22 వరకు సెలవును పొడిగించినట్లు ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీపక్ కుమార్ తెలిపారు.

# సమ్మె విరమణ

- బెంగాల్‌లో ఆందోళనను విరమించిన వైద్యులు
- ముఖ్యమంత్రి మమతతో చర్చలు సఫలం
- దవాఖానల్లో భద్రత పెంపునకు సీఎం హామీ
- నోడల్ అధికారుల నియామకానికి ఆదేశాలు



జూనియర్ వైద్యుల ఐక్య వేదిక ప్రతినిధులతో చర్చలు జరుపుతున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమత

**కోల్‌కతా, జూన్ 17:** పశ్చిమ బెంగాల్‌లో వారం రోజులుగా కొనసాగుతున్న వైద్యుల ఆందోళనకు సోమవారం తెరపడింది. దవాఖానల్లో భద్రతను పెంచుతామని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు వైద్యులు ప్రకటించారు. వైద్యులందరూ తిరిగి విధులకు హాజరవుతారని జూనియర్ వైద్యుల ఐక్యవేదిక అధికార ప్రతినిధి తెలిపారు. ముఖ్యమంత్రితో భేటీ అనంతరం నీల్ రతన్ సిర్కార్ (ఎన్ఆర్ఎస్) వైద్య కళాశాల, దవాఖానలో ఐక్యవేదిక పాలకమండలి సమావేశం తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'ముఖ్యమంత్రితో మా చర్చలు కొలిక్కి వచ్చాయి. సమ్మెకు తాత్కాలిక విరామం ఇస్తున్నాం. సమావేశంలో చర్చించిన మేరకు మా సమస్యలను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని భావిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. వీలైనంత త్వరగా విధుల్లో చేరాలని పాలకమండలి సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు.

**చర్చలు సఫలం..**

జూనియర్ వైద్యుల ఐక్య వేదిక ప్రతినిధులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం మమతతో సమావేశమయ్యారు. వైద్య కళాశాలలు, దవాఖానల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు. తమ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో వైద్యుల రక్షణ కోసం నోడల్ అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి మమత పోలీసులను ఆదేశించారు. అలాగే జూనియర్ వైద్యులు ప్రతిపాదించిన మేరకు అన్ని దవాఖానల్లో ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర వైద్య శాఖ కార్యదర్శి చంద్రిమా భట్టాచార్యతో పాటు 31 మంది వైద్యుల బృందం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 11న ఎన్ఆర్ఎస్ వైద్య కళాశాల, దవాఖానలో వైద్యులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వైద్యుల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరగా ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశం మొత్తాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలన్న వైద్యుల డిమాండ్‌కు తొలుత నిరాకరించిన ప్రభుత్వం అనంతరం దిగి వచ్చింది. మీడియాను అనుమతించేందుకు అంగీకరించింది. అయితే రెండు ప్రాంతీయ వార్తా చానళ్లను మాత్రమే అనుమతించడం గమనార్హం..

**దేశవ్యాప్త సమ్మెతో స్తంభించిన వైద్యసేవలు**

బెంగాల్‌లో వైద్యులపై దాడికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు సోమవారం వైద్యులు దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టారు. దీంతో దేశవ్యాప్తంగా వైద్య సేవలు స్తంభించిపోయాయి.

**జాతీయ చట్టం తీసుకురావాలి**

వైద్యులపై దాడులను నిరోధించేందుకు సమగ్ర జాతీయ చట్టం తీసుకురావాలని ఐఎంఏ డిమాండ్ చేసింది. దాడికి పాల్పడిన నిందితులపై కఠిన శిక్షలు విధించేలా భారత శిక్షాస్మృతిలో సవరణలు చేయాలని ఓ ప్రకటనలో కోరింది. కాగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో వైద్యుల రక్షణ, భద్రతపై దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. అత్యవసరంగా విచారణ చేపట్టాలని పిటిషనర్ కోరగా మంగళవారం విచారణ జరిపేందుకు వెకేషన్ బెంచ్ అంగీకారం తెలిపింది.




హైదరాబాద్ ఉస్మానియా దవాఖాన వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

### తెలంగాణ వ్యాప్తంగా వైద్యుల నిరసన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బెంగాల్‌లో వైద్యులపై దాడిని నిరసిస్తూ సోమవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగాపలు ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో పనిచేస్తున్న వైద్యులు నిరసనల్లో పాల్గొన్నారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటలపాటు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లపై దాడులకు పాల్పడేవారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వైద్యులు సమ్మెకు దిగడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దవాఖానల్లో సాధారణ వైద్య సేవలు నిలిచిపోయాయి.



## నిందితుడిని చితక్కొట్టిన ఢిల్లీ పోలీసులు

- పోలీసులపై చర్యలకు సీఎం కేజ్రీవాల్ డిమాండ్

**న్యూఢిల్లీ:** ఓ వాహన డ్రైవర్ కత్తితో దాడి చేసిన ఘటనలో ఓ పోలీస్ అధికారికి గాయాలయ్యాయి. దీంతో పోలీసులు అతడిపై ప్రతా పం చూపారు. ఢిల్లీలోని ముఖర్జీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామీణ సేవా సంస్థ వాహనం, పోలీస్ వాహనం ఢీకొన్నాయి. దీంతో ఆ వాహన డ్రైవర్, పోలీసుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ నేపథ్యంలో ఆగ్రహంతో ఊగిపోయిన సిక్కు డ్రైవర్, తన చేతిలోని కత్తితో దాడి చేయగా ఓ పోలీస్ అధికారి గాయపడ్డారు. తర్వాత పోలీసులు లాఠీలతో అతడిపై విరుచుకుపడటంతో ఆ సిక్కు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మరోవైపు ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుంది. సిక్కు డ్రైవర్ తలపాగాపై కొట్టి అవమానించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలనిబీజేపీ ఎమ్మెల్యే మంజిందర్ సింగ్ ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

**కేంద్రం స్పందించాలి: కేజ్రీవాల్**

ఢిల్లీ పోలీసుల తీరును సీఎం కేజ్రీవాల్ తప్పుపట్టారు. బాధిత సిక్కు డ్రైవర్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రజలను కాపాడాల్సిన పోలీసులు గూండాలుగా ప్రవర్తించడం సరికాదన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ స్పందించాలని, క్రూరంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
EE (R&B) NH డివిజన్, హైదరాబాద్ 'e' NIT నం. EE/R&B/NH/HYD/HD/ 2019- 20/1, తేది: 15-06-2019 ప్రకారం (10) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి టెండరు షెడ్యూళ్ళను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 02-07-2019 మధ్యాహ్నం 3.00 గంటల వరకు.
సం/- EE (R&B) NH డివిజన్, హైదరాబాద్
DIPR R.O.No. 162 PP/CL/Advt/1/2019-20 తేది: 17-06-2019

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ, ఆదిలాబాద్
e-proc. Notice NIT No. 08 to 26/RO/2019-20, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 11-06-2019
PR ఆదిలాబాద్‌లో ఆడిటోరియం, ఇంటర్నల్ విలేజ్ రోడ్ కనెక్టివిటీ నిర్మాణం, పర్యాటక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయుట, వంతెనల నిర్మాణం మొ|| పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుతున్నవి. మొత్తం ECV: రూ. 2960.00 లక్షలు. టెండరు డాక్యుమెంట్లు 18-06-2019 నుండి 25-06-2019 మధ్యలో ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో లభిస్తాయి. తదుపరి వివరాల కొరకు www.tender.telangana.gov.in దర్శించండి.
సం/- రీజినల్ ఆఫీసర్ (PR),
DIPR RO.No. 344-DP/CL/ADVT/1/2019-20, Dt: 17-06-2019 ప్రాంతీయ కార్యాలయం, ఆదిలాబాద్

P.V. NARSIMHA RAO
TELANGANA VETERINARY UNIVERSITY
Administrative Office : Rajendranagar : Hyderabad-30
No. 22/OP/2019 Dated : 17.06.2019
e-PROCURMENT TENDER NOTICE
The e-tenders are invited for hiring of (two) 52 seater busses and (two) 42 seater busses for transportation of students from hostels to college, clinics etc. for CVSc, R'nagar, Korutla; Mamnoor and CFSc, Pebbair. Hard copies of filled in tender forms should reach the undersigned on or before 28.06.2019 by 4.00 PM. For tender document and other details please log on to http://eprocurement.telangana.gov.in Tender ID 126374, 126429, 126479 & 126499 and for other information http://tsvu.nic.in
Sd/- Registrar

T.S.CO-OP OILSEEDS GROWERS' FEDERATION Ltd.,
9th Floor, Parisrambhavanam, Basheerbagh, Hyderabad-04.
TEL No: 23235501/02. Fax No: 040-23299350.
E-mail: tsoilfed@gmail.com
TENDER CUM AUCTION NOTICE
TSOILFED, Hyderabad, hereby invites applications from the interested parties to participate in Tender cum auction for Cutting, Uprooting and Cleaning, Loading, Shifting, Unloading and Transportation of Subabul and Waste Trees in 12 acres (approx) at central processing unit, Beechpally, Jogulamba Gadwal dist. Interested parties may obtain Tender document from Head Office on payment of Cash or DD of Rs 500/- in favour of T.S Co operative Oilseeds Growers Federation Ltd, Hyderabad. During the office hours from Dt. 18.06.2019 to 27.06.2019 by 11:00AM. The filled in tenders should reach to our office on Dt. 28.06.2019 by 03:00PM on the same day.
Sd/-
Date: 17.06.2019 MANAGING DIRECTOR

## కాంగ్రెస్ పాపాన్ని కడుగుతాం

- ఎస్సారెస్పీ కింద ఏనాడైనా 3-4 లక్షల ఎకరాలైనా తడిపారా?
- భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐదున్నర దశాబ్దాలకుపైగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయకుండా రైతుల ఆత్మహత్యలకు కారణమైన కాంగ్రెస్ పార్టీ పాపాన్ని కడిగేందుకే సీఎం కేసీఆర్ కాళేశ్వరం ఎత్తిపోతల ప థకాన్ని చేపట్టారని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి పేర్కొన్నారు, ఎస్సారెస్పీ కింద ఏనాడూ 3-4 లక్షల ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వలేకపోయిన కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాల్సిందిపోయి కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలుచేయడం విడ్డూరమన్నారు. సోమవారం ఆయన ఐడీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో కేవలం 15 శాతం పనులే పూర్తయ్యాయన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క వ్యాఖ్యలను తిప్పికొట్టారు. 15 శాతం పనులతో నీటి విడుదల సాధ్యమవుతుందా? అని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క విజ్ఞత మరచి, అంగోటా మాటలే మాట్లాడటం దురదృష్టకరమని ఎద్దేవాచేశారు. భట్టి తన వెంట వస్తే కాళేశ్వరం ప్రాజెక్టును చూపించి, అవగాహన కల్పిస్తానన్నా రు. ఆ తర్వాత దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు సిద్ధంకావాలని సవాల్ విసిరారు. మూ డేండ్లలోనే ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందించడం సీఎం కేసీఆర్‌కు త ప్ప దేశంలో మరే ముఖ్యమంత్రికీ సాధ్యం కాలేదన్నారు.

**రూ.1300 కోట్లతో నెట్‌వర్క్ బలోపేతం**

కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకునేందుకు కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉన్నపుడు ఎడాపెడా కాల్వలు తవ్వి గాలికి వదిలేశారని, అవి శిథిలావస్థకు చేరాయని ఈద శంకర్‌రెడ్డి ఆరోపించారు. సీఎం కేసీఆర్ రూ.1300 కోట్లు మంజూరుచేసి.. ఎస్సారెస్పీ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల ప్రవాహసామర్థ్యాన్ని పెంచి మరమ్మతులుచేయించారన్నారు. ఈ వాస్తవాలన్నీ ప్రజల కండ్ల ముందు ఉన్నాయని, అందుకే రెండో పర్యాయం టీఆర్‌ఎస్‌ను గెలిపించారన్నారు.

## సీఎల్పీ నేతగా భట్టి.. వారికిష్టం లేదు

- విక్రమార్కపై అసంతృప్తితో కాంగ్రెస్‌లోని ఉన్నతవర్గాలు
- వైఎస్ కుటుంబం రోడ్డున పడ్డప్పుడు ఏం చేశారు?
- నాలుగు సీట్లు రాగానే బీజేపీ నేత లక్ష్మణ్ ఎగిసిపడుతున్నారు
- మీడియాతో మంత్రి తలసాని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ శాసనసభాపక్షనేతగా మల్లు భట్టి విక్రమార్క ఉండటం ఆ పార్టీలోని ఉన్నతవర్గాలకు చెందిన నాయకులకే ఇష్టం లేదని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో కూర్చుని కాదని.. ప్రజల మధ్యలోకి వచ్చి మాట్లాడాలని సూచించారు. టీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుతో కలిసి ఆయన మీడియా మాట్లాడుతూ.. అవినీతికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అని విమర్శించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిచేసిన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి దేశమంతా గర్వపడుతున్నదని, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో కాంగ్రెస్ నేతలు తట్టెడుమట్టి కూడా తీయని దొంగలని అభివర్ణించారు. వారి ప్రభుత్వ హయాంలో అడ్వాన్స్‌ల పేరుతో దోచుకున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ స్వయంగా ఒక ఇంజినీర్‌లా కష్టపడి.. తక్కువ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేయించారని కొనియాడారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాటలు చూస్తే ఆ పార్టీలో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని ఎద్దేవాచేశారు. భట్టి విక్రమార్క తనంత మేధావి ప్రపంచంలోనే లేడని అనుకుంటారని.. కాళేశ్వరం గురించి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌ను కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి రావద్దని, వైఎస్ ఆత్మ ఘోషిస్తుందని అంటున్న భట్టి విక్రమార్క.. వైఎస్ కుటుంబం రోడ్డున పడ్డప్పుడు ఏం చేశాడని ప్రశ్నించారు. నాలుగు సీట్లు గెలువగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఎగిసిపడుతున్నారని.. కేటీఆర్‌ను సీఎం చేస్తానని కేసీఆర్ ఆయనతో చెవిలో చెప్పారా? అని మంత్రి తలసాని ఎద్దేవాచేశారు. ఒకవేళ కేటీఆర్ ముఖ్యమంత్రి కావొద్దని ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. టీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేసిన కార్పొరేటర్‌ను బీజేపీలో చేర్చుకొని.. తమ పార్టీలో అందరూ చేరుతున్నట్టుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతినేలా ఉగ్రవాదులకు అడ్డా అని మాట్లాడటం సరికాదని హితవుపలికారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు చూసి దేశం గర్వపడుతున్నదని చెప్పారు.



టీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్. చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

### నేటి నుంచి నట్టల మందు పంపిణీ

- రంగారెడ్డి జిల్లా చింతపట్లలో ప్రారంభించనున్న మంత్రి తలసాని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 25 వరకు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు. పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చింతపట్లలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. తొలుత మహబూబాబాద్ జిల్లా గుమ్మలూరులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ.. షెడ్యూల్‌ను మార్పుచేశారు.

### బీజేపీలోకి పెద్దిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీడీపీ సీనియర్ నేత, మాజీమంత్రి పెద్దిరెడ్డి త్వరలో బీజేపీలో చేరనున్నారు. బీజేపీ నేతలతో చర్చలు పూర్తయ్యాయని.. ఆ పార్టీలో చేరే తేదీ, సమయం త్వరలో ఖరారు అవుతుందని సోమవారం పీటీఐ వార్తా సంస్థతో చెప్పారు.

### ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి

- టీఎంయూ జనరల్ సెక్రటరీ అశ్వత్థామరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్ ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి.. సంస్థను లాభాల బాట పట్టించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ అశ్వత్థామరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బస్‌భవన్ యూనియన్ ఆఫీస్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సంస్థకు ఎండీ లేకపోవటం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేం దుకు యాజమాన్యం చొరవ చూపాలని కోరారు.



ప్రభుత్వ సహకారంతో మంగళ వారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న గల్ఫ్‌బాధితులు

## కేటీఆర్ చొరవతో 39 మంది గల్ఫ్‌బాధితులకు విముక్తి

- ప్రభుత్వ ఖర్చులతో స్వదేశానికి చేరిక
- స్వస్థలాలకు పంపుతున్న అధికారులు

**హైదరాబాద్/శంషాబాద్:** ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి చాలీచాలని జీతాలతోపాటు అనారోగ్యంతో అవస్థలు పడుతూ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న 39 మంది తెలంగాణ బిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం విముక్తి కల్పించింది. వీరంతా సోమవారం రాత్రి స్వదేశానికి చేరుకున్నారు. బాధితులను ప్రభుత్వ ఖర్చులతో స్వదేశానికి తీసుకొచ్చిన అధికారులు.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి స్వస్థలాలకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. బాధితుల్లో నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జడ్చర్ల, సిరిసిల్ల, రామగుండం ప్రాంతాలవారు ఉన్నారు. ఆరునెలలుగా వీరికి గల్ఫ్‌లోని కంపెనీలు వేతనాలు ఇవ్వకపోగా.. ఆహారాన్ని కూడా అందించలేదు. వీరి బాధలను ట్విట్ట ర్ ద్వారా తెలుసుకున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఎస్కే జోషిని కోరారు. సౌదీలోని భారత రాయబార కార్యాలయం కూడా స్పందించి బాధితులను రాష్ట్రానికి పంపేందుకు ఏర్పాట్లు చేసింది. వారివద్ద ఉన్న వర్క్‌పర్మిట్ వీసాల గడువు పూర్తవడంతో తాత్కాలిక ఎగ్జిట్ వీసాలను అందజేసింది. వీరు స్వరాష్ట్రానికి చేరుకోవడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సౌదీలోని భారత రాయబార కార్యాలయంతోపాటు, తెలంగాణ ఎన్నారై విభాగ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నారైశాఖ అధికారి చిట్టిబాబు శంషాబాద్ విమానాశ్రయంలో బాధితులను రిసీవ్‌చేసుకుని స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రాగానే బాధితుల ఆనందం మిన్నంటింది. ప్రభుత్వం తమకు ఉపాధి చూపించాలని వారు కోరుతున్నారు.

**ఐదేండ్లు పనిచేసినా మిగిలిందేమి లేదు..**

గల్ఫ్‌లో ఐదేండ్లు శ్రమపడినా బాధలు, కన్నీళ్లు తప్ప మిగిలిందేమీ లేదు. కనీసం స్వదేశానికి తిరిగిరావడానికి కూడ ఖర్చు లు లేవు. ప్రభుత్వమే ఖర్చులు భరించి మమ్మల్ని స్వదేశానికి తీసుకొచ్చినందుకు ధన్యవాదాలు

– అంజయ్య, కరీంనగర్

**తిరిగొస్తామనుకోలేదు..**

మేము స్వదేశానికి వస్తామనుకోలేదు. గల్ఫ్‌లో అడుగడుగునా అడ్డంకులే. అయినవారిని వదిలి గల్ఫ్‌కు వెళ్తే సాధించేదేమీ ఉండదు. – జయరాజ్, జగిత్యాల

**రోజుల తరబడి పస్తులు..**

గల్ఫ్‌లో రోజుల తరబడి పస్తులున్నాం. ఇకపై ఇక్కడే కాయకష్టంచేసి సొంతవారి మధ్య బతుకుతాను.

– సాయన్న, నిర్మల్

**ప్రభుత్వానికి ధన్యవాదాలు**

రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడిఉంటాం. సొంతగడ్డపై అడుగు పెట్టేందుకు సహకరించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– రాజు, సిరిసిల్ల

**ప్రభుత్వం వెంటనే స్పందించింది**

గల్ఫ్‌లో ఎన్నో కష్టాలు పడ్డ మా పట్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. ప్రభుత్వమే మాకు జీవనోపాధి చూపాలి.

– మల్లేశ్, జగిత్యాల

### మా నాయకుల్లో గందరగోళం ఉంది

- నాకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తే పార్టీని బలోపేతం చేస్తా
- కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తమ పార్టీ నాయకుల్లో గందరగోళం ఉన్నదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. తనకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తే పార్టీని బలోపేతంచేస్తానని చెప్పారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్ఫ్యూజన్‌లో ఉన్నారు కానీ క్యాడర్‌కాదని పేర్కొన్నా రు. పార్టీ మారే అంశంపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తనకు ఫోన్ చేసినమాట వాస్తవమేనన్నారు. రాజగోపాల్‌రెడ్డి తనతో ఏం మాట్లాడారో తాను చెప్పనని.. తాను పార్టీ మారడం లేదని స్పష్టం చేశారు.

### రాజగోపాల్‌రెడ్డికి షోకాజ్ నోటీస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఆ పార్టీ క్రమశిక్షణా సంఘం చైర్మన్ కో దండరెడ్డి షోకాజ్ నోటీసులు జారీచే శారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్‌లేదని, రాష్ట్రంలో బీజేపీ బలపడుతున్నదని రాజ్‌గోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించిన నేపథ్యంలో సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం సమావేశ మైంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జి కుంతియాతో ఫోన్‌లో సంప్రదించిన అనంతరం రాజ్‌గోపాల్ రెడ్డి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీచేశారు. ప్రధాని మోదీని ప్రశంసించడం అంటే.. రాహుల్‌గాంధీని అవమానించడమేనని నోటీసులో పేర్కొన్నారు.

## బిట్‌కాయిన్‌తో పర్యావరణానికి ముప్పు!

- ఏటా 22 మెగా టన్నుల $CO_2$ విడుదల
- జర్మనీ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి



**బెర్లిన్, జూన్ 17:** వర్చువల్ కరెన్సీ బిట్‌కాయిన్ మూలంగా వాతావరణానికి పెను ముప్పు పరిణమించనున్నట్టు జర్మనీలోని మ్యూనిచ్ సాంకేతిక విశ్వవిద్యాలయం(టీయూఎం) శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బిట్‌కాయిన్ మూలంగా ఏటా 22 నుంచి 22.9 మెగా టన్నుల కార్బన్ డై ఆక్సైడ్($CO_2$) వాతావరణంలోకి విడుదలవుతున్నట్టు వారి అధ్యయనంలో తేలింది. ఒక ఏడాదిలో లాస్ వేగాస్, వియన్నా నగరాలు సంయుక్తంగా విడుదల చేసే $CO_2$కు ఇది సమానం. కంప్యూటర్లలో సంక్లిష్టమైన ప్రోగ్రామింగ్ కోడ్‌ల ఆధారంగా రూపొందే క్రిప్టో కరెన్సీలకు వాడే మైనింగ్ ప్రాసెస్ కోసం 2018లో (నవంబర్ వరకు) ఏకంగా 46TWh (46 టెరా వాట్) కరెంటును వాడినట్టు ఈ అధ్యయనంలో వెల్లడైంది. ఈ క్రమంలో సుమారు 22 మెగా టన్నుల $CO_2$ విడుదలైనట్టు వాళ్ళు పేర్కొన్నారు. కార్బన్ ఫుట్ ప్రింట్ విశ్లేషణలతో ఈ గణాంకాలను సేకరించినట్టు శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా తెలిపారు.

## కోర్టులోనే కుప్పకూలిన ఈజిప్టు మాజీ అధ్యక్షుడు



**కైరో:** ఈజిప్టు మాజీ అధ్యక్షుడు, ముస్లిం బ్రదర్ హుడ్ నేత మహమ్మద్ మోర్సీ సోమవారం కోర్టులోనే కుప్పకూలి మరణించారు. 2012లో దేశంలో మొదటిసారిగా ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించిన ఎన్నికల్లో మోర్సీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ మరుసటి ఏడాదే సైన్యం ఆయనను గద్దె దించింది. 67 ఏండ్ల మోర్సీ సోమవారం కోర్టు విచారణకు హాజరై తన వద్ద చాలా రహస్యాలు ఉన్నాయని, వాటిని వెల్లడిస్తానని హెచ్చరించినట్లు ఓ అధికారి తెలిపారు. కొన్ని నిమిషాలకే ఆయన కుప్పకూలారని చెప్పారు.

## వీడని మిస్టరీ

- అమెరికాలో తెలుగు కుటుంబం హత్యపై కొనసాగుతున్న దర్యాప్తు

**వాషింగ్టన్:** అమెరికాలోని అయోవాలో హత్యకు గురైన తెలుగుకుటుంబం కేసులో మిస్టరీ వీడటం లేదు. వెస్ట్ డెస్ మోయినెస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్న చంద్రశేఖర్ సుంకర కుటుంబం ఆదివారం హత్యకు గురైనట్టు పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ వాసి చంద్రశేఖర్ సుంకర (44) అయోవా రాష్ట్ర ప్రజా భద్రతా విభాగంలో ఐటీ నిపుణుడిగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఆయన భార్య లావణ్య సుంకర (41) ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని, ఇంకా ఎవరినీ అరెస్ట్ చేయలేదన్నారు. మరో కుటుంబానికి చెందిన ఇద్దరు పెద్దవారు, ఇద్దరు పిల్లలు చంద్రశేఖర్ ఇంటిలో పేయింగ్ గెస్ట్‌లుగా ఉంటున్నారని, వారినీ ప్రశ్నిస్తున్నామన్నారు. చంద్రశేఖర్ కొన్నాళ్లుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాడని స్థానికులు చెప్తున్నారు. ఆయనే కుటుంబసభ్యులను హత్యచేసి తాను ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నారు. చంద్రశేఖర్ కుటుంబం అందరితో స్నేహంగా ఉండేదని వారి సన్నిహితుడు శ్రీకర్ సోమయాజుల తెలిపారు. తనకు పదేండ్లుగా వారితో అనుబంధం ఉన్నదని, వారి ఇద్దరు పిల్లలు చాలా ప్రతిభావంతులన్నారు. వారి మరణం తనను ఎంతో కలిచివేస్తున్నదన్నారు.

**ఫిలడెల్ఫియాలో కాల్పులు.. ఒకరు మృతి**

అమెరికాలోని ఫిలడెల్ఫియాలో జరిగిన కాల్పుల్లో ఒకరు మృతిచెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం నగరశివారులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఓ గ్ర్యాడ్యుయేషన్ పార్టీకి 60 మంది యువతీయువకులు హాజరయ్యారు. రాత్రి 10 గంటల సమయంలో ఓ వ్యక్తి ఒక్కసారిగా మిగతావారిపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇషికా మైటే (24) అనే యువతి మరణించగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. కాల్పులు ఎవరు జరిపారు? కారణం ఏమిటి? వంటి వివరాలు ఇంకా తెలియదని పోలీసులు చెప్పారు.



చంద్రశేఖర్ (ఫైల్)



లావణ్య (ఫైల్)

## ఐఎస్‌ఐ కొత్త చీఫ్ హమీద్

**ఇస్లామాబాద్, జూన్ 17:** పాకిస్థాన్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్‌ఐ) కొత్త అధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ ఫైజ్ హమీద్ నియమితులయ్యారు. ప్రస్తుత ఐఎస్‌ఐ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ అసిమ్ మునీర్‌కు మూడేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ పాక్ ఆర్మీ అనూహ్యంగా ఆయనను తప్పించింది. కేవలం 8 నెలలపాటు ఐఎస్‌ఐ బాస్‌గా వ్యవహరించిన మునీర్‌ను గుజ్రన్‌వాలా కోర్ కమాండర్‌గా నియమించింది. ఈ మేరకు పాక్ ఆర్మీ మీడియా విభాగమైన ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) ఆదివారం అధికారికంగా ప్రకటించింది.

**పాక్ ఆర్మీపై విమర్శలు చేసిన జర్నలిస్ట్ హత్య!**

పాక్‌కు చెందిన మహమ్మద్ బిలాల్ ఖాన్ అనే జర్నలిస్టును ఓ గుర్తుతెలియని దుండగుడు హత్య చేశాడు. పాక్ మిలిటరీ, ఆ దేశ గూఢచార సంస్థ ఐఎస్‌ఐపై ధైర్యంగా విమర్శలు చేయడంతోనే బిలాల్‌ను హత్య చేసినట్టు అనుమానిస్తున్నారు.



సోమవారం 17వ లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ.. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, జీ కిషన్‌రెడ్డి, స్వతంత్ర సభ్యురాలు సుమలతా అంబరీష్

# కొలువుదీరిన కొత్తసభ

- బీజేపీ సభ్యుల ఆనందోత్సాహాలు
- 'భారత్‌మాతా కీ జై' నినాదాలతో హోరు
- 'మోదీ మోదీ' నినాదాల మధ్య ప్రధాని ప్రమాణం
- తమ మాతృభాషల్లోనే మెజారిటీ సభ్యులు
- స్మృతి ప్రమాణం వేళ బీజేపీ సభ్యుల హర్షాతిరేకాలు
- మధ్యాహ్నం వరకు సభకు రాని కాంగ్రెస్ అధినేత రాహుల్
- ప్రొటెం స్పీకర్ వీరేంద్రకుమార్ ఆధ్వర్యంలో 320 మంది సభ్యుల ప్రమాణాలు పూర్తి

**న్యూఢిల్లీ, జూన్ 17:** బీజేపీ సభ్యుల ఆనందోత్సాహాలు.. కొత్త సభ్యుల కోలాహలం నడుమ 17వ లోక్‌సభ సోమవారం కొలువుదీరింది. సభలో ఆద్యంతం అధికార బీజేపీ సభ్యుల 'భారత్ మాతా కీ జై', 'జై శ్రీరాం' నినాదాలతో హోరెత్తించారు. జాతీయ గేయాలాపన తర్వాత ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, నితిన్ గడ్కరీతోపాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తదితరులు నూతన సభ్యులుగా ప్రమాణం చేశారు. తొలుత ప్రధాని మోదీ, తర్వాత ప్రిసైడింగ్ ఆఫీసర్ల ప్యానెల్ సభ్యులు కే సురేశ్, బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, భర్తృహరి మెహతాబ్ ప్రమాణం చేశారు. ప్రధాని మోదీ పేరును లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాత్సవ పిలిచినప్పుడు అధికార ఎన్డీఏ సభ్యులు బల్లలు చరుస్తూ.. 'మోదీ మోదీ', 'భారత్‌మాతాకీ జై' అంటూ నినాదాలతో హోరెత్తించారు. 'నరేంద్ర దాస్ మోదీ అనే నేను లోక్‌సభ సభ్యుడిగా నియమితుడినయ్యాను. రాజ్యాంగానికి కట్టుబడి నా విధులు నిర్వర్తిస్తానని ప్రమాణం చేస్తున్నాను' అని మోదీ ప్రమాణం చేశారు. ఈ సమయం లో ఆర్పీఐ అధినేత రామ్‌దాస్ అథావలె లేచి నిలబడి రాహుల్‌గాంధీ ఎక్కడ? అని ప్రశ్నించారు. విపక్ష సభ్యులు స్పందిస్తూ.. 'ఆయన ఇక్కడే ఉన్నారు. సభలోకి వస్తారు' అని ప్రతిస్పందించారు. ప్రధానితోపాటు పలువురు మంత్రులు హిందీలో ప్రమాణం చేశారు. మిగతా మంత్రులు హర్షవర్ధన్, శ్రీపాద్ నాయక్, అశ్వినీ చౌబే, ప్రతాప్ చంద్ర సారంగి.. సంస్కృతంలో, డీవీ సదానందగౌడ, ప్రహ్లద్ జోషి కన్నడలో, హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ పంజాబీలో, అరవింద్ గణపత్ సావంత్, రావ్‌సాహెబ్ పాటిల్ దాండ్వే మరాఠీలో, జితేంద్రసింగ్ డోగ్రీలో, రామేశ్వర్ టెలీ అసోమీలో, దేబశ్రీ చౌదరి బంగ్లా భాషలో ప్రమాణం చేశారు. బీజేడీ సభ్యుడు భర్తృహరి మహతాబ్ ఒడియాలో ప్రమాణం స్వీకరించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ మధ్యాహ్నం సభకు వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని అధికార వైసీపీ పక్ష సభ్యులు తమ మాతృభాష తెలుగులో ప్రమాణం చేశారు. మిగతా సభ్యుల్లో అత్యధికులు తమ మాతృభాషల్లోనే ప్రమాణ స్వీకారం చేశారు. బీహార్‌కు చెందిన బీజేపీ సభ్యుడు జనార్దన్ సింగ్ సిగ్రీవాల్ తాను భోజ్‌పురిలో ప్రమాణం చేస్తానన్నారు. కానీ ఆ భాష రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో లేదని సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాత్సవ తెలుపడంతో ఆయన తన ఆలోచనను విరమించుకున్నారు. అరుణాచల్ ప్రదేశ్ సభ్యుడు తాపిర్ గావో ప్రమాణం చేయడానికొచ్చినప్పుడు హోంమంత్రి అమిత్‌షా బల్ల ను చరిచారు. పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రమాణం చేయాలని పొరపాటున పిలిచిన సెక్రటరీ జనరల్.. వెంటనే సరిదిద్దుకున్నారు. ఆయన రాజ్యసభ సభ్యుడన్నారు.

**గురువు పేరు చేర్చేందుకు ప్రజ్ఞాసింగ్ యత్నం.. విపక్షాల అభ్యంతరం**

భోపాల్ నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌ను ఓడించిన బీజేపీ నేత, లోక్‌సభ సభ్యురాలు సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్.. తన పేరు పక్కన అధ్యాత్మిక గురువు పేరు చేర్చి ప్రమాణం చేసేందుకు ప్రయత్నించడంతో విపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అనే పేరు పక్కన తన గురువు స్వామి పూర్ణ చేతనానంద్ అవధేశానంద్ పేరును చేర్చి ప్రమాణం చేయబోతుండగా విపక్షాలు అడ్డుకున్నాయి. దీనిపై ప్రొటెం స్పీకర్ వీరేంద్ర కుమార్ స్పందిస్తూ.. లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి అందజేసే సర్టిఫికెట్‌లో ఉన్న పేరుపైనే ప్రమాణం చేయాలని సూచించారు. దీంతో సంస్కృతంలో తన పేరుతో ప్రమాణం చేసిన ప్రజ్ఞాసింగ్.. భారత్ మాతాకీ జై అన్న నినాదంతో ముగించారు. బెంగాల్ మంత్రులు బబుల్ సుప్రియో, దేబశ్రీ చౌదరీలు ప్రమాణం చేస్తున్నంత సేపు బీజేపీ సభ్యులు 'జై శ్రీరామ్' నినాదాలు హోరెత్తించారు.

### ప్రొటెం స్పీకర్‌గా వీరేంద్రకుమార్



లోక్‌సభ ప్రారంభానికి ముందు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బీజేపీ సభ్యుడు వీరేంద్రకుమార్‌తో ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయించారు. లోక్‌సభ సమావేశం ప్రారంభం కాగానే వీరేంద్రకుమార్ నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. సోమవారం 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 320 మంది ఎంపీలు ప్రమాణం చేశారు. మిగతా 222 మందితో మంగళవారం ప్రమాణం చేయిస్తారు. 543 స్థానాలు గల లోక్‌సభలో తమిళనాడులోని వెల్లూరు స్థానానికి ఎన్నిక జరుగలేదు. 542 మంది సభ్యులందరితో ప్రమాణం పూర్తయ్యాక బుధవారం లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తారు. వీరేంద్రకుమార్ ఇంతకుముందు ఆరుసార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యంవహించారు. ఇటీవలి ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని టికంగఢ్ నుంచి గెలిచారు.

### తెలుగులో కిషన్‌రెడ్డి..

తెలంగాణలోని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్ రెడ్డి తెలుగులో ప్రమాణం చేశారు. లోక్‌సభలో 22 భాషల్లో ప్రమాణం చేయడానికి అనుమతి ఉన్నది. మరో కేంద్ర మంత్రి డాక్టర్ హర్షవర్ధన్.. సంస్కృతంలో ప్రమాణం చేస్తున్నప్పుడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చిరునవ్వులు చిందించారు.

### స్మృతి ఇరానీకి కరతాళ ధ్వనులు

కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ప్రమాణం చేస్తున్నప్పుడు సభ కరతాళ ధ్వనులతో మార్మోగింది. ఆమె ప్రమాణం చేయడానికి ముందుకు వచ్చినప్పటి నుంచి ముగిసే వరకు ప్రధాని మోదీతోపాటు బీజేపీ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ బల్లలు చరుస్తూ అభినందించారు. ఆమె హిందీలో ప్రమాణం చేశారు. ఆ వెంటనే ఆమెను ప్రొటెం స్పీకర్ వీరేంద్ర కుమార్ అభినందించారు. అనంతరం ఆమె యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీకి నమస్కరించగా, ఆమె ప్రతి నమస్కారం చేశారు. స్మృతి అటుపై కాంగ్రెస్, బీజేపీ సభ్యులకు నమస్కరిస్తూ వెళ్లి తన స్థానంలో కూర్చున్నారు. ఈ సమయంలోనూ రాహుల్‌గాంధీ సభలో లేకపోవడం గమనార్హం.

### సంతకం మరిచిన రాహుల్..

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆంగ్లంలో ప్రమాణం చేసి, పార్లమెంట్ రిజిస్టర్‌లో సంతకం చేయకుండానే వెళ్లిపోయారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు పలువురు సభ్యులు, అధికారులు ఆ సంగతి గుర్తుచేయడంతో వెనుకకు వచ్చి సంతకం చేశారు. రాహుల్ ప్రమాణం చేసి వస్తున్నప్పుడు ఆయన తల్లి సోనియాగాంధీతోపాటు కాంగ్రెస్ సభ్యులంతా బల్లలు చరిచి అభినందించారు. నూతన ఎంపీగా ప్రమాణం చేయడానికి కొన్ని నిమిషాల ముందు ట్విట్టర్‌లో రాహుల్ స్పందిస్తూ రాజ్యాంగం పట్ల విశ్వాసం, విధేయత చూపుతానని ట్వీట్ చేశారు.

## సంఖ్యాబలంపై చింతవద్దు

- మీ ప్రతి మాట అమూల్యమే
- ప్రతిపక్షాలకు ప్రధాని భరోసా

**న్యూఢిల్లీ, జూన్ 17:** ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం పోషించవలసిన నిర్మాణాత్మక పాత్రను ప్రధాని నరేంద్రమోదీ కొనియాడారు. 17వ లోక్‌సభ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా సోమవారం ఆయన పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. విపక్షాలు తాము తక్కువ సంఖ్యలో ఉన్న విషయమై చింతించవద్దన్నారు. సభలో వారు మాట్లాడే ప్రతిమాట ఎంతో విలువైనదని అన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయంతో దిగ్భ్రాంతికి గురైన ప్రతిపక్షం పార్లమెంట్ సమావేశాలకు ముందు.. సభలో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రతిసారి జరిగే భేటీని కూడా నిర్వహించుకోలేకపోయింది. బీజేపీ ధాటికి వరుసగా రెండోసారి కూడా ప్రతిపక్ష హోదాను దక్కించుకోలేకపోయిన కాంగ్రెస్ పార్టీ కనీసం తమ లోక్‌సభ పక్ష నాయకుడిని కూడా ఎన్నుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్లమెంట్ సభ్యులందరూ సభలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ దేశ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఆయా అంశాలపై స్పందించాలని సూచించారు. 'పార్లమెంట్‌కు వచ్చిన తరువాత మేము అధికార పక్షమా లేక ప్రతిపక్షమా అన్న విషయాన్ని మరిచిపోవాలి. ఆయా అంశాల విషయమై నిష్పక్షపాతంగా ఆలోచించాలి, దేశ విస్తృత ప్రయోజనాల కోసం కృషి చేయాలి' అని పేర్కొన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం క్రియాశీలంగా ఉండాల్సిన ప్రాధాన్యాన్ని ఆయన గుర్తుచేశారు. 'ప్రతిపక్షం క్రియాశీలంగా వ్యవహరిస్తూ సభా కార్యకాలాపాల్లో పాల్గొంటుందని ఆశిస్తున్నా. ఈ సమావేశాలు ఫలవంతంగా సాగుతాయని భావిస్తున్నా' అని చెప్పారు. 'ప్రతిపక్షాలు తమ సంఖ్యాబలంపై చింతించనవసరం లేదు. సభా వ్యవహారాల్లో వారు చురుకుగా పాల్గొంటారని భావిస్తున్నాను. వారి ప్రతి మాట.. ప్రతి మనోభావం ఎంతో విలువైనవి' అని మోదీ పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన లోక్‌సభలో పలు చారిత్రాత్మక అంశాలు ఉన్నాయని చెప్పారు. స్వాతంత్ర్య అనంతరం ఎన్నడూలేని విధంగా ఈసారి అత్యధిక సంఖ్యలో మహిళలు లోక్‌సభకు ఎన్నికయ్యారని తెలిపారు. 17వ లోక్‌సభలో ఇవి మొదటి సమావేశాలు గనుక.. సభలో కొత్త శక్తి, నూతనోత్సాహాన్ని చూడవచ్చని అన్నారు. తమ ప్రభుత్వం మొదటి విడుతలో సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అన్న సూత్రంపై పనిచేసిందని, అందువల్లే ప్రజలు తమపై విశ్వాసముంచి రెండోసారి అవకాశాన్ని ఇచ్చారని చెప్పారు.

## 'రబ్బర్ స్టాంప్' ట్రెండ్ మారాలి: కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** మోదీ సర్కార్ తన మొదటి పర్యాయంలో పార్లమెంటును రబ్బర్ స్టాంప్‌గా ఉపయోగించుకున్నదని, ఈ విధానానికి ఈ సారైనా స్వస్తి పలుకుతుందని భావిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది. తమ సంఖ్యాబలంపై ప్రతిపక్షాలు చింతించాల్సిన అవసరం లేదని ప్రధాని వ్యాఖ్యానించిన నేపథ్యంలో కాంగ్రెస్ ఈ మేరకు స్పందించింది. 'ఆర్డినెన్స్ ద్వారా చట్టం చేయడం ప్రజాస్వామ్యంలో అత్యంత అనారోగ్యకర విధానం. అత్యవసర పరిస్థితుల్లోనే ఈ విధానం అవలంబించాలి. అటువంటి పరిస్థితులు లేనప్పుడు ప్రభుత్వం చట్టాన్ని రూపొందించడానికి నిర్దేశించిన పద్ధతులను పాటించాలి' అని కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ అన్నారు. గత ఐదేండ్లలో పార్లమెంటును అగౌరవపరిచారని ఆయన ఆరోపించారు. కేవలం భారీ మెజార్టీ ఉన్నదన్న కారణంగా ప్రభుత్వం గత ఐదేండ్లలో చాలా బిల్లులను పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి పంపకుండానే లోక్‌సభలో ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంట్‌ను రబ్బర్ స్టాంప్‌లా వాడుకున్నదని మండిపడ్డారు. ఈ పద్ధతి ఇకనైనా మారుతుందని భావిస్తున్నామని, దీనికి సంబంధించి ప్రధాని హామీ కోసం వేచిచూస్తున్నామని చెప్పారు.

# బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నడ్డా

- పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో నిర్ణయం
- డిసెంబర్ వరకు అధ్యక్షుడిగా కొనసాగనున్న అమిత్ షా



బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాతో కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా

**న్యూఢిల్లీ, జూన్ 17:** బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా (కార్యనిర్వాహక అధ్యక్షుడిగా) కేంద్ర మాజీ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా (జేపీ నడ్డా) సోమవారం నియమితులయ్యారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన పార్లమెంటరీ బోర్డు సమావేశం అనంతరం రక్షణ మంత్రి, పార్టీ సీనియర్ నేత రాజ్‌నాథ్‌సింగ్ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కూడా పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా షా కొనసాగనున్నారు. 'బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఈ రోజు సమావేశమైంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నడ్డాను ఎంపికచేయడం జరిగింది. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, సంస్థాగత ఎన్నికలు పూర్తయ్యేవరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు' అని రాజ్‌నాథ్ ట్వీట్ చేశారు. షా నాయకత్వంలో బీజేపీ పలు ఎన్నికల్లో ఘన విజయాలు సాధించిందని, అయితే ప్రధాని ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోవడంతో పార్టీ అధ్యక్ష బాధ్యతలు వేరొకరికి అప్పగించాలని షా కోరారని రాజ్‌నాథ్ వరుస ట్వీట్లలో పేర్కొన్నారు. బీజేపీలో కార్యనిర్వాహక అధ్యక్షుడిని నియమించడం ఇదే తొలిసారి. నడ్డా ప్రస్తుతం బీజేపీ పార్లమెంటరీ బోర్డు కార్యదర్శిగా ఉన్నారు. అమిత్ షా వారసుడు నడ్డానే అని ఇప్పటికే ప్రచారం సాగుతున్నది. పార్టీ అధ్యక్షుడిగా షా పదవీ కాలం డిసెంబర్‌తో ముగియనుంది. 'ఒకరికి ఒకే పదవి' అన్న పార్టీ విధానం మేరకు ఆయనకు పదవీకాలం పొడిగించే అవకాశం లేదని పార్టీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికలకు మునుపు ఉత్తర్‌ప్రదేశ్ ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టిన నడ్డా.. పార్టీ ఘన విజయంలో కీలక పాత్ర పోషించారు. యూపీలోని మొత్తం 80 స్థానాల్లో బీజేపీ 62 స్థానాల్లో గెలుపొందింది. నడ్డా ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మునుపటి కేంద్ర ప్రభుత్వంలో ఆయన వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేశారు. పార్టీ సభ్యత్వాలను 20 శాతం మేర పెంచాలని నిర్ణయించిన నేపథ్యంలో నడ్డా నియామక ప్రకటన వెలువడింది.

## నేడు తీరాన్ని తాకనున్న వాయు

**అహ్మదాబాద్, జూన్ 17:** అరేబియా సముద్రంలో ఏర్పడిన తుఫాన్ 'వాయు' మరింత బలహీనపడింది. గత గురువారమే అది తీరం దాటుతుందని భావించినప్పటికీ.. మంగళవారం ఉదయం తీరాన్ని తాకే అవకాశం ఉన్నదని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. వాయు ప్రభావంతో గుజరాత్‌లో విస్తారమైన వర్షాలు పడవచ్చని హెచ్చరించింది. ఈ క్రమంలో సహాయ చర్యలు చేపట్టేందుకు ఐదు జాతీయ విపత్తు సహాయ బృందాలు (ఎన్డీఆర్ఎఫ్) సిద్ధమయ్యాయి. వాయు తుఫాన్ మరింత బలహీనపడి అల్పపీడనంగా మారవచ్చని..అయినా సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరించింది.

**21న మహారాష్ట్రకు రుతుపవనాలు**

నైరుతి రుతుపవనాలు ఈ నెల 21వ తేదీన మహారాష్ట్రకు రానున్నాయని.. జూన్ 24 లేదా 25లోపు రాష్ట్రమంతటా విస్తారమైన వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.

## నైజీరియాలో నరమేధం!

- టీవీలో ఫుట్‌బాల్ మ్యాచ్ చూస్తుండగా ఆత్మాహుతి దాడులు
- 30 మంది మృతి

**కానో:** నైజీరియాలో ఉగ్రభూతం మళ్లీ జడలు విప్పింది. టీవీలో ఫుట్‌బాల్ మ్యాచ్ చూస్తున్న వారిపై బొకోహరాం ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడి చేశారు. ఈ ఘటనలో 30 మంది ప్రాణాలుకోల్పోగా, మరో 40 మంది గాయపడ్డారు. నైజీరియా ఈశాన్య ప్రాంతం బోర్నో రాష్ట్ర రాజధాని మైదుగురికి 38 కి.మీ. దూరంలో ఉన్న కొండుగలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. అభిమానులు 'ఫుట్‌బాల్ హాల్'లో భారీగా గుమిగూడి టీవీలో ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షిస్తుండగా ముగ్గురు ఉగ్రవాదులు తమను తాము పేల్చుసుకున్నారు. ఈ దాడిలో 30 మంది చనిపోగా, మరో 40మంది గాయపడినట్టు ఆ దేశ అత్యవసర నిర్వహణ విభాగం(ఎస్ఈఎంఏ) అధికారి ఉస్మాన్ కాచల్లా వెల్లడించారు. అంబులెన్సులు సకాలంలో చేరుకోకపోవడం, సహాయక చర్యలు వెంటనే ప్రారంభం కాకపోవడంతో మృతుల సంఖ్య పెరిగిందని చెప్పారు. ఫుట్‌బాల్ మ్యాచ్‌ను టీవీలో వీక్షిస్తున్న హాల్ వద్దకు ముగ్గురు ఉగ్రవాదులు చేరుకోగా.. అందులో ఒకడిని అక్కడి ఆపరేటర్ అడ్డుకున్నాడని, అప్పుడు ఆత్మాహుతి దళ సభ్యుడు పేల్చేసుకున్నాడని చెప్పారు. అప్పటికే జనాల్లో కలిసిపోయిన మరోఇద్దరు ఆ తర్వాత పేల్చేసుకున్నారని వివరించారు.

# ఉగ్రవాదుల కాల్పుల్లో ఆర్మీ మేజర్ మృతి

- ఒక ఉగ్రవాది హతం

**శ్రీనగర్, జూన్ 17:** జమ్ముకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా అచ్‌బల్ ప్రాంతంలో సోమవారం ఉగ్రవాదులకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన కాల్పుల్లో ఆర్మీ మేజర్ కేతన్ శర్మ వీరమరణం పొందారు. మరో ఇద్దరు సైనికులు గాయపడ్డారు. అచ్‌బల్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో సోమవారం భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. వారిని గమనించి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. ఈ క్రమంలో ఆర్మీ మేజర్ కేతన్ శర్మకు బుల్లెట్లు తగలగడంతో మరణించారు. ఈ ఘటనలో ఒక ఉగ్రవాది కూడా హతమైనట్టు అధికారులు తెలిపారు.

**ఆర్మీ కాన్వాయ్ లక్ష్యంగా పేలుడు.. 11మందికి గాయాలు**

ఆర్మీ కాన్వాయ్ లక్ష్యంగా పుల్వామా జిల్లాలో సోమవారం ఉగ్రవాదులు ఐఈడీతో పేలుడు జరిపారు. 44 రాష్ట్రీయ్ రైఫిల్స్‌కి చెందిన ఆర్మీ కాన్వాయ్ లక్ష్యంగా దక్షిణ కశ్మీర్‌లోని ఈద్గా అరిహల్ ప్రాంతంలో ఈ పేలుడు జరిపారని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో తొమ్మిది మంది సైనికులకు, ఇద్దరు పౌరులకు గాయాలయ్యాయని చెప్పారు. వారిని దవాఖానలో చేర్పించినట్టు తెలిపారు.



మేజర్ కేతన్ శర్మ (ఫైల్)

# క్రూరం.. అమానవీయం.. అనాగరికం

- 'కఠువా' తీర్పులో జడ్జి వ్యాఖ్యలు



**పఠాన్‌కోట్:** కఠువా ఘటనలో నిందితులు క్రూరమైన, పైశాచిక చర్యకు పాల్పడ్డారని, ఎనిమిదేండ్ల బాలిక పట్ల మానవత్వం మరిచి అనాగరికంగా, అవమానకరంగా ప్రవర్తించారని పఠాన్‌కోట్ కోర్టు అభిప్రాయపడింది. ఈ కేసులో సాక్ష్యాధారాలతోపాటు మానవీయ కోణంలోనూ ఆలోచించి తీర్పు ఇవ్వాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. జమ్ముకశ్మీర్‌లోని కఠువాలో గత ఏడాది ఎనిమిదేండ్ల బాలికపై లైంగికదాడి జరిపి హత్యచేసిన కేసులో పఠాన్‌కోట్‌లోని ప్రత్యేక న్యాయస్థానం ఆరుగురు నిందితులకు ఈ నెల 10న శిక్ష విధించిన సంగతి తెలిసిందే. జస్టిస్ డాక్టర్ తేజేశ్వర్ సింగ్ ఇచ్చిన 432 పేజీల తీర్పు ప్రతి పీటీఐ వార్తాసంస్థకు లభించింది. ఈ మేరకు వివరాలను పీటీఐ వెల్లడించింది. 'స్వర్గం, నరకం ఎక్కడో ఉండవు. మన ఆలోచనలు, గుణం, చర్యలు వంటివి మన చుట్టూ స్వర్గాన్ని లేదా నరకాన్ని సృష్టిస్తాయి' అని ప్రారంభ వ్యాఖ్యాల్లో జడ్జి వ్యాఖ్యానించారు. బాలికపై జరిగిన దాడిని 'అమానవీయ, అనాగరిక, అవమానకరమైన' చర్యగా అభివర్ణించారు. కఠువా ప్రాంతంలో బకర్వాల్ సంచార జాతికి, స్థానికులకు మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయని, ఈ ఘటన వెనుక అదే బలమైన కారణమని తన తీర్పులో అభిప్రాయపడ్డారు. 'కేసు తీవ్రతను, ఆధారాలను పరిశీలించిన మీదట సంశయ లాభం కింద నిందితులకు ప్రయోజనం కల్పించాల్సిన అవసరం లేదని నిర్ణయించాం' అని పేర్కొన్నారు. ఈ ఘటనలో నేరుగా నిందితుల ప్రమేయం ఉన్నట్టు నిరూపితం కాలేదన్న డిఫెన్స్ వాదనలను తోసిపుచ్చారు. మిగితా కేసులతో పోల్చితే ఇది భిన్నమైనదని హృదయంతో ఆలోచించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

**పాయింట్ల పట్టిక**

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1. | ఆస్ట్రేలియా | 5 | 4 | 1 | 0 | +0.81 | 8 |
| 2. | న్యూజిలాండ్ | 4 | 3 | 0 | 1 | +2.16 | 7 |
| 3. | భారత్ | 4 | 3 | 0 | 1 | +1.02 | 7 |
| 4. | ఇంగ్లండ్ | 4 | 3 | 1 | 0 | +1.55 | 6 |
| 5. | బంగ్లాదేశ్ | 5 | 2 | 2 | 1 | -0.27 | 5 |
| 6. | శ్రీలంక | 5 | 1 | 2 | 2 | -1.77 | 4 |
| 7. | వెస్టిండీస్ | 5 | 1 | 3 | 1 | +0.27 | 3 |
| 8. | దక్షిణాఫ్రికా | 5 | 1 | 3 | 1 | -0.20 | 3 |
| 9. | పాకిస్థాన్ | 5 | 1 | 3 | 1 | -1.93 | 3 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 4 | 0 | 4 | 0 | -1.63 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు,

**వరల్డ్‌కప్‌లో నేడు** ఇంగ్లండ్ X ఆఫ్ఘనిస్థాన్ - 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

**అత్యధిక పరుగులు** 384 షకీబ్ (బంగ్లాదేశ్)

**అత్యధిక వికెట్లు** 13 ఆమిర్ (పాకిస్థాన్)

# సర్ఫరాజ్ తికమకపడ్డాడు


సచిన్

**మాంచెస్టర్:** దాయాదుల పోరులో పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ తికమక పడ్డాడని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డాడు. 'సర్ఫరాజ్ గందరగోళానికి గురైనట్లు కనిపించింది. పేసర్ వహబ్ రియాజ్ బౌలింగ్ చేస్తున్న సమయంలో స్లిప్‌లో ఫీల్డర్‌ను ఉంచకుండా.. షార్ట్ మిడ్‌వికెట్‌లో నిలబెట్టి.. షాదాబ్ ఖాన్ బౌలింగ్‌లో స్లిప్‌లో ఫీల్డర్ పెట్టడమే అందుకు నిదర్శనం. కీలక మ్యాచ్‌ల్లో ఇలాంటి చిన్న చిన్న తప్పిదాలు కూడా ఫలితంపై ప్రభావం చూపుతాయి. బంతి మూవ్ కాని తరుణంలో పదే పదే ఓవర్‌ది వికెట్ బౌలింగ్ చేసిన వహబ్.. ఆఖర్లో అరౌండ్ ది వికెట్‌కు మారినా అప్పటికే చాలా ఆలస్యమైంది' అని పాక్ ఓటమికి సచిన్ కారణాలు విశ్లేషించాడు. ఆదివారం జరిగిన పోరులో భారత్ 89 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసిన విషయం తెలిసిందే.

# ఒకప్పటి విండీస్‌ను తలపిస్తున్నది


శ్రీకాంత్

**మాంచెస్టర్:** వరుస విజయాలతో దూకుడుమీదున్న భారత్.. ఒకప్పటి వెస్టిండీస్ జట్టును తలపిస్తున్నదని మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. '1970-80ల్లో వెస్టిండీస్ జట్టును చూస్తేనే ప్రత్యర్థులు భయపడిపోయేవారు. ప్రస్తుతం టీమ్ఇండియా కూడా అలాంటి స్థితిలోనే కనిపిస్తున్నది. విరాట్ సేనతో పోరు అంటేనే ప్రత్యర్థులు మానసికంగా ఆందోళన చెందుతున్నట్లున్నారు' అని శ్రీకాంత్ పేర్కొన్నాడు. ఇక పాక్‌పై విజయంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, లోకేశ్ రాహుల్‌తో పాటు కుల్దీప్ యాదవ్ కూడా ప్రధాన పాత్ర పోషించాడని 'చిక్కా' తెలిపాడు. 'రోహిత్ శర్మ అద్భుత బ్యాట్స్‌మన్ అనే విషయం అందరికీ తెలిసిందే. కానీ, ఆదివారం మ్యాచ్‌లో రాహుల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ధవన్ గైర్హాజరీలో ఓపెనర్లు ఏం చేస్తారో అని అనుకుంటున్న తరుణంలో చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. తొలి ముగ్గురు భారీ స్కోర్లు చేయడంతో టీమ్ఇండియాకు తిరుగు లేకుండా పోయింది. పాక్ ఇన్నింగ్స్‌లో ఫఖర్, బాబర్ నిలదొక్కుకున్న సమయంలో కుల్దీప్ చక్కటి బంతితో ఈ జోడీని విడగొట్టాడు. బాబర్‌ను ఔట్ చేసిన బంతి గురించి ఎంత చెప్పినా తక్కువే' అని శ్రీకాంత్ వివరించాడు.

## మా కెప్టెన్‌కు బుద్ధిలేదు


అక్తర్

**ఇస్లామాబాద్:** విశ్వసమరంలో భాగంగా భారత్ చేతిలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న పాకిస్థాన్ జట్టుపై అన్నివైపుల నుంచి విమర్శల వర్షం కురుస్తున్నది. ఆ దేశ మాజీలంతా కెప్టెన్ సర్ఫరాజ్ నిర్ణయం.. ఆటగాళ్ల ప్రదర్శనపై నిప్పులు చెరుగుతున్నారు. పాక్ మాజీ పేసర్, రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ ఓ అడుగు ముందుకువేసి కెప్టెన్ సర్ఫరాజ్ తెలివితక్కువ నిర్ణయం వల్లే జట్టు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని మండిపడ్డాడు. 'జట్టు బలమేంటో, బలహీనతేంటో తెలియకుండా ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకున్నాడో అర్థం కావడం లేదు. వికెట్‌పై తేమ లేనప్పుడు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడం ముమ్మాటికీ తప్పే. ఇంజమామ్, యూసుఫ్, అన్వర్, అఫ్రిది వంటి గొప్ప బ్యాట్స్‌మెన్ జట్టులో ఉన్నప్పుడే ఛేజింగ్ సాధ్యం కాలేదు. అలాంటిది ఇప్పుడెలా చేయగలమనుకున్నాడో.. అదే మొదట బ్యాటింగ్ చేసుంటే 260 పరుగులైనా ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచేవి. మన వద్ద మంచి బౌలింగ్ దళం ఉంది కాబట్టి ఛేదనలో భారత్ కష్టపడాల్సి వచ్చేది. ఇలాంటి నిర్ణయాల వల్లే నీ మెదడు ఉపయోగించవనే విషయం స్పష్టమవుతున్నది' అని అక్తర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.

## పాక్ జట్టుకు సలహాలిస్తా


అమీర్‌ఖాన్

**మాంచెస్టర్:** విశ్వసమరంలో భారత్ చేతిలో ఓడిన పాకిస్థాన్ జట్టుకు సహాయం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని బ్రిటన్ బాక్సింగ్ స్టార్ అమీర్ ఖాన్ పేర్కొన్నాడు. ఫిట్‌నెస్‌తో పాటు ఆహార అలవాట్లకు సంబంధించిన విషయాల్లో జట్టు సభ్యులకు సలహాలు ఇచ్చేందుకు రెడీ అని అన్నాడు. 'శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎలా మారాలో పాక్ జట్టుకు నేర్పేందుకు సిద్ధంగా ఉన్నా. ఆహారం విషయంలో ఎలాంటి నియమాలు పాటించాలి. శిక్షణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచిస్తా. పాక్ జట్టులో ప్రతిభకు కొదవలేకున్నా.. వారి దృక్పథం, శరీరభాష మార్చుకోవాల్సిన అవసరం ఉంది' అని అమీర్ ట్వీట్ చేశాడు. పాక్ సంతతికి చెందిన అమీర్.. బ్రిటన్ తరఫున ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించాడు. అనంతరం ప్రొఫెషనల్ బాక్సర్ అవతారమెత్తి.. వరల్డ్ చాంపియన్‌గా నిలిచాడు.

# శభాష్ షకీబ్

## అజేయ శతకంతో అదరగొట్టిన ఆల్‌రౌండర్

### వెస్టిండీస్‌పై బంగ్లాదేశ్ రికార్డు విజయం.. లిటన్‌దాస్ మెరుపు ఇన్నింగ్స్

**6000**

ఈ మ్యాచ్‌తో బంగ్లా ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆరువేల పరుగుల మైలురాయిని దాటాడు. వన్డేల్లో వేగంగా 200 వికెట్లతో పాటు 6000 పరుగులు చేసిన ప్లేయర్‌గా ఘనత సాధించాడు.

**విధ్వంసక వీరులుగా విశ్వవ్యాప్త గుర్తింపు ఉన్న క్రిస్ గేల్, ఆండ్రీ రస్సెల్ సున్నాలు చుట్టినా.. వెస్టిండీస్ అలవోకగా 321 పరుగులు చేసింది. 13 బంతులాడిన యూనివర్సల్ బాస్ ఖాతా తెరవకుండానే వెనుదిరిగితే.. ఆడిన తొలి బంతికే తృటిలో తప్పించుకున్న డేంజర్ మ్యాన్ ఆండ్రీ.. రెండో బాల్‌కు పెవిలియన్ బాటపట్టాడు. అయినా మిగిలిన వాళ్లు జోరు కనబర్చడంతో విండీస్ భారీ స్కోరు చేసింది. లక్ష్య ఛేదనలో షకీబ్, లిటన్ సృష్టించిన పరుగుల సునామీ ముందు కరీబియన్ల మెరుపులు చిన్నబోయాయి. ఒక్కో పరుగుతో మొదలెట్టి ప్రవాహంలా మారిన వరదలో విండీస్ స్కోరు పత్తా లేకుండా కొట్టుకుపోయింది. రికార్డుల మీద రికార్డులు సృష్టించిన బంగ్లా పులులు పట్టికలో ఐదోస్థానానికి చేరారు.**


లిటన్ (94*)


షకీబ్ (124*, 2/54)

**టాంటన్:** చప్పటి మ్యాచ్‌లతో ప్రపంచకప్‌లో జోష్ లేకుండా పోయింది అని నీరసపడుతున్న అభిమానులకు సోమవారం మ్యాచ్ మస్తు మజానిచ్చింది. పరుగుల వరద పారిన పోరులో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. మొదట విండీస్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 321 పరుగులు చేసింది. షై హోప్ (121 బంతుల్లో 96; 4 ఫోర్లు, 1 సిక్స్) తృటిలో శతకం చేజార్చుకోగా.. ఎవిల్ లెవీస్ (67 బంతుల్లో 70; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), హెట్‌మైర్ (26 బంతుల్లో 50; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకాలతో అలరించారు. బంగ్లా బౌలర్లలో ముస్తఫిజుర్, సైఫుద్దీన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ (99 బంతుల్లో 124 నాటౌట్; 16 ఫోర్లు) అజేయ సెంచరీకి.. లిటన్ దాస్ (69 బంతుల్లో 94 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపులు తోడవడంతో బంగ్లా 41.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 322 పరుగులు చేసింది. ఇన్నింగ్స్‌కు మూలస్తంభంలా నిలవడంతో పాటు 2 వికెట్లు పడగొట్టిన షకీబుల్ హసన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.


హోప్ (96)

### స్కోరు బోర్డు

**వెస్టిండీస్:** గేల్ (సి) ముస్తఫిజుర్ (బి) సైఫుద్దీన్ 0, లెవీస్ (సి) (సబ్) షబ్బీర్ (బి) షకీబ్ 70, హోప్ (సి) లిటన్ దాస్ (బి) ముస్తఫిజుర్ 96, పూరన్ (సి) సర్కార్ (బి) షకీబ్ 25, హెట్‌మైర్ (సి) తమీమ్ (బి) ముస్తఫిజుర్ 50, రస్సెల్ (సి) ముష్ఫికర్ (బి) ముస్తఫిజుర్ 0, హోల్డర్ (సి) మహ్మదుల్లా (బి) సైఫుద్దీన్ 33, బ్రావో (బి) సైఫుద్దీన్ 19, థామస్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు:** 22, **మొత్తం:** 50వ ఓవర్లలో 321/8. **వికెట్ల పతనం:** 1-6, 2-122, 3-159, 4-242, 5-243, 6-282, 7-297, 8-321, **బౌలింగ్:** మొర్తజా 8-1-37-0, సైఫుద్దీన్ 10-1-72-3, ముస్తఫిజుర్ 9-0-59-3, మెహదీ 9-0-57-0, మొసద్దిక్ 6-0-36-0, షకీబ్ 8-0-54-2.

**బంగ్లాదేశ్:** తమీమ్ (రనౌట్/కాట్రెల్) 48, సర్కార్ (సి) గేల్ (బి) రస్సెల్ 29, షకీబ్ (నాటౌట్) 124, ముష్ఫికర్ (సి) హోప్ (బి) థామస్ 1, లిటన్ (నాటౌట్) 94, **ఎక్స్‌ట్రాలు:** 26, **మొత్తం:** 41.3 ఓవర్లలో 322/3. **వికెట్ల పతనం:** 1-52, 2-121, 3-133, **బౌలింగ్:** కాట్రెల్ 10-0-65-0, హోల్డర్ 9-0-62-0, రస్సెల్ 6-0-42-1, గాబ్రియల్ 8.3-0-78-1, థామస్ 6-0-52-1, గేల్ 2-0-22-0.

### భళిరా బంగ్లా

322.. బంగ్లాదేశ్ టార్గెట్. ప్రపంచకప్‌లోనే కాదు ఇప్పటివరకు తమ వన్డే చరిత్రలోనే బంగ్లా ఇంత భారీ స్కోరును కేవలం ఒక్కసారే ఛేదించింది. కానీ, అది స్కాట్లాండ్‌లాంటి చిన్న జట్టుపై.. మరి మెగాటోర్నీలో పాకిస్థాన్‌పై బౌన్సర్లతో బెంబేలెత్తించిన కాట్రెల్, హోల్డర్, థామస్, రస్సెల్, గాబ్రియల్‌లాంటి పేసర్లను ఎదుర్కొంటూ అంత స్కోరు చేస్తుందా అనిపించినా.. షకీబ్, లిటన్ పోరాటం అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్ (48; 6 ఫోర్లు), సౌమ్య సర్కార్ (29; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) అందించిన ఆరంభాన్ని సద్వినియోగం చేసుకున్న బంగ్లా ఆడుతూ పాడుతూ రికార్డు స్థాయి టార్గెట్‌ను ఛేజ్ చేసింది. ముష్ఫికర్ రహీమ్(1) విఫలమైనా ఆ ప్రభావం పెద్దగా పడకుండానే పని పూర్తి చేసింది. నాలుగో వికెట్‌కు రికార్డు స్థాయిలో 189 పరుగులు జతచేసింది. భారీ స్కోరే చేశామని సంబురపడ్డ కరీబియన్లకు కోలుకోలేని షాకిచ్చింది.

### చినుకులా మొదలై..

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ కెప్టెన్ మొర్తజా.. తొలి ఓవర్‌ను క్రిస్ గేల్‌కు మెయిడిన్‌గా వేయడంతో ఇన్నింగ్స్‌కు మంచి ఆరంభం లభించినట్లైంది. మరో ఎండ్‌లో సైఫుద్దీన్ కూడా చక్కటి బంతులతో కట్టిపడేయడంతో.. 13 బంతులాడి ఖాతా తెరవలేకపోయిన యూనివర్సల్ బాస్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాటపట్టాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ లెవీస్, హోప్ ఆచితూచి ఆడటంతో.. విండీస్‌కు తొలి పవర్‌ప్లేలో కేవలం 32 పరుగులే వచ్చాయి. రెండో వికెట్‌కు 116 పరుగులు జోడించాక లెవీస్ ఔటయ్యాడు. పూరన్ (25) ఎక్కువ సేపు నిలువలేకపోయినా స్టేడియం పైకప్పు పగలగొట్టేలా భారీ సిక్సర్ కొట్టి అభిమానులను అలరించాడు. 33 ఓవర్లలో 166/3తో ఉన్న విండీస్ స్కోరు హెట్‌మైర్ రాకతో రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. అతడు బౌండ్రీలే లక్ష్యంగా ఎడా పెడా భారీ షాట్లకు దిగడంతో.. స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. ఎదుర్కొన్న రెండో బంతికే ఔటైన రస్సెల్ (0) మరోసారి నిరాశ పరిచినా.. కెప్టెన్ హోల్డర్ (15 బంతుల్లో 33; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) స్టేడియాన్ని హోరెత్తించాడు. తొలి బంతినే సిక్సర్‌గా మలిచి తన ఉద్దేశం చాటిన అతడు ఉన్నంత సేపు మెరుపులు మెరిపించడంతో స్కోరు అలవోకగా 350 దాటుతుందనిపించినా.. చివర్లో బంగ్లా బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో హోప్, హోల్డర్‌ను పెవిలియన్ పంపడంతో విండీస్ ఆశించినంత స్కోరు చేయలేకపోయింది.

**ఒకప్పుడు ఒక్క విజయం సాధిస్తే చాలు .. ఊరంతా ఏకమయ్యేలా సంబురాలు చేసుకునే బంగ్లా ఆటగాళ్లు ఈ గెలుపు తర్వాత మాత్రం ఇది మాకు మామూలే అన్నట్లు వ్యవహరించడం కొసమెరుపు.**

## సాహో..

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ప్రపంచకప్‌లో అచ్చమైన బ్యాట్స్‌మెన్ ఒక్క సెంచరీ చేస్తేనే ఆహా, ఓహో అంటున్న తరుణంలో.. నాలుగు మ్యాచ్‌ల్లో ఏకంగా 2 శతకాలు, 2 అర్ధశతకాలు బాదిన ఆల్‌రౌండర్‌ను ఏమనాలి. ఇంకేమంటాం సాహో అనడం తప్ప. పటిష్ఠ జట్టుతో టోర్నీలో అడుగుపెట్టిన దక్షిణాఫ్రికాపై తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయం సాధించడంలో అతడి పాత్ర అమోఘం. బ్యాట్‌తో 75 పరుగులు చేయడమే కాక.. హైస్కోరింగ్ మ్యాచ్‌లో 5 ఎకానమీతో 10ఓవర్లు పూర్తి చేసి మార్క్‌రమ్ వికెట్ తీసి ఔరా అనిపించాడు. ఇక న్యూజిలాండ్‌తో పోరులో సహచరులంతా కాడెత్తేసిన వేళ.. ఒక్కడే జట్టు భారాన్ని భూజాన వేసుకొని 64 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్(4.7 ఎకానమీ)లో 2 వికెట్లు తీశాడు. మిగిలిన వారు కూడా ఓ చేయి వేసుంటే.. ఆ మ్యాచ్‌లో బంగ్లా గెలుపొందేదే. హాట్ ఫేవరెట్ ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లోనైతే కొండంత లక్ష్యం కండ్ల ముందున్నా.. అదరక బెదరక శతకం(121)తో కదం తొక్కాడు. ఈ మ్యాచ్‌లోనూ సహచరుల నుంచి సహకారం కరువవడంతో జట్టు లక్ష్యానికి దూరంలో నిలిచిపోయింది. ఆ తర్వాత లంకతో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైనా.. సోమవారం విండీస్‌తో మ్యాచ్‌లో తనలోని అసలు సిసలు పోరాటయోధుడిని తట్టిలేపిన అతడు.. తొలుత భారీ స్కోరు దిశగా సాగుతున్న విండీస్‌కు 2 వికెట్లు తీసి బ్రేకులు వేశాడు. రికార్డు స్థాయి లక్ష్యఛేదనలో మూల స్తంభంలా నిలిచి అజేయ శతకం (99 బంతుల్లో 124)తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 322 పరుగుల లక్ష్యాన్ని బంగ్లా 41.3 ఓవర్లలో ఛేజ్ చేయడంలో అతడి పోరాటం అనన్య సామాన్యం. లోయర్ ఆర్డర్‌లో భారీ ఇన్నింగ్స్‌లు ఆడేందుకు అవకాశం దక్కడం లేదని జట్టు సభ్యులందరినీ రిక్వెస్ట్ చేసి మూడో స్థానాన్ని సుస్థిరం చేసుకున్న అతడు.. మెగాటోర్నీలో ఆ స్థానానికే వన్నెతెచ్చే ప్రదర్శనతో అలరిస్తున్నాడు. రోహిత్ శర్మ, కోహ్లీ, బెయిర్‌స్టో, జాసన్ రాయ్, వార్నర్, స్మిత్, ఫించ్, గప్టిల్, విలియమ్సన్, డికాక్, డుప్లెసిస్, గేల్ వంటి గొప్ప గొప్ప బ్యాట్స్‌మెన్ ఆడుతున్న ప్రపంచకప్‌లో అత్యధిక పరుగుల జాబితాలో టాప్‌లో ఉన్నది మరెవరో కాదు మనమింత వరకు చెప్పుకున్న బంగ్లా స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసనే. టీమ్ఇండియా 2011 ప్రపంచకప్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించి.. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన యువరాజ్ సింగ్‌ను గుర్తుచేస్తూ చెలరేగిపోతున్న షకీబ్ ఇదే విధంగా రెచ్చిపోతే.. బంగ్లా నుంచి మరిన్ని సంచలన ఫలితాలు ఆశించొచ్చు.

**టోర్నీలో మొత్తం..**
**పరుగులు : 384**
**వికెట్లు: 5**

# సెమీస్‌కు చేరువవ్వాలని..

**ప్రపంచకప్‌లో వరుస పరాజయాలతో డీలా పడి.. పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న ఆఫ్ఘనిస్థాన్‌తో హాట్ ఫేవరెట్ ఇంగ్లండ్ అమీతుమీకి సిద్ధమైంది. పాకిస్థాన్‌ను భారత్ మట్టికరిపించిన ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగే ఈ మ్యాచ్‌లో గెలిచి సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఆతిథ్య జట్టు తహతహలాడుతున్నది. మరోవైపు ఈ పోరులో ఎలాగైనా విజయం సాధించి సంచలనం సృష్టించాలని ఆఫ్ఘన్ పట్టుదలగా ఉంది. మరి అన్ని విభాగాల్లో పటిష్టంగా ఉన్న ఇంగ్లండ్‌కు కాబూలీలు ఎంతవరకు పోటీనిస్తారో చూడాలి.**

### నేడు ఆఫ్ఘన్‌తో ఇంగ్లండ్ పోరు.. మ్యాచ్‌కు రాయ్ దూరం


నైబ్


మోర్గాన్

**మాంచెస్టర్:** ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లండ్.. పదో ర్యాంకు ఆఫ్ఘనిస్థాన్‌తో మంగళవారం తలపడనుంది. టోర్నీలో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లో ఓడి పాయింట్ల పట్టికలో చివరిస్థానంలో ఉన్న ఆఫ్ఘన్‌పై గెలిచి సెమీస్‌కు మరింత చేరువకావాలని భావిస్తున్నది. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించిన మోర్గాన్ సేన.. రెండో పోరులో పాక్ చేతిలో ఖంగుతిన్నది. ఆ తర్వాత పుంజుకొని.. బంగ్లాదేశ్‌పై 106 పరుగులు, వెస్టిండీస్‌పై 8వికెట్ల తేడాతో భారీ విజయాలు నమోదు చేసి గెలుపు బాట పట్టింది. మరోవైపు మెగా టోర్నీలో గెలుపు ముఖం చూడని ఆఫ్ఘన్ ఈ మ్యాచ్‌లోనైనా సత్తాచాటాలనే పట్టుదలగా ఉంది. అయితే ఆ జట్టు ఏ విభాగంలోనూ రాణించలేక ఇబ్బందులు పడుతున్నది. ఆస్ట్రేలియా, శ్రీలంక, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌ల్లో కనీస పోటీ ఇవ్వలేక చతికిలబడింది. మరి ఈ మ్యాచ్‌లో పటిష్ఠ జట్టును ఏ మాత్రం నిలువరిస్తుందో వేచి చూడాలి.

**అన్నింట్లో ఆలౌట్**

బ్యాటింగ్‌లో ఆఫ్ఘనిస్థాన్ దారుణంగా విఫలమవుతున్నది. ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఆ జట్టు ఆలౌటైంది. న్యూజిలాండ్(41.1)పై మినహా ఏ మ్యాచ్‌లోనూ బ్యాట్స్‌మెన్ కనీసం 40 ఓవర్లు కూడా క్రీజులో నిలబడలేకపోయారు. దక్షిణాఫ్రికాతో ఆడిన మ్యాచ్‌లో ఓపెనర్లు హజ్రతుల్లా జజాయ్, నూర్ అలీ కాసేపు నిలబడినా భారీ స్కోరు చేయలేకపోయారు. మిడిలార్డర్ ఘోరంగా విఫలమవుతుండగా.. చివర్లో రషీద్ ఖాన్ బ్యాట్‌తో ఫర్వాలేదనిపిస్తున్నాడు. హష్మతుల్లా షాహిదీ, నజీబుల్లా ఓ మోస్తరు ఫామ్‌లో ఉన్నా.. జట్టును గెలిపించే ప్రదర్శన చేయడం లేదు. అలాగే బ్యాటింగ్‌లో నబీ, కెప్టెన్ గుల్బాదిన్ నైబ్ విఫలమవుతుండడం.. ఓపెనర్ షెహజాద్ టోర్నీకి దూరం కావడం ఆఫ్ఘన్‌కు తలనొప్పిగా మారింది. మరి జోఫ్రా ఆర్చర్, వుడ్, వోక్స్, స్టోక్స్ వంటి నాణ్యమైన పేసర్లున్న ఇంగ్లండ్‌పై ఆఫ్ఘన్ బ్యాట్‌మెన్ ఏ మాత్రం నిలబడతారో!

**ఆల్‌రౌండ్ అదుర్స్**

ఆతిథ్య ఇంగ్లండ్ మాత్రం బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్... ఇలా అన్ని విభాగాల్లో అదరగొడుతున్నది. మొదట బ్యాటింగ్ చేసిన మూడు మ్యాచ్‌ల్లోనూ 300కుపైగా స్కోరు చేసింది. పాక్‌తో మ్యాచ్‌లోనూ 349 పరుగుల లక్ష్య ఛేదనలో రూట్, బట్లర్ శతకాలతో 334 పరుగులు చేయగలిగింది. ఇక బ్యాట్స్‌మెన్ అంతా సమిష్టిగా బాదేయడంతో బంగ్లాపై 386 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనింగ్‌లో అదరగొడుతున్న రాయ్ ఆఫ్ఘన్‌తో మ్యాచ్‌కు దూరమైనా.. బెయిర్‌స్టో, రూట్, బట్లర్, స్టోక్స్ వంటి హిట్టర్లతో కూడిన ఇంగ్లిష్ బ్యాటింగ్ లైనప్ భీకరంగా ఉంది. నబీ, రషీద్, ముజీబ్ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ సమిష్టిగా రాణించలేదు. మరి భీకర ఫామ్‌లో ఉన్న ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌ను వీరు ఏ మేరకు కట్టడి చేయగలరనేది ఆసక్తికరం.

**పిచ్, వాతావరణం:** ఆకాశం మేఘావృతమై ఉన్నా.. వర్షం పడే అవకాశాలు తక్కువే. పిచ్ మొదట్లో పేసర్లకు అనుకూలిస్తుంది. బౌండరీల దూరం, కాస్త టర్న్ లభించే అవకాశం ఉండడం స్పిన్నర్లకు లాభించొచ్చు. ఇదే పిచ్‌పై ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పాక్‌స్థాన్‌పై భారత్ 336 పరుగులు సాధించింది.

### గాయాల దెబ్బ



మెగాటోర్నీలో జోరుమీదున్న ఇంగ్లండ్ ఆటగాళ్లను గాయా లు వేధిస్తున్నాయి. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో వీరవిహారం చేసి 153 పరుగులు బాదిన ఓపెనర్ జాసన్ రాయ్‌తో పాటు కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో గాయపడ్డారు. ఫీల్డింగ్ చేస్తుండగా గాయపడిన రాయ్.. బ్యాటింగ్‌కు కూడా రాలేదు. అతడు బుధవారం మ్యాచ్‌తో పాటు శ్రీలంకతో పోరుకూ అందుబాటులో ఉండడని జట్టు యాజమాన్యం తెలిపింది. అలాగే కెప్టెన్ మోర్గాన్ కూడా ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఆఫ్ఘన్‌తో పోరులో మోర్గాన్ బరిలో దిగుతాడా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

# జొకోనే టాప్

### ఏటీపీ ర్యాంకింగ్స్‌లో నొవాక్ జోరు



**పారిస్:** మట్టికోటలో ఎవరికీ సాధ్యంకాని రీతిలో 12వ సారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచినా.. స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ ర్యాంకింగ్‌లో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. సెమీస్‌లోనే ఇంటి ముఖం పట్టినా.. సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్ తాజా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 12,715 పాయింట్లతో నొవాక్ మొదటి ర్యాంకులో కొనసాగుతుండగా.. నాదల్ (7,945), ఫెదరర్ (6,420) ఆ తర్వాత వరుసగా రెండో, మూడో స్థానాల్లో ఉన్నారు. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో నాదల్ చేతిలో ఓడిన డొమినిక్ థీమ్(4,685) నాలుగో స్థానం దక్కించుకున్నాడు. భారత నెంబర్‌వన్ ప్రగ్నేశ్ గుణేశ్వరన్ 95వ స్థానంలో ఉన్నాడు. మరో రెండు వారాల్లో గ్రాండ్‌స్లామ్ టోర్నీ వింబుల్డన్ ప్రారంభం కానున్నది.

### ఒసాకాదే అగ్రస్థానం



మహిళల విభాగంలో జపాన్ క్రీడాకారిణి నవోమీ ఒసాకా(6,377) అగ్రస్థానంలో ఉండగా.. ఫ్రెంచ్ ఓపెన్ విజేత ఆస్ట్రేలియాకు చెందిన ఆష్లే బార్టీ (6,125) రెండో ర్యాంకులో కొనసాగుతున్నది. చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి ప్లిస్కోవా(5,685) మూడో ప్లేస్‌లో ఉంది.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 38,961 | 11,672 |
| 491 | 151 |

ముడి చమురు (బ్రెంట్) 61.44 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 33,620 |
| 22 క్యారెట్లు | 33,450 |
| వెండి (కిలో) | 38,090 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 6720 | 72.70 |
| యూరో | 75.00 | 83.00 |
| బహ్రెయిన్ దినార్ | 177.10 | 191.10 |
| కువైట్ దినార్ | 221.40 | 236.40 |
| సౌదీ రియాల్ | 17.70 | 19.50 |
| యూఏఈ దిర్హామ్ | 18.10 | 19.70 |

**చికెన్ ధరలు**

| (రూ.లలో) | |
|---|---|
| ఫారం ధర | 140.00 |
| రిటైల్ లైవ్ | 162.00 |
| డ్రెస్డ్ | 235.00 |
| స్కిన్‌లెస్ | 267.00 |

**నెక్ (వంద గుడ్లకు)**

| (రూ.లలో) | |
|---|---|
| హైదరాబాద్ | 395-00 |
| రంగారెడ్డి | 395-00 |
| మెదక్ | 395-00 |
| కరీంనగర్ | 398-00 |
| వరంగల్ | 398-00 |
| రిటైల్ ప్రైస్ | 4-55 |

# భయంతో అమ్మేశారు!

## స్టాక్ మార్కెట్లకు ఇండో-అమెరికా వాణిజ్య యుద్ధం సెగ

### భారీ నష్టాల్లో సూచీలు ■ సెన్సెక్స్ 491, నిఫ్టీ 151 పాయింట్లు పతనం

**ముంబై, జూన్ 17:** భారత్-అమెరికా వాణిజ్య యుద్ధ భయాలు.. సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లను దెబ్బ తీశాయి. ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు, వాణిజ్య ప్రాధాన్య హోదా (జీఎస్పీ) రద్దు వంటి నిర్ణయాల నేపథ్యంలో 28 రకాల అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలను పెంచిన విషయం తెలిసిందే. దీంతో ఈ చర్య అంతర్జాతీయ వాణిజ్య యుద్ధంలో కొత్త పోరుకు దారితీస్తుందన్న ఆందోళనలు మదుపరులను వెంటాడాయి. ఈ క్రమంలోనే సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనైయ్యాయి. ఫలితంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 491.28 పాయింట్లు కోల్పోయి 38,960.79 వద్ద, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 151.15 పాయింట్లు పడిపోయి 11,672.15 వద్ద స్థిరపడ్డాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 38,911.49 పాయింట్ల కనిష్ఠాన్ని, నిఫ్టీ 11,657.75 పాయింట్ల కనిష్ఠాన్ని తాకాయి. అలాగే 39,540.42 పాయింట్ల స్థాయిని సెన్సెక్స్, 11,844.05 పాయింట్ల మార్కును నిఫ్టీ అందుకున్నాయి. గత వారం నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 796.02 పాయింట్లు, నిఫ్టీ 234.05 పాయింట్లు పతనమైన సంగతి విదితమే. మెటల్, ఎనర్జీ రంగాల షేర్లు 3, 2 శాతాలకుపైగా నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలూ 1.35 శాతం మేర కోల్పోయాయి. టాటా స్టీల్ షేర్ విలువ 5 శాతానికిపైగా పడిపోయింది. వేదాంత, టాటా మోటర్స్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్, ఓఎన్‌జీసీ, సన్ ఫార్మా, మారుతి, ఎల్అండ్‌టీ షేర్లు 3.33 శాతం వరకు విలువను చేజార్చుకున్నాయి. ఇక ఆసియా మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించగా, ఐరోపా మార్కెట్లలో ప్రధాన సూచీలు లాభాల్లో ట్రేడ్ అవుతున్నాయి.

**జెట్ షేర్లు ఢమాల్**

జెట్ ఎయిర్‌వేస్ షేర్ల విలువ అంతకంతకూ పడిపోతూనే ఉన్నది. సోమవా రం మరో 18 శాతం పతనమవగా, బీఎస్ఈలో 16.76 శాతం నష్టపోయి రూ.68.30 వద్ద, ఎన్ఎస్ఈలో 18 శాతం క్షీణించి రూ.66.95 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో బీఎస్ఈలో షేర్ విలువ 19.56 శాతం దిగజారి రూ.66ను తాకింది. షేర్ విలువ దారుణంగా నష్టపోతున్న నేపథ్యంలో గత వారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు.. ఈ నెల 28 నుంచి ట్రేడింగ్‌పై ఆంక్షలు తేవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. గడిచిన 11 రోజుల్లో జెట్ ఎయిర్‌వేస్ మార్కెట్ విలువ రూ.937.13 కోట్లు ఆవిరైపోయింది. మే 30 నుంచి ఇప్పటిదాకా షేర్ విలువ 54.72 శాతం కరిగిపోయింది. నాటి విలువ రూ.150.85గా ఉన్నది. రూ.8,500 కోట్ల రుణ భారాన్ని మోస్తున్న జెట్ ఎయిర్‌వేస్.. రెండు నెలల కింద విమానయాన సేవలను నిలిపివేసిన విషయం తెలిసిందే. సంస్థను కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో రుణదాతలు.. దివాలా కోర్టుల్ని ఆశ్రయించాలని చూస్తున్నారు.



**రూ.2 లక్షల కోట్లు హాంఫట్**

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలు.. మదుపరుల సంపదను రూ.2 లక్షల కోట్లకుపైగా మింగేశాయి. సెన్సెక్స్ 491.28 పాయింట్లు క్షీణించడంతో బీఎస్ఈ సంస్థల మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.2,00,258.81 కోట్లు హరించుకుపోయింది. రూ.1,50,09,329.19 కోట్లకు దిగజారింది. 'అమెరికాపై ప్రతీకార సుంకాలు.. సూచీలను కుప్పకూల్చాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధ భయాలను తెచ్చిపెట్టాయి. దీనికి నగదు కొరత తోడైంది' అని బొనాంజా పోర్ట్‌ఫోలియో లిమిటెడ్ టెక్నికల్ రిసెర్చ్ విశ్లేషకుడు జతిన్ త్రివేది అభిప్రాయపడ్డారు. రుతు పవనాల ఆలస్యం, హార్ముజ్ జల సంధిలో చమురు నౌకలపై దాడులు కూడా మదుపరులను ఒకింత భయాందోళనకు గురిచేశాయని అన్నారు.

**ఆగని రూపాయి క్షీణత**



డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ వరుసగా క్షీణిస్తున్నది. గత రెండు రోజుల నష్టాలను కొనసాగిస్తూ సోమవారం కూడా పడిపోయింది. ఫలితంగా గడిచిన మూడు రోజుల్లో 57 పైసలు పతనమవగా, ఈ ఒక్కరోజే 11 పైసలు చేజార్చుకున్నది. ఈ క్రమంలోనే 69.91 వద్ద నిలిచింది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు దిగిరావడం, ప్రధాన దేశాల కరెన్సీలతో డాలర్ విలువ పడిపోవడం.. రూపాయికి కాస్త కలిసొచ్చే అంశమని ఫారెక్స్ నిపుణులు పేర్కొంటున్నారు.

## ఈ ఏడాది వృద్ధి 6.6 శాతమే

### భారత్ జీడీపీ అంచనాను తగ్గించిన ఫిచ్

**న్యూఢిల్లీ, జూన్ 17:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి అంచనాను మరోమారు తగ్గిస్తున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ ప్రకటించింది. తయారీ, వ్యవసాయ రంగాల్లో నెలకొన్న మందకొడి కారణంగా 2019-20లో వృద్ధి 6.6 శాతానికి పరిమితంకానున్నదని తెలిపింది. మార్చి నెలలో ముందస్తు జీడీపీ అంచనాను విడుదల చేసినప్పుడు వృద్ధి 7 శాతం నుంచి 6.8 శాతానికి తగ్గించిన ఫిచ్..ఈసారి మరింత తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్ కంటే ముందు ఫిచ్ వృద్ధి అంచనాల్లో కోత విధించడం విశేషం. 2018-19 ఆర్థిక సంవత్సరం మొత్తానికి వృద్ధి 6.8 శాతానికి పడిపోగా, జనవరి-మార్చి మధ్యకాలంలో జీడీపీ ఐదేండ్ల కనిష్ఠ స్థాయి 5.8 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే. దీంతో వేగవంతమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశంగా చైనా అవతరించింది. ఈ ఏడాది 6.6 శాతంగా వృద్ధిని అంచనావేసిన ఫిచ్..వచ్చే ఏడాదిలో 7.1 శాతంగాను, ఆ మరుసటి ఏడాది 7 శాతంగా నమోదవనున్నదని తాజాగా గ్లోబల్ ఎకనమిక్ అవుట్‌లుక్‌లో పేర్కొంది. రిజర్వు బ్యాంక్ కూడా 7 శాతంగా ఉంటుందని అంచనాను విడుదల చేసింది. ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన వృద్ధిరేటును మళ్లీ పునరుత్తేజం కల్పించాలనే ఉద్దేశంతో ఆర్బీఐ గత సమీక్షలోనూ వడ్డీరేట్లను పావుశాతం తగ్గించింది. ఈ ఏడాది చివరినాటికి మరో పావుశాతం తగ్గించే అవకాశం ఉన్నదని ఫిచ్ పేర్కొంది. వడ్డీరేట్లు తగ్గుతుండటంతో నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల కంపెనీలు మెరుగైన వృద్ధికి బాటలు వేయనున్నట్లు తెలిపింది. మరోవైపు ప్రస్తుత సంవత్సరం చివరినాటికి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 70 స్థాయికి పడిపోవచ్చని ఫిచ్ అంచనావేస్తున్నది. ఇదే క్రమంలో వచ్చే ఏడాది చివరినాటికి 71 స్థాయికి జారుకోనున్నదని తెలిపింది.



**ప్రపంచ వృద్ధి 2.7 శాతం**

ప్రపంచ దేశాల వృద్ధిరేటును సైతం 2.8 శాతం నుంచి 2.7 శాతానికి కుదించింది ఫిచ్. భారత్ పొరుగు దేశమైన చైనా వృద్ధి అంచనాను 6.1 శాతం నుంచి 6 శాతానికి తగ్గించిన ఫిచ్.. అమెరికా వృద్ధిని కూడా 1.9 శాతం నుంచి 1.8 శాతం తగ్గించింది. 2018 లో ప్రపంచ దేశాల వృద్ధి 3.2 శాతంగా నమోదైన విషయం తెలిసిందే.

## ఉద్దేశపూర్వక ఎగవేతదారుడిగా యశ్ బిర్లా

### ప్రకటించిన యూకో బ్యాంక్



**న్యూఢిల్లీ, జూన్ 17:** ప్రభుత్వ రంగ సంస్థ యూకో బ్యాంక్..యశోవర్ధన్ బిర్లాను ఉద్దేశ పూర్వక రుణ ఎగవేతదారుడిగా ప్రకటించింది. యశ్ బిర్లాకు చెందిన బిర్లా సూర్య లిమిటెడ్ బ్యాంక్‌కు రూ.67.55 కోట్ల రుణాల తిరిగి చెల్లింపుల్లో విఫలం కావడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నది. బ్యాంకింగ్ దిగ్గజాలైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ)తో కలిసి యూకో బ్యాంక్..బిర్లా సూర్య లిమిటెడ్‌కు రుణం ఇచ్చాయి. ఈ డిఫాల్టర్ నుంచి తిరిగి రుణాలను వసూలు చేయాలని బ్యాంక్‌కు చెందిన వెబ్‌సైట్‌లో ప్రజా సమాచారం మేరకు పొందుపరిచింది. ఈ సమాచారం ప్రకారం సోలార్ ఫోటోవోల్టాయిక్ సెల్‌లను తయారు చేయడానికి బిర్లా సూర్య లిమిటెడ్ ముంబై లోని నారిమన్ పాయింట్ బ్రాంచ్ నుంచి రూ.100 కోట్ల రుణాన్ని తీసుకున్నది. వీటిని తిరిగి చెల్లింపులు జరుపడంలో విఫలంకావడంతో జూన్ 3, 2013నే నిరర్థక ఆస్తిగా ప్రకటించింది బ్యాంక్. ఆ తర్వాతి క్రమంలో పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ ఎలాంటి చెల్లింపులు జరుపలేదని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. కంపెనీకి చెందిన డైరెక్టర్లు, ప్రమోటర్లు, గ్యారెంటీగా ఉన్నవారు కూడా విల్‌ఫుల్ డిఫాల్టర్‌గా ప్రకటించింది బ్యాంక్. వీరి ఫోటోలతోపాటు పేర్లను ప్రజా సమాచారం మేరకు బ్యాంక్ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఒక్కసారి విల్‌ఫుల్ డిఫాల్టర్‌గా ప్రకటిస్తే..భవిష్యత్తులో ఏ బ్యాంక్, ఆర్థిక సేవల సంస్థల వద్ద రుణం తీసుకోరాదు. కోల్‌కతా కేంద్రస్థానంగా ఆర్థిక సేవలు అందిస్తున్న యూకో బ్యాంక్.. సోమవారం 665 మంది విల్‌ఫుల్ డిఫాల్టర్ల పేర్లను ప్రకటించింది. వీరిలో జూమ్ డెవలపర్లు(రూ.309.50 కోట్లు), ఫస్ట్ లీజింగ్ కంపెనీ ఆఫ్ ఇండియా(రూ.142.94 కోట్లు), మోసర్ బెయిర్ ఇండియా (రూ.122.15 కోట్లు), సూర్య వినాయక ఇండస్ట్రీస్ (రూ.107.81 కోట్లు) ఉన్నాయి.

## డిపాజిట్లపై వడ్డీరేట్ల కోత

### పావుశాతం వరకు తగ్గించిన పలు ప్రైవేట్ బ్యాంకులు

**ముంబై, జూన్ 17:** రుణాలపై వడ్డీరేట్లను తగ్గించని టాప్ ప్రైవేట్ రంగ బ్యాంకులు డిపాజిట్లపై మాత్రం పావు శాతం కోత విధించాయి. సాధారణంగా బ్యాంకులు కీలక వడ్డీరేట్లను తగ్గించిన తర్వాతనే డిపాజిట్లపై వడ్డీరేట్లలో కోత విధిస్తుంటాయి కానీ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు మాత్రం ఇందుకు భిన్నంగా డిపాజిట్లపై వడ్డీరేట్లను తొలుత తగ్గించాయి. బ్యాంకులు తీసుకున్న తాజా నిర్ణయంతో మార్కెట్లో నిధుల లభ్యత అధికమవనున్నది. సోమవారం నుంచి అమలులోకి వచ్చేలా డిపాజిట్లపై వడ్డీరేటును 0.10 శాతం నుంచి 0.25 శాతం వరకు తగ్గిస్తున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ ప్రకటించింది. దీంతో రూ.2 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లపై 290 రోజుల నుంచి ఏడాది కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీని 6.75 శాతంగా చెల్లించనున్నది.

# ఇక ఎగవేతదారులకు చుక్కలే!

### కొత్త మార్గదర్శకాలను విడుదల చేసిన ఐటీ శాఖ ■ జరిమానాలతో పరిష్కారం కాని కేసులు

**న్యూఢిల్లీ, జూన్ 17:** పన్నులు ఎగవేసి.. దొరికితే జరిమానాలు చెల్లించి తప్పించుకోవచ్చులే అనుకుంటే ఇక ఎంతమాత్రం కుదరదు. ఆదాయం పన్ను (ఐటీ) శాఖ కొత్త మార్గదర్శకాలను తెచ్చింది మరి. సవరించిన ఈ నూతన నిబంధనల ప్రకారం తీవ్ర నేరాల కేసుల్లో ఇరుక్కున్నవారికి ఇక ఊరటనేదే లేదు. మనీ లాండరింగ్, ఉగ్రవాదులకు ఆర్థిక సహకారం, అవినీతి, బినామీ ఆస్తుల జప్తు, అప్రకటిత విదేశీ ఆస్తుల కేసులు.. ఐటీ ఎగవేత నేరాల్లో ఊరటనిచ్చే అవకాశాలను మింగేయనున్నాయి. పన్ను డిమాండ్లు, జరిమానాలు, వడ్డీలు చెల్లించి ఐటీ ఎగవేత కేసులను పరిష్కరించుకోలేరు. ఈ మేరకు ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) సోమవారం స్పష్టం చేసింది. సవరించిన మార్గదర్శకాలు అన్ని కేసులకు వర్తిస్తాయని, ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రకటించింది కూడా. కొత్త నిబంధనల వివరాలను అందరికీ తెలియజేయాలని సీనియర్ అధికారులకు సూచనలూ చేసింది.

**మూడు విభాగాలుగా..**

తాజా మార్గదర్శకాలు నేరాలను మూడు విభాగాలుగా వర్గీకరించాయి. టీడీఎస్, టీసీఎస్ కింద ఎగవేతలు, రిటర్నుల దాఖలులో వైఫల్యం మొదటి కేటగిరీలోకి వస్తాయి. రెండో కేటగిరీలో ఉద్దేశపూర్వక పన్ను ఎగవేతలు, పన్ను రికవరీని అడ్డుకునేందుకు ఆస్తులను దాచడం వంటి నేరాలున్నాయి. ఇక మూడో కేటగిరీలో ప్రత్యక్ష పన్ను చట్టాల కింద కోర్టులు అపరాధిగా ప్రకటించడం, బోగస్ ఇన్వాయిస్‌లతో మనీ లాండరింగ్‌కు పాల్పడటం, నల్లధనం, బినామీ లావాదేవీల చట్టం కింద విదేశీ బ్యాంక్ ఖాతాలు, ఆస్తులను ప్రకటించకపోవడం వంటి నేరాలున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, లోక్‌పాల్, లోకాయుక్త ఇతర ఏదైనా కేంద్ర, రాష్ట్ర సంస్థల దర్యాప్తుల్లో ఉన్నవారి పన్ను ఎగవేతలనూ సాధారణంగా తీసుకోవద్దని సీబీడీటీ.. ఐటీ శాఖకు స్పష్టం చేసింది.




## విజయ డెయిరీ 200 మొబైల్ పార్లర్లు

### 400 మంది నిరుద్యోగులకు ఉపాధి



మోడల్ మొబైల్ పార్లర్లను పరిశీలిస్తున్న విజయా డెయిరీ చైర్మన్ భూమారెడ్డి తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించడంతో పాటు వ్యాపారాన్ని విస్తరించాలనే లక్ష్యంతో మొబైల్ పార్లర్‌లను ప్రారంభించడానికి సిద్ధమైంది విజయ డెయిరీ. రాష్ట్ర వ్యాప్తంగా 200 మొబైల్ పార్లర్‌లను ఏర్పాట్లు చేయాలని విజయ డెయిరీ పాలక మండలి సోమవారం నిర్ణయం తీసుకున్నది. వీటిలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలో 100 పార్లర్లను ఏర్పాటు చేయనున్న సంస్థ.. మిగతా 100 మొబైల్ కేంద్రాలను పలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నది. వీటిని ఈ నెల చివరినాటికి గానీ, లేదా వచ్చే నెల మొదటి వారం నాటికి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విజయ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి తెలిపారు. సోమవారం విజయ డెయిరీ కార్యాలయంలో మోడల్ మొబైల్ పార్లర్ల వాహనాలను విజయ డెయిరీ ఎండీ శ్రీనివాస్‌రావు, ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఒక్కొక్క మొబైల్ పార్లర్ వాహనం ఖరీదును రూ.1.80 లక్షలుగా నిర్ణయించింది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే ఈ వాహనం 100 కిలోమీటర్ల వరకు ప్రయాణించనున్నది. ఈ 200 వాహనాలను విజయ డెయిరీ నిధులతో కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు చెప్పారు. వాహనాన్ని అప్పగించిన తర్వాత లబ్ధిదారుడు సబ్సిడీ మినహాయించుకొని వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయం నుంచి నెలకు కొంచెం చొప్పున వాహనం విలువలో 60 శాతం చెల్లించాల్సి ఉంటుందని భూమారెడ్డి వెల్లడించారు. తద్వారా 400 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించనున్నది.

**పది రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక ..**

మొబైల్ పార్లర్‌ల లబ్ధిదారుల ఎంపికను పది రోజుల్లో పూర్తిచేయనున్నట్లు భూమారెడ్డి తెలిపారు. ఇప్పటికే డెయిరీ ఉత్పత్తులను విక్రయిస్తున్న వెండర్స్‌తో పాటు, నిరుద్యోగులను నుంచి రెండు నెలలుగా దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేసి, వాహనాలను అందజేయనున్నట్లు వివరించారు.

## శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్‌కు పిరమల్ గుడ్‌బై

### 10 శాతం వాటా విక్రయంతో రూ.2,305 కోట్ల నిధులు

Piramal Housing Finance

**ముంబై, జూన్ 17:** పిరమల్ గ్రూపు అధినేత అజయ్ పిరమల్..శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్‌లో పెట్టుబడులను పూర్తిస్థాయిలో ఉపసంహరించుకున్నారు. 2013లో 9.96 శాతం వాటాను కొనుగోలు చేయడానికి రూ.1,652 కోట్ల నిధులను వెచ్చించిన అజయ్ పిరమల్..ఈ వాటాను సోమవారం పూర్తిగా విక్రయించడంతో రూ.2,305 కోట్ల నిధులు లభించాయి. అంటే ఆరేండ్లలో పెట్టిన పెట్టుబడి కంటే రూ.653 కోట్లు అధికంగా లభించాయి. ఈ వాటాను థర్డ్-పార్టీ పెట్టుబడుదారులకు విక్రయించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం అందించింది. మార్చి 2019 చివరి నాటికి పిరమల్ ఎంటర్‌ప్రైజెస్‌లో 2.26 కోట్ల విలువైన షేర్లు లేదా 9.96 శాతంవాటాను కలిగివున్నది. గడిచిన ఆరేండ్లలో 40 శాతం అధిక రిటర్నులు పంచినట్లు తెలుస్తున్నది. అలాగే శ్రీరామ్ సిటీ యూనియన్‌లో పిరమల్ గ్రూపునకు10 శాతం వాటా ఉండగా, శ్రీరామ్ క్యాపిటల్‌లో 20 శాతం వాటా ఉన్నది. నాలుగేండ్ల క్రితం రూ.4,600 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేసిన పిరమల్ గ్రూపు..ప్రస్తుతం ఇది రూ.9 వేల కోట్లకు చేరుకున్నది. గతంలో వొడాఫోన్‌లో పెట్టుబడులు పెట్టిన పిరమల్‌కు అత్యధిక రిటర్నులు పంచింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే. గడిచిన పదేండ్ల కాలంలో పిరమల్ గ్రూపు.. 20 కంపెనీలను కొనుగోళ్లు చేయగా, అంతర్జాతీయ సంస్థలైన మెర్క్, ఎలి లిల్లీ, ఫైజర్, అబాట్, బయో-సైంటెక్, బేయర్‌లు ఉన్నాయి. ప్రస్తుతం పిరమల్ ఎంటర్‌ప్రైజెస్..ఫార్మా, ఆర్థిక సేవలు, హెల్త్‌కేర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో సేవలు అందిస్తున్నది. అజయ్ పిరమల్ శ్రీరామ్ గ్రూపు చైర్మన్‌గా ఉన్న ఏప్రిల్ 2014 సమయంలో శ్రీరామ్ క్యాపిటల్‌లో 20 శాతం వాటాను కొనుగోలు చేయడానికి రూ.2,014 కోట్ల నిధులు వెచ్చించారు. ఆ తర్వాతి రెండు నెలల్లోనే శ్రీరామ్ సిటీ యూనియన్‌లో మరో 10 శాతం వాటాను చేజిక్కించుకున్నారు. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ షేరు ధర 3.55 శాతం తగ్గి రూ.1,995కి పడిపోగా, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ 6.15 శాతం పతనం చెంది రూ.1,015 వద్ద ముగిసింది.

## జోరందుకున్న ఉద్యోగ కల్పన

### గత నెలలో 11 శాతం వృద్ధి




**న్యూఢిల్లీ, జూన్ 17:** ఉద్యోగ కల్పన మళ్లీ జోరందుకున్నది. గడిచిన కొన్ని నెలలుగా స్తబ్దుగా ఉన్న ఉద్యోగ అవకాశాలు గత నెలలో 11 శాతం చొప్పున పెరుగుదల నమోదైందని ఓ సర్వే వెల్లడించింది. ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల అత్యధిక మందికి ఉపాధి లభించినట్లు నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్ తెలిపింది. నిరుద్యోగులకు అన్ని రంగాల్లోనూ అవకాశాలు లభించాయని, గడిచిన ఆరు నెలలుగా ఆశావాదంగా ఉన్న వృద్ధి భవిష్యత్తులోనూ కొనసాగనున్నదని ఇన్ఫోఎడ్జ్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ అధికారి సుమీత్ సింగ్ పేర్కొన్నారు. ఐటీ-సాఫ్ట్‌వేర్‌తోపాటు బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్(బీపీవో)లో 11 శాతం పెరుగుదల కనిపించగా, విద్యలో 11 శాతం, ఐటీ-హార్డ్‌వేర్‌లో 11 శాతం, నిర్మాణ అండ్ ఇంజినీరింగ్‌లో 10 శాతం, ఫాస్ట్-మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్(ఎఫ్ఎంసీజీ)ల్లో నాలుగు శాతం అధికమైంది. కానీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ సర్వీసెస్(బీఎఫ్ఎస్ఐ) నిలకడైన వృద్ధిని నమోదు చేసుకోగా, ఆటోమొబైల్ రంగం 16 శాతం పడిపోగా, ఫార్మాస్యూటికల్స్‌లో 6 శాతం తగ్గాయి. మూడేండ్లలోపు అనుభవం కలిగిన ఉద్యోగులకు డిమాండ్ అధికంగా ఉన్నదని, ఈ రంగ వృద్ధి 13 శాతమని నౌకరీ.కామ్ తెలిపింది. నైపుణ్యం కలిగిన వారికి బెంగళూరు, హైదరాబాద్, పుణెలలో నియామక కార్యాచరణ ఆశావాదంగా ఉన్నదని పేర్కొంది.

# జెట్ ఎయిర్‌వేస్ దివాలా

### బకాయిల వసూలుకు ఎన్‌సీఎల్‌టీ వద్దకు బ్యాంకర్లు

**ముంబై, జూన్ 17:** జెట్ ఎయిర్‌వేస్ దివాలా తీసింది. సంస్థ రుణ దాతలు తమ బకాయిల వసూలుకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ను ఆశ్రయించారు. ఒకప్పుడు దేశీయ విమానయాన రంగంలో ఓ వెలుగు వెలిగిన ఈ ప్రైవేట్ రంగ దిగ్గజం.. ఇప్పుడు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన విషయం తెలిసిందే. రూ.8,500 కోట్లకుపైగా రుణ భారాన్ని మోస్తున్న జెట్.. సరిగ్గా రెండు నెలల కింద విమాన సేవలకు గుడ్‌బై చెప్పిన సంగతీ విదితమే. ఏప్రిల్ 17న జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో సంస్థకు రుణాలిచ్చిన బ్యాంకర్లు.. తమ బకాయిల వసూలుకు దివాలా కోర్టు గడప తొక్కారు. సోమవారం ఇక్కడ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నేతృత్వంలో సమావేశమైన 26 మంది రుణ దాతలు.. దివాలా చట్టం (ఐబీసీ) కిందకు జెట్ ఎయిర్‌వేస్‌ను తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. జెట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలున్నవారు.. కొన్ని సెబీ మినహాయింపులను కోరుతున్నారని, దీంతోనే ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించాల్సి వచ్చిందంటూ దివాలా చట్టాల కింద మరింత న్యాయం చేకూరగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

**బ్యాంకర్ల వెనుకడుగు**

జెట్ ఎయిర్‌వేస్‌ను రక్షించే బాధ్యతను తలకెత్తుకున్న బ్యాంకర్లు.. చివరకు వెనుకడుగేశారు. సంస్థ బోర్డు నుంచి నరేశ్ గోయల్, ఆయన భార్యను తప్పించి నాయకత్వాన్ని చేపట్టిన రుణదాతలు.. ఉద్యోగులకు కొత్త ఊపిరిలేఊదారు. అయితే తాము తీసుకున్న బాధ్యత అంత సులువైనదేమీ కాదని రోజులు గడుస్తున్నకొద్దీ అర్థం చేసుకున్న బ్యాంకర్లు.. నెమ్మదిగా పక్కకు జరుగుతూ వచ్చారు. ఈ క్రమంలో సంస్థ నిర్వహణ కోసం చేస్తామన్న సాయాన్నీ ఇచ్చే ధైర్యం చేయలేకపోయారు. 25 ఏండ్ల కింద నరేశ్ గోయల్ స్థాపించిన జెట్ ఎయిర్‌వేస్.. ఒకానొక దశలో గరిష్ఠంగా 120 విమానాలను నడిపింది.

**కలలు కల్లలే**

గడిచిన రెండు నెలల్లో జెట్ ఎయిర్‌వేస్ ఉదంతంలో ఎన్నెన్నో సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఒకసారి సంస్థకు ఢోకా లేదని అనిపించినా.. ఆ కాసేపటికే జెట్ పనైపోయిందనిపించింది. వీటన్నిటి మధ్య వేలాది జెట్ ఉద్యోగులు నిత్యం నరకయాతననే అనుభవించారు. ఒక్కసారిగా ఆకాశం నుంచి పాతాళంలోకి పడిపోయిన వీరందరి కలలు కల్లలే అయ్యాయి. కొందరు అందివచ్చిన అవకాశాలతో వెళ్లిపోతే.. మరికొందరు సంస్థ పునరుద్ధరణపై నమ్మకంతో ఉండిపోయారు. నిజానికి ఎతిహాద్, హిందుజాల కూటమితోపాటు మరికొందరి మదుపరుల ఆసక్తి.. ఉద్యోగుల్లో ఆశలను చిగురింపజేసింది. అయితే ఈ ఆనందం ఎంతోసేపు నిలువలేదు. మొత్తానికి బ్యాంకర్ల తాజా ప్రకటనతో జెట్.. ఎన్‌సీఎల్‌టీలో ల్యాండైంది.




## తమిళ ఐటీ సంస్థలకు నీటి కష్టాలు

**చెన్నై, జూన్ 17:** తమిళనాడులో గడిచిన కొన్నేండ్లుగా ఎప్పుడూ లేనంతగా ఏర్పడిన నీటి కొరత.. అక్కడి ఐటీ సంస్థలనూ వేధిస్తున్నది. నీటి కష్టాలను తట్టుకోలేక.. ఉద్యోగులను ఇంటి దగ్గర్నుంచే పని చేయాలని ఐటీ సంస్థలు కోరుతున్నాయి. దీంతో ఆఫీసుల్లో టాయిలెట్ల వినియోగం తగ్గుతుందని భావిస్తున్నాయి. ఇప్పటికే వివిధ ఐటీ కంపెనీలు.. తమ చెన్నై మేనేజ్‌మెంట్లకు ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలూ ఇచ్చేశాయి. పాత మహాబలిపురం రోడ్డులోని ఐటీ కారిడార్‌లోగల కంపెనీలు, సిరుసెరి ఐటీ పార్క్‌లోని సంస్థలు.. ఉద్యోగుల్ని ఇంటి నుంచే పనిచేయాలని కోరినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మరి కొందరికి రోజు విడిచి రోజు ఆఫీసులకు రావాలని సూచిస్తున్నట్లు పీటీఐ వద్ద సదరు వర్గాలు పేర్కొన్నాయి. రోజువారి కార్యకలాపాల నిమిత్తం ఉద్యోగుల నీటి అవసరాల కోసం ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తున్నదని చెప్పాయి.

## సినీనటుడు శర్వానంద్
# భుజానికి శస్త్రచికిత్స

- 11 గంటల పాటు కొనసాగిన చికిత్స
- రెండు నెలలు షూటింగ్‌కు దూరం



**బేగంపేట:** సినిమా షూటింగ్‌లో కొన్ని సన్నివేశాల కోసం తర్ఫీదు పొందుతూ గాయపడిన సినీనటుడు శర్వానంద్‌కు సోమవారం సికింద్రాబాద్‌లోని సన్‌షైన్ దవాఖానలో శస్త్రచికిత్స నిర్వహించారు. బ్యాంకాక్‌లో గాయపడిన ఆయనను ఆదివారం తెల్లవారుజామున దవాఖానలో చేర్పించారు. శర్వానంద్ భుజం జారిపోవడంతో డాక్టర్ గురువారెడ్డి నేతృత్వంలోని వైద్యుల బృందం శస్త్రచికిత్స చేసి సరిచేశారు. గాయం పెద్దది కావడంతో దాదాపు 11 గంటల పాటు శ్రమించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్న ఆయనను మంగళవారం గదికి తరలిస్తామని, రెండు నెలలపాలు విశ్రాంతి అవసరమని పేర్కొన్నారు. '96' సినిమా షూటింగ్‌లో భాగంగా స్కై డైవింగ్‌కు సంబంధించిన సన్నివేశాల కోసం శర్వానంద్ థాయిలాండ్‌లో శిక్షణ పొందుతున్నారు. ఈ సమయంలో ప్రమాదవశాత్తూ గాయపడ్డాడు. ఆయన భుజానికి, కాలికి గాయాలయ్యాయి.

## కోలుకున్న అక్బరుద్దీన్ ఒవైసీ

- 21న హైదరాబాద్‌కు రాక
- ఎంఐఎం వర్గాల వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తీవ్ర అస్వస్థతతో కొన్ని రోజులుగా లండన్‌లోని ఓ కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఎంఐఎం శాసనసభపక్ష నాయకుడు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పూర్తిగా కోలుకున్నారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆయన దవాఖాన నుంచి డిశ్చార్జి అయ్యారని తెలిపాయి. ఈ నెల 21న అక్బరుద్దీన్ హైదరాబాద్‌కు చేరుకుంటారని ఎంఐఎం పార్టీ నాయకులు చెప్పారు. 2011లో అక్బరుద్దీన్‌పై కొందరు కత్తులతో దాడిచేసి కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఆయన పెద్దపేగుకు తీవ్ర గాయమైంది. ఒక బుల్లెట్ కిడ్నీల వద్ద ఉండిపోయింది. పెద్దపేగు గాయం తరుచూ వేధిస్తుండటంతో ఆయనను మెరుగైన వైద్యం కోసం లండన్‌లోని ఓ దవాఖానకు తరలించి చికిత్సనందించారు. కాగా ప్రస్తుతం ఆయన కోలుకున్నారని.. హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని పార్టీలో సీనియర్ నాయకుడొకరు వెల్లడించారు.

## జర్నలిస్టులకు ఆర్థికసాయం

- జూన్ 24 వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం
- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థికసాయం పొందేందుకు అర్హులైన జర్నలిస్టులు, వారి కుటుంబాలు ఈ నెల 24 వరకు దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ఒక ప్రకటనలో సూచించారు. 2014 జూన్ 2వ తేదీ తర్వాత మరణించిన జర్నలిస్టుల కుటుంబాలు, జర్నలిస్టు వృత్తిలో ఉంటూ అనారోగ్యం బారిన పడి, పనిచేయలేని స్థితిలోఉన్న జర్నలిస్టులు ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో జర్నలిస్టు సంక్షేమ నిధి నుంచి లబ్ధిపొందినవారు, ఇప్పటికే దరఖాస్తులు పంపినవారు మళ్లీ చేసుకోకూడదన్నారు. డీపీఆర్వోలు, పౌరసంబంధాలశాఖ ఉపసంచాలకుడు, సహాయ సంచాలకుడు ధ్రువీకరించిన దరఖాస్తులనే మీడియా అకాడమీకి పంపాలని పేర్కొన్నారు. జర్నలిస్టు సంక్షేమ నిధి నుంచి ఇప్పటివరకు 208 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున, అనారోగ్యానికి గురైన 72 మందికి రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందించామన్నారు. దరఖాస్తులను కార్యదర్శి, తెలంగాణ మీడియా అకాడమీ, ఇంటి నంబర్ 10-2-1, సమాచారభవన్ 2వ అంతస్తు, ఏసీ గార్డ్స్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్‌కు పంపించాలని అల్లం నారాయణ సూచించారు. మరిన్ని వివరాల కోసం 040-23298672, 23298674 ఫోన్ నంబర్లో సంప్రదించాలన్నారు.

## వేసవి దెబ్బకు బీర్లు ఖాళీ

- ఎండవేడిమితో రికార్డుస్థాయిలో బీర్ల అమ్మకాలు
- మే నెలలో 61 లక్షల కేసులు విక్రయం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ ఏడాది ఎండాకాలం మండిపోయింది. ముఖ్యంగా మే మాసంలో వీచిన వడగాలులతో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు మించి నమోదయ్యాయి. నైరుతి రుతుపవనాల రాక కూడా ఆలస్యం కావడంతో ఇప్పటికీ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. ఈ ఎండ వేడిమిని తట్టుకునేందుకు ప్రజలు పెద్దఎత్తున బీర్లు తాగినట్టు తెలుస్తున్నది. దీంతో రాష్ట్రంలో బీర్లు లక్షల కేసులు ఖాళీ అయ్యాయి. ఈ వేసవిలో పెద్దఎత్తున బీర్ల అమ్మకాలు జరిగినట్లు తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ గణాంకాలు చెప్తున్నాయి. వేసవి తీవ్రత అధికంగా ఉన్న మే నెలలో గతంలో ఎన్నడూ లేనంతగా 61 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. ఏప్రిల్‌లో 53 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరుగగా.. గతేడాది మే లో 57 లక్షలు అమ్ముడయ్యాయి. ఒక్కసారిగా బీర్ల అమ్మకాలు పెరుగడంతో అక్కడక్కడా కొరత ఏర్పడిందని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డీ వెంకటేశ్వరావు వెల్లడించారు. ముఖ్యంగా బ్రాండెడ్ బీర్ల అందుబాటులో కొరత ఎక్కువైందని చెప్పారు.





సికింద్రాబాద్‌కు చెందిన ఉప్ప మనోహర్-రేణుక దంపతులు సోమవారం రూ.11 లక్షల విలువ చేసే 336 గ్రాముల బంగారంతో తయారు చేసిన దశావతారాల హారాన్ని యాదాద్రి నర్సింహస్వామికి బహూకరించి మొక్కు చెల్లించుకున్నారు. ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు సంప్రోక్షణ పూజలు నిర్వహించి శ్రీవారికి సమర్పించారు.
- యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ



వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో రద్దీగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. దాదాపు 30 వేల మంది దర్శించుకోగా, రూ.24 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు.
-వేములవాడ కల్చరల్

# తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాలు

- పురస్కార గ్రహీతల్లో 'నమస్తే తెలంగాణ' న్యూస్ ఎడిటర్ కోవెల సంతోష్‌కుమార్
- జూన్ చివరలో పురస్కారాల ప్రదానం
- ఒక్కొక్కరికి రూ.20,116 నగదు అందజేత

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలుగు సాహిత్యంలోని పలు ప్రక్రియల్లో వెలువడిన ఉత్తమ గ్రంథాలకు తెలుగు విశ్వవిద్యాలయం 2017 సంవత్సరానికిగాను సాహితీ పురస్కారాలను ప్రకటించింది. ఈ పురస్కారాలకు ఎంపికైనవారిలో 'నమస్తే తెలంగాణ' న్యూస్ ఎడిటర్ కోవెల సంతోష్‌కుమార్, ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్రతోపాటు పలువురు రచయితలు ఉన్నారు. పద్యకవితా ప్రక్రియలో మాల్యశ్రీ (చింతూరి మల్లయ్య) రచించిన పద్యకృతి 'మన్యభారతం', వచనకవిత్వంలో నారాయణస్వామి రచించిన 'వానొస్తద?' గేయ కవితా ప్రక్రియలో తుమ్మూరి రామ్మోహన్‌రావు రచించిన 'ఎలకోయిల పాట' సాహితీ పురస్కారాలకు ఎంపికయ్యాయి. బాల సాహిత్యంలో కొల్లూరు స్వరాజ్యం వెంకటరమణమ్మ రచించిన 'అనగ అనగా పిల్లల కథలు', కథానిక ప్రక్రియలో బీ మురళీధర్ రచించిన 'నెమలినార' కథా సంపుటి, నవలా ప్రక్రియలో భూతం ముత్యాలు రచించిన 'మొగలి' నవల, సాహిత్య విమర్శలో అట్లా వెంకటరామిరెడ్డి రచించిన 'సప్తసౌరభాలు', అనువాదంలో మెహక్ హైదరాబాదీ రచించిన 'గుప్పిట జారే ఇసుక'కు పురస్కారాలు దక్కాయి. ఇతర వచన రచనల విభాగంలో కోవెల సంతోష్‌కుమార్ రచించిన 'దేవ రహస్యం', రచయిత్రి ఉత్తమ గ్రంథం విభాగంలో జూపాక సుభద్ర రచించిన 'రాయక్క మాన్యం' గ్రంథాలు సాహితీ పురస్కారం పొందాయని తెలుగువర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ వివరించారు. జూన్ నెలాఖరులో పురస్కారాలు ప్రదానం చేస్తామని, పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.20,116 నగదుతోపాటు సత్కరిస్తామని చెప్పారు. 2014, 2015, 2016 సంవత్సరాల్లో వెలువడ్డ పుస్తకాలను సేకరించి న్యాయనిర్ణేతలతో వాటిని చదివింపజేసి వివిధ దశల్లో పురస్కారాల ఎంపిక కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు.

**దేవరహస్యం వినూత్న ప్రయోగం**

తెలుగు వచన రచన చరిత్రలో దేవరహస్యం పుస్తకం ఓ వినూత్న ప్రయోగం. తెలుగులో ఇంతవరకూ ఇలాంటి పుస్తకం రాలేదు. పౌరాణిక, చారిత్రక, ధార్మిక రహస్యాలను లోతుల్లోకి వెళ్లి శోధించి, సాధారణ పాఠకులకు సైతం తేలికగా అర్థమయ్యేలా వివరించడంలో రచయిత సంతోష్‌కుమార్ తన ప్రతిభను, సృజనాత్మకతను ప్రదర్శించారు. అత్యంత ఆసక్తికరంగా, సరళమైన భాషలో సాగే దేవరహస్యం.. ఒక వైపు ఉత్సుకతను కలిగిస్తూ, మరోవైపు ఆలోచనలను రేకెత్తిస్తుంది. ఇటీవల కాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన రచనల్లో ఈ గ్రంథం అగ్రస్థానంలో నిలిచింది. 2014లో తొలిసారి వెలువడిన ఈ పుస్తకం ఇప్పటికే మూడుసార్లు రీప్రింట్‌కు వెళ్లడం పాఠక జనాదరణకు నిదర్శనం. దేవ రహస్యం పుస్తక రచయిత కోవెల సంతోష్‌కుమార్ సుప్రసిద్ధ రచయిత కోవెల సుప్రసన్నాచార్య కుమారుడు.




## కవ్వాల్‌లో ప్రత్యామ్నాయ
# అడవుల పెంపకం

- పెద్దపులుల కోసం సురక్షిత కారిడార్.. నిర్వాసితులకు వాంకిడిలో పునరావాసం
- వానకాలంలో పెద్దపులుల అభయారణ్యాల్లోకి ప్రవేశం బంద్




**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పెద్దపులులకు సురక్షితమైన కారిడార్లను ఏర్పాటుచేయడానికి మార్గం సుగమమవుతున్నది. కాగజ్‌నగర్, కవ్వాల్‌లో దట్టమైన అడవిని పెంచడం ద్వారా పెద్దపులుల రక్షణకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద ప్రత్యామ్నాయ అడవుల పెంపకం కోసం కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యం పరిధిలోని టైగర్ కారిడార్‌ను ఎంచుకున్నారు. 144 హెక్టార్లలో.. కాగజ్‌నగర్, కవ్వాల్ కారిడార్‌లో క్షీణించిన అడవుల పునరుద్ధరణ కార్యక్రమం యుద్ధప్రాతిపదికన జరుగుతున్నది. ఈ క్రమంలో కోలంగొండి ప్రాంతంలో తాత్కాలిక నివాసమేర్పరచుకున్న కొందరిని ఇతర ప్రాంతాలకు తరలించారు. వారిని అడవిలోకి అనుమతించకుండా వారి స్వగ్రామం వాంకిడిలో పునరావాసం కల్పించాలని కోర్టు సూచించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు టైగర్ కారిడార్‌లో స్మగ్లర్ల ఆగడాలు ఆటకట్టించి, దట్టమైన అడవుల సృష్టికిగాను కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పనులు వేగంగా జరుగుతున్నాయి. కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్ కోర్ ఏరియాకు వచ్చే మార్గంలో అటవీభూములను రక్షించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి ఆదిలాబాద్ కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యం వరకు టైగర్ కారిడార్ల కోసం అటవీశాఖ అధికారులు రూపొందించిన ప్రణాళికకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ పచ్చజెండా ఊపింది. టైగర్ కన్జర్వేషన్ ప్లాన్ ప్రకారం కారిడార్ ఏర్పాటుకు అనుమతి లభించింది. కవ్వాల్ అభయారణ్యంలోకి మహారాష్ట్రలోని తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి ప్రాంతం నుంచి పులులు వలస వస్తున్నాయి. మార్గమధ్యలో అనువైన అటవీప్రాంతం లేక ఇబ్బందిగా మారిందని అధికారులు గుర్తించారు. తడోబా, ఇంద్రావతికి మధ్యన రిజర్వ్ ఫారెస్టులుండటం, అవి చాలావరకు ఆక్రమణకు గురికావడంతో పులుల మనుగడకు ముప్పు ఉన్నదని భావించిన అధికారులు గతంలోనే రెండు రాష్ట్రాల అటవీ అధికారులతో చర్చలు జరిపారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య అడవులను దట్టంగా పెంచి పులులు, అడవుల రక్షణకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయాలని గతంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ సూచించింది. తడోబా అంధేరి టైగర్ రిజర్వ్‌ను, ఇంద్రావతి పులుల అభయారణ్యాన్ని కలుపుతూ దాదాపు 120 కిలోమీటర్ల పొడవునా కారిడార్‌ను ఏర్పాటు చేయాలని అటవీశాఖ ఇటీవల ప్రణాళిక సిద్ధంచేసింది. తడోబా టైగర్ రిజర్వ్ నుంచి కొన్ని పెద్దపులులు వలస వచ్చి కాగజ్‌నగర్, మంచిర్యాల, సిర్పూర్ అటవీప్రాంతాలలో మకాం వేస్తున్నాయి.

### పెద్దపులుల అభయారణ్యంలోకి నో ఎంట్రీ

**అచ్చంపేట,** అమ్రాబాద్, కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యంలోకి సందర్శకులను, పర్యాటకులను అనుమతించవద్దని అధికారులు నిర్ణయించారు. జూలై 1నుంచి అక్టోబర్1వ తేదీ వరకు ఆంక్షలు కొనసాగుతాయి. ఈ మధ్యకాలంలో ఎకో-టూరిజం పేరిట సందర్శకులను అడవిలోకి తీసుకొపోయే సౌకర్యం ఉండదు. వానకాలంలో అడవిలో వాహనాలు, మనుషులు తిరుగడానికి అనువుగా లేకపోవడం, దానికితోడు పులులు, ఇతర జంతువులు జతకట్టే సమయం కావడంతో పులుల అభయారణ్యాలలోకి సామాన్యులు ప్రవేశించకుండా ప్రతి ఏటా జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రస్తుతం అమ్రాబాద్ టైగర్‌రిజర్వ్‌లో 17 పెద్దపులులు, కవ్వాల్ టైగర్‌రిజర్వ్‌లో నాలుగు పెద్దపులులు సంచరిస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు.

## విద్యుదాఘాతంతో ఇద్దరు రియల్టర్ల మృతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కడప జిల్లా పులివెందుల సమీపంలోని వెంకటాపురం గ్రామం వద్ద విద్యుద్ఘాతంతో ఇద్దరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మృతిచెందారు. లింగాల మండలానికి చెందిన పీ ప్రతాప్ రెడ్డి (39), వేముల మండలానికి చెందిన కే గోవర్ధన్‌రెడ్డి బైక్‌పై వెళ్తుండగా.. హైటెన్షన్ వైర్ తగలి అక్కడికక్కడే మృతిచెందారు.




నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 18 జూన్ 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi

# లిచీ పండ్లు ప్రమాదకరమా?

**ఈ మధ్య లిచీ పండ్లు తిని బీహార్‌లో 53 మంది చిన్నారులు చనిపోయారని సామాజిక మాధ్యమాల్లో ఓ సందేశం వైరల్ అవుతున్నది. స్ట్రాబెర్రీ రూపంలో ఉండే లిచీ పండ్లు తింటే చనిపోతారా? ఎప్పుడు తినాలి. అనే విషయం తెలుసుకుందాం.**



- లిచీ పండ్లను పరిగడుపున తినకూడదు. పచ్చిగా ఉండే లిచీ పండ్లు మరింత హానికరం. రాత్రులు నిద్రపోయే ముందు, ఉదయం పూట ఈ పండ్లను అస్సలు తినకూడదు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఈ పండ్లకు దూరంగా ఉండడమే మంచిది.
- లిచీ పండ్లలో ఉండే విషతుల్య పదార్థం మెదడు వాపు వ్యాధికి దారితీస్తుంది. లిచీ పండ్లు పరిగడుపున తినడం వల్ల ఇందులో ఉండే మిథెలిన్ సైక్లోప్రొపిల్- గ్లైసిన్ (MCPG) రసాయనంతో రక్తంలో చక్కెర శాతం ప్రమాదకర స్థాయికి తగ్గుతుంది. దీనివల్ల అనారోగ్యం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- లిచి పండ్ల గింజలు విషతుల్యం. ఇవి తినడం వల్ల శరీరంలో హైపోగ్లైసెమిక్ ఏర్పడి షుగర్ స్థాయిలు పడిపోతాయి. పండినవైనా, పచ్చివైనా ఇవి ఆరోగ్యానికి హానికరమే.
- ఈ పండ్లలో బ్యాక్టీరియా పేరుకుపోయి ఉంటుంది. ఒకవేళ తినాలనుకుంటే మధ్యాహ్నం పూట మాత్రమే తినాలి. అవి కూడా గోరువెచ్చని నీటిలో కడిగి మాత్రమే తినాలని వైద్యులు చెబుతున్నారు.
- ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ఇవి తినొద్దు. తేమ 65 నుంచి 80 శాతం వరకు ఉన్న సమయంలో ఈ పండ్లు తింటే మెదడువాపు వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

అది కరీంనగర్ మున్సిపాలిటీ.. నెల రోజుల కిందట మున్సిపాలిటీలో పనిచేసే కిందిస్థాయి సిబ్బందిలో ఒకాయన చనిపోయాడు. అతనిది నిరుపేద కుటుంబం. ఇన్నాళ్లూ అతని సంపాదనతోనే ఇల్లు గడిచింది. తెలిసిన వారు, బంధుమిత్రులు అతన్ని కడసారి చూడ్డానికి వచ్చారు. అందరిలాగే ఈ సర్దార్ కూడా అతనికోసం వచ్చాడు. ఎర్రటి తలపాగ, నెరిసిన గడ్డంతో ఉన్నాడు. పేరుకు కరీంనగర్ మేయర్ అయినా.. ఆ దర్పం ఎక్కడా లేదు. సామాన్యుల్లో సామాన్యుడతను. మృతుని ఇల్లు, పరిసరాలు చూశాడు. తినడానికి తప్ప.. వారికి ఏమీ లేదని అర్థమైంది అతనికి. వెంటనే రూ.5వేలు ఇచ్చి దహన సంస్కారాలు చూడమన్నాడు. కారు ఆఫీసు వైపు వెళ్తున్నా.. అతని ఆలోచనలు మాత్రం ఆ పేదల వాడలోనే ఉన్నాయి. 'కోరి తెచ్చుకున్న తెలంగాణలో మేయర్‌గా తాను ఉండి.. పేదలకు సాయం చెయ్యలేమా?' అంటూ తనని తానే ప్రశ్నించుకున్నాడు. అప్పుడే ఓ మహత్తర నిర్ణయం తీసుకున్నాడు. ఆ మరుసటి రోజే కరీంనగర్ మున్సిపాలిటీ పేరు దేశ వ్యాప్తంగా మారుమోగింది. కారణం.. 'ఒక్క రూపాయికే అంత్యక్రియలు' నిర్వహించడం. ఇది సాధ్యమేనా? అంటూ ఎందరో విమర్శిస్తే.. తెలంగాణ రథసారథి ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెన్నుతట్టి ప్రోత్సహించారు. మంచి పనులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అభినందించారు. రెట్టింపు ఉత్సాహంతో మొన్నటి ఆదివారమే ఒక్కరూపాయికి అంత్యక్రియలు నిర్వహించి.. కరీంనగర్ కార్పొరేషన్‌ను ఆదర్శంగా నిలిపాడు ఈ సర్దార్ మేయర్. విప్లవాత్మక మార్పుతో నూతన అధ్యాయానికి నాంది పలికాడు.

**'స్వతంత్ర దేశంలో చావు కూడా పెండ్లిలాంటిదే బ్రదరూ' అంటూ మనిషి చనిపోయిన తర్వాత జరిగే ఖర్చు గురించి ఓ కవి ఆనాడే వ్యంగ్యంగా స్పందించాడు. కారణం.. అంత్యక్రియలు కూడా చాలా ఖర్చుతో కూడుకున్నవి కాబట్టి. ధనికులైతే పర్వాలేదు. పేదింట్లో పీనుగెల్లితే అప్పులు.. అవి తీర్చలేక ఎన్నో తిప్పలు పడాల్సిందే. చనిపోయిన దగ్గర్నుంచి దహనక్రియలు, కర్మకాండల వరకూ వేల రూపాయలు ధారపోస్తూనే ఉండాలి. ఇవన్నీ కళ్లారా చూసాడు ఈ సర్దార్. జనం మెచ్చిన ఆలోచన చేశాడు. కేవలం ఒక్క రూపాయికే అంత్యక్రియలు ప్రారంభించాడు. జనమందరితో శెభాష్ అని పించుకుంటున్నాడు.**



# ఈ సర్దార్.. ఓ సంచలనం

### రూపాయి చెల్లిస్తే చాలు

ఒక వ్యక్తి చనిపోతే చావు డప్పులు, పూలు, ఇతర సామగ్రి.. మొదలుకొని మధ్య తరగతి వర్గాలైతే దాదాపు రూ. 10 నుంచి రూ. 15 వేలు, పేద వర్గాలైతే రూ. 7 నుంచి రూ. 10 వేలు ఖర్చు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పేద, మధ్య, ధనిక వర్గాలు అనే భేదం లేకుండా కరీంనగర్ కార్పొరేషన్‌లో మాత్రం రూపాయి చెల్లిస్తే అంత్యక్రియలన్నీ జరిగిపోతున్నాయి. ఆ రూపాయి కూడా రశీదు తీసుకోవడానికే. ప్రస్తుతం పేద, మధ్య తరగతి వర్గాలకు ఈ పథకాన్ని వర్తింపజేశారు మేయర్ సర్దార్ రవీందర్ సింగ్. ఎందుకంటే శవాన్ని నడిరోడ్డుపై పెట్టుకుని, అంత్యక్రియల కోసం చేతులు చాచే పరిస్థితులు రావద్దని ఈ ఆలోచనకు వచ్చినట్లు చెబుతున్నారు. ఎవరైనా చనిపోయినట్లు సమాచారం అందింతే..శానిటేషన్‌తో పాటు దీనికోసం నియమించిన ప్రత్యేక విభాగం అక్కడకు వెళ్తారు. అంతిమయాత్రకు అవసరమైన వాహనాన్ని తీసుకువస్తారు. అవసరాన్ని బట్టి బాడీ ఫ్రీజర్‌ను సమకూరుస్తారు. ఇది కూడా రూపాయి స్కీంలో భాగమే. ఆయా మతాల ఆచారం ప్రకారం అవసరమయ్యే కట్టెలు, కిరోసిన్ ఇస్తారు. ఖననం చేస్తే కార్పొరేషన్ ఖర్చులతోనే గుంత తీయడం, పూడ్చడం కూడా వారిదే బాధ్యత. మొత్తం శ్మశానం వరకు తీసుకుపోయి, చితిలో పెట్టి, కార్యక్రమాలన్నీ పూర్తి చేస్తారు. ఎక్కడా, ఎవరికీ రూపాయి కూడా ఇవ్వనవసరం లేదు. ఎవరైనా డబ్బులడిగినా అక్కడే నిలదీసే అధికారం కల్పించారు మన సర్దార్. ఈ ఒక్కరూపాయి అంత్యక్రియలు పథకంలో భాగంగా.. మృతుని బంధువులకు 50మందికి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. అది కూడా కేవలం ఐదు రూపాయలకే. ఎందుకంటే చనిపోయిన కుటుంబం శోకంలో ఉంటుంది. వారికి కనీసం వండిపెట్టే వారు కూడా ఉండరు. వంటావార్పు చేయలేని ఆ కుటుంబాలకు రూ. 5 చొప్పున 50 భోజనాలు వారి ఇంటికే పంపిస్తారు.

### కేసీఆర్ స్ఫూర్తితోనే



ఉద్యమకాలం నుంచీ సీఎం కేసీఆర్‌ను స్వయంగా దగ్గరుండీ చూశాను. ఆయన నుంచి ఎప్పటికప్పుడు స్ఫూర్తిపొందుతాను. అందుకే ఇలాంటి పథకాలు ప్రవేశపెడుతున్నా. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. సాయంత్రం కూడా టిఫిన్‌లాగా పెడితే ఉత్తీర్ణత, బడికి వచ్చేవారి సంఖ్య పెరుగుతుందని సరస్వతీ ప్రసాదం పెట్టాను. ఇక రూపాయికే నల్లా కనెక్షన్‌ను రాష్ట్రమంతా అమలు చేస్తున్నారు. ఇప్పుడు రూపాయికే అంత్యక్రియలు కూడా పేదలు, మధ్య తరగతి వర్గాల చావు ఖర్చుల ఇబ్బందులు తీర్చేందుకు చేపట్టాం. దీనికోసం తొలిసారిగా కార్పొరేషన్‌లో బడ్జెట్ మీటింగ్ పెట్టాం. ఈ స్కీం కోసం అవసరమైతే చందాలు కూడా వసూలు చేస్తాం. కరీంనగర్ పరిధిలో అంత్యక్రియలకు చేతులు చాచే పరిస్థితి ఉండకూడదు. దహనమైనా, ఖననమైనా చనిపోయిన వారిని సగౌరవంగా సాగనంపేందుకు శ్మశాన వాటికలు పలు ప్యాకేజీలు ప్రకటిస్తున్న నేపథ్యంలో.. రూపాయికే అంత్యక్రియలు జరగడం చాలా గొప్ప విషయం.

**- సర్దార్ రవీందర్‌సింగ్, మేయర్ కరీంనగర్ కార్పొరేషన్**

### త్వరలో కర్మకాండ నిలయం

ఒక్క రూపాయికే అంత్యక్రియలు పథకానికి రూ.కోటిన్నర కేటాయించారు. అవసరమైతే అంతిమ యాత్ర, అంత్యక్రియల పథకం కోసం విరాళాలు కూడా సేకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సర్దార్ ప్రకటించారు. ఎందుకంటే శ్మశాన వాటికల నిర్వహణ కార్పొరేషన్ పరిధిలోనే ఉంటుంది. కాబట్టి ఇబ్బందులేమీ రావనే మంచి ఆలోచన సర్దార్‌ది. అయితే త్వరలో అద్దె ఇండ్లలో ఉండే వారి కోసం 'కర్మకాండ నిలయం' కూడా నిర్మించనున్నారు. సాధారణంగా అద్దె ఇంటికి శవాన్ని తీసుకురానీయరు. అలాంటి వారి కోసమే ఈ కర్మకాండ నిలయం.

### విప్లవాత్మక పథకాలు

కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఎన్నో విప్లవాత్మక పథకాలు చేపట్టారు. వాటిల్లో 'రూపాయికే నల్లా కనెక్షన్' ముఖ్యమైంది. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తీసుకువచ్చారు. కార్పొరేషన్ పరిధిలోసర్కార్ పాఠశాల విద్యార్థుల కోసం 'సరస్వతి ప్రసాదం' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. దీని ద్వారా సాయంత్రం 4 గంటలకు విద్యార్థులకు స్నాక్స్ పెడుతారు. వీటిల్లో ఓ రోజు ఇడ్లీ, మరో రోజు వడ, ఇంకో రోజు కిచిడీ వంటివి ఉంటాయి. ఈ పథకాన్ని సొంతంగా నిర్వహిస్తున్నారు మేయర్ రవీందర్‌సింగ్. మహిళా కళాశాలలు, మహిళా వసతి గృహాల దగ్గర రవీందర్‌సింగ్ సానిటరీ న్యాప్‌కిన్స్ మిషన్లు ఏర్పాటు చేశారు. ఈ మిషన్‌లో రెండు రూపాయలు వేస్తే ఒక న్యాప్‌కిన్ వస్తుంది. ఇది పేద మహిళలు, విద్యార్థినులకు బాగా ఉపయోగపడుతున్నది. ఉద్యమ కాలం నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ వెన్నంటే ఉన్నారు సర్దార్. ఉత్తర తెలంగాణలో ఉద్యమకారులందరికీ ఈయన సుపరిచితం. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ సహకారంతో పేద, మధ్య తరగతి వర్గాల కోసం మంచి పథకాలు చేపడుతున్నారు సర్దార్.



### 'అంతిమయాత్ర' ప్రారంభం

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న 'ఒక్క రూపాయికి అంతిమయాత్ర' కార్యక్రమాన్ని నగర మేయర్ రవీందర్‌సింగ్ గత ఆదివారం ప్రారంభించారు. కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన మంచాల లలిత మరణించగా ఒక్క రూపాయికే అంత్యక్రియలు నిర్వహించారు. రూపాయి చెల్లింపు రశీదు అందించి పాడె కట్టటం నుంచి డప్పు చప్పుళ్లు, అంతిమ యాత్ర, దహన సంస్కారాల వరకూ అన్ని సంప్రదాయాలు, ఆచారాల ప్రకారం పూర్తిగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోనే చేపట్టారు. మృతురాలి పాడెను మేయర్ రవీందర్‌సింగ్ మోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం కోసం బల్దియా నుంచి రూ.1.50 కోట్లు కేటాయించామని మేయర్ చెప్పారు.

### దేశమంతా చర్చ

కరీంనగర్ మేయర్ సర్దార్ రవీంద్రసింగ్ తీసుకున్న నిర్ణయంతో దేశమంతా ఒక్కసారిగా చర్చించింది. ఒక్క రూపాయికే అంత్యక్రియలు పథకంతో ఆయన వార్తల్లో నిలిచారు. రవీందర్‌సింగ్‌ను ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రశంసిస్తూ దీని అమలుకు అన్ని ప్రాంతాల వారూ ఆలోచన చేయాలని సూచించారు. టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ట్విటర్ వేదికగా మేయర్ కృషిని అభినందించారు. ఈ పథకాన్ని అన్ని పట్టణాల్లో అమలు చేసేలా సాధ్యసాధ్యాలను పరిశీలించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగానికి సూచించారు. అంతేకాకుండా మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు కూడా అక్కడ దీనిపై ఆలోచన చేయాలని అధికారులకు సూచించారు. సర్దార్ రవీందర్‌సింగ్‌ను తమ రాష్ర్టానికి ఆహ్వానించి, రూపాయి అంత్యక్రియలపై సలహా ఇవ్వాలని కోరారు. సర్దార్ ఆలోచనతో సిరిసిల్లలో తక్కువ ఖర్చుకే దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు.

... **తంగళ్లపల్లి సంపత్,**
స్టేట్ బ్యూరో, హైదరాబాద్

# ఉడుకు రక్తానికి ఉత్తేజం



**శాంతి భద్రతలను కాపాడే పోలీస్ విభాగంలో విధులు అంటే ధైర్య సాహసాలతో కూడుకున్న పని. ఇలాంటి విభాగంలో ఒక్కోసారి కొన్ని సందర్భాలు పురుషులకే సవాల్‌గా మారుతాయి. కానీ ఈ మహిళా ఎస్పీ అలాంటి ఎన్నిటినో లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నది. యువతకు స్ఫూర్తి నింపుతున్నది.**

సమాజం కోసం ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిన రంగాలలో పోలీస్ విభాగం ఒకటి. అందులో పనిచేసే పోలీసులూ అంతే తెగింపుతో ఉండాలి. గుజరాత్‌లోని బారుచ్ జిల్లా ఎస్పీ శోభ భటాడ అంతే తెగింపుతో ఉంది. ధైర్యసాహసాలతో విధులు నిర్వహిస్తున్నది. అంతేకాదు, స్థానిక యువతను చైతన్య పరుస్తున్నది. కాలేజీల్లో సెమినార్లకు హాజరై ధైర్యాన్ని నింపుతున్నది. సామాజిక బాధ్యతను పెంచుతున్నది. 2014లో ఒకసారి ఓ స్వయంప్రకటిత బాబా కొడుకు కేసులో ఇలాంటిదే జరిగింది. ఆ బాబా కొడుకు ఇద్దరు అక్కా చెల్లెలను రేప్ చేసినట్టు ఆరోపణలొచ్చాయి. ఈ కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ కేసును శోభ దర్యాప్తు చేశారు. అప్పుడు కూడా ఈమెకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. కానీ భయపడలేదు. దర్యాప్తు కొనసాగించింది. నిందితుల ఇండ్లలో సోదాలు చేసి పది వేల కోట్ల విలువ చేసే ఆస్తులను, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. సీజ్ చేసిన ఆస్తులు అవినీతి పరులపాలు కాకుండా కాపాడింది. ఆ కేసుతో సంబంధం ఉన్న ఆ బాబా కొడుకును సూరత్ కోర్టు దోషిగా తేల్చింది. ఈ దోషి తండ్రి కూడా అత్యాచారాల కేసులో పట్టుబడి జైలుపాలయ్యాడు. ఇలాంటి ఎన్నో కేసులను శోభ ధైర్యంగా దర్యాప్తు చేసి అక్రమార్కులకు, నేరస్తులకు చుక్కలు చూపిస్తున్నది. 2008 బ్యాచ్‌కు చెందిన శోభ అదే బ్యాచ్‌కు చెందిన ప్రదీప్ షేజుల్‌ను వివాహం చేసుకుంది. ఈ దంపతులు 'ఖాకీ కపుల్'గా పేరు గడించారు. ఇటీవల శోభ ఓ కాలేజీలో విద్యార్థులు నిర్వహించిన సెమినార్‌లో పాల్గొని ఉపన్యాసం ఇచ్చింది. స్ఫూర్తివంతమైన ఈ స్పీచ్ ఇటీవలే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# పులిపిర్లు పోగొట్టుకోండిలా!



**అందమైన ముఖారవిందం. కానీ ఆ అందాన్ని తగ్గించేవి పులిపిర్లు. కొందరికి ముఖం మీద, ఇంకొందరికి మెడ మీద, మరికొందరికి ముక్కు మీద ఇలా ఎక్కడ పడితే అక్కడ ఏర్పడతాయి. వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో వచ్చే పులిపిర్లతో అందవిహీనంగా కనిపిస్తారు. ఈ చిన్న చిట్కాలు పాటించి పులిపిర్లు పోగొట్టుకోవచ్చు.**

- దూదిని యాపిల్ సిడర్ వెనిగర్‌లో ముంచి పులిపిర్లు ఉన్న చోట అద్దాలి. వారంలో ఐదురోజులు ఇలాచేస్తే పులిపిర్లు పూర్తిగా తగ్గిపోతాయి. యాపిల్ సిడర్ వెనిగర్‌లో అధిక యాసిడ్ కంటెంట్ ఉంటుంది. ఇది వాడడం వల్ల పులిపిర్లు మరింత పెరగకుండా సహజ సిద్ధంగా తగ్గిపోతాయి.
- కలబంద ఆకు మధ్యలో ఉండే జిగురును తీసుకుని పులిపిర్లపై రాస్తే చాలు పులిపిర్లు కొద్ది రోజుల్లోనే మాయమవుతాయి. కలబందలో ఉండే మేలిక్ యాసిడ్ పులిపిర్లలోని ఇన్‌ఫెక్షన్‌తో పోరాడుతుంది. క్రమం తప్పకుండా వారం రోజులు ఈ చిట్కా పాటిస్తే ఫలితం ఉంటుంది.
- ఆముదంలో కాస్త బేకింగ్ పౌడర్ వేసి బాగా కలపాలి. దాన్ని పులిపిర్లపై రాసి బ్యాండేజ్ వేయాలి. అలా రాత్రంతా ఉంచుకుని ఉదయాన్నే కడిగేయాలి. ఇలా రెండు మూడు రోజులు చేస్తే పులిపిర్లు పూర్తిగా తొలిగిపోతాయి.
- అరటిపండు తొక్కలో ఉండే ఎంజైములు చర్మానికి మేలు చేస్తాయి. అరటి పండు తొక్కతో రోజూ పులిపిర్లపై రుద్దితే అది క్రమేపీ కనుమరుగు అవుతుంది. వెల్లుల్లి ముద్దగా చేసుకుని పులిపిర్లు ఉన్న చోట రాస్తే ఫలితం ఉంటుంది. వెల్లుల్లిలో ఉండే ఎల్లిసిన్.. ఫంగస్ వైరస్ వంటి బ్యాక్టీరియాలతో పోరాడుతుంది.
- పులిపిర్లు ఉన్నవారు వాటిని పదే పదే తాకకూడదు. పులిపిర్లను తాకిన వెంటనే చేతులు శుభ్రంగా కడుక్కుంటే మంచిది. ముఖ్యంగా పులిపిర్లు తాకి చిన్నారులను తాకితే వారికి కూడా పులిపిర్లు వచ్చే అవకాశం ఉంటుంది.

# మానవత్వం చాటుకున్నది



**ఎండలు పోయి చల్లబడనేలేదు. చికాగో మాత్రం ప్రజలు చలికి గజగజ వణికిపోతున్నారు. ఆ భయంకరమైన చలి నుంచి ప్రజలను తప్పించడానికి ఓ మహిళ శాయశక్తులా ప్రయత్నిస్తుంది. వారిపట్ల ప్రేమను చూపుతూ మానవత్వానికి మారుపేరుగా నిలిచింది.**

చికాగోలో ఇటీవల కురిసిన మంచుకు నగరం అస్తవ్యస్థమయింది. ఉష్ణోగ్రతలు మైనస్ 27 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయంటే అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 36 యేండ్ల కాండిస్ పెయిన్ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో సాధారణ ఉద్యోగిని. ఆమె ఆఫీసుకు వెళ్లే దారిలో చిన్న చిన్న గుడారాలు వేసుకొని కొందరు జీవనం సాగిస్తుంటారు. ఆ ప్రదేశానికి టెంట్ సిటీ అని పేరు. పెద్ద భవనాల్లో ఉండే వారు మంచు దెబ్బకు అల్లాడిపోతుంటే గుడారాల్లోని ప్రజలు ఎలా తట్టుకుంటున్నారనుకుంది కాండిస్. అంతమందికి ఆశ్రయం కల్పిద్దామంటే ఆమె ఇల్లు చాలదు. అందుకే తన దగ్గరున్న సొమ్ముతో వారికి హోటల్ రూమ్‌లు బుక్ చేయాలనుకున్నది. ఏ హోటల్ యాజమాన్యం వారికి గదులు ఇవ్వడానికి అంగీకరించలేదు. ఒక్క హోటల్ తప్ప. ఒక్కరోజుకు 70 డాలర్ల చొప్పున 20 గదులను బుక్ చేసింది. ఆమె చేసిన పనిని ఎవరైనా మనసున్న వారు ఆ ప్రజలను హోటళ్ల వరకు దిగబెట్టాలని అభ్యర్థించింది. ఆమెకు తోడుగా నగరవాసులు కొందరు వెంటనే స్పందించి సాయం చేసేందుకు ముందుకొచ్చారు. టెంట్ సిటీలో 80 మందినే కాకుండా మరో 40 మందికీ హోటల్లో ఆశ్రయం కల్పించింది.ఈ పేద ప్రజలకు దాతలు ముందుకొచ్చి ఆహారం, దుస్తులు అందించారు. కాండిస్‌ను 'మన మదర్ థెరిస్సా'అంటూ అందరూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

II.

నమస్తే తెలంగాణ

# జీవనరేఖ

[ కరీంనగర్ ]

మంగళవారం 18 జూన్ 2019

## చిన్నారులకు బరువు సమస్యలా?

**ముద్దుగా అనిపిస్తున్నారనీ పిల్లల అధిక బరువును చూస్తూ అలాగే ఉండిపోకండి. బాల్యంలోనే శరీర అధిక బరువు వల్ల వయసు పెరుగుతున్న కొద్దీ సమస్యలు వెంటాడుతాయని నిపుణులు అంటున్నారు.**



బాల్యంలోనే స్థూలకాయం అనేది 21వ శతాబ్దానికి అతి ప్రమాదకరం అని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన మాట గుర్తుంది కదా? దీనితో ప్రధానంగా బీపీ, గుండె సంబంధిత వ్యాధులు తప్పవు అంటున్నారు నిపుణులు. స్పెయిన్‌కు చెందిన కార్లోస్ హెల్త్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు తాజాగా పిల్లల స్థూలకాయం అంశంపై అధ్యయనం చేశారు. పిల్లలు అధిక బరువుతో ఉండటం వల్ల ఎదిగే సమయంలోనే బీపీ సమస్యతో బాధపడాల్సి వస్తుందన్నారు. మరీ ఆందోళన కలిగించే విషయం ఏంటంటే.. లేత వయసులోనే గుండె సంబంధిత సమస్యలు వారిని వెంటాడుతాయట. ఆరేండ్ల వయసులో స్థూలకాయ సమస్య ఉంటే బీఎంఐలో మార్పు వచ్చి హైబీపీ రావడానికి అకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. చిన్నతనంలో పిల్లలు లావుగా ఉంటే ముద్దుగా అనుకోవద్దనీ.. అది భవిష్యత్‌ను ప్రమాదంలో పడేసే సమస్యగా భావించాలని సూచిస్తున్నారు.

## ఐరన్ ఎక్కువైతే ప్రెగ్నెన్సీ కష్టం



**మహిళలకు సంపూర్ణంగా ఐరన్ శాతం ఉంటేనే ఆరోగ్యం పొందవచ్చునని అంటారు కదా? కానీ అదే ఐరన్ ఎక్కువైతే కూడా ప్రమాదమే అంటున్నారు నిపుణులు. ముఖ్యంగా అది ప్రెగ్నెన్సీపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.**

రుతుక్రమం వల్ల మహిళలకు రక్తహీనత, ఐరన్‌లోపం వంటి సమస్యలు ఏర్పడుతాయి. వాటిని భర్తీ చేసేందుకు ఎన్నో సప్లిమెంట్స్ తీసుకుంటారు. స్థిరమైన ఆరోగ్యం పెంపొందించుకోవడానికి డాక్టర్లే వాటిని సూచిస్తుంటారు. అయితే వాటిని ఇష్టమొచ్చినట్లు వాడితే ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుందంటున్నారు పరిశోధకులు. తాజాగా అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ పరిశోధకులు దీనిపై అధ్యయనం చేశారు. కూరగాయల్లో లభించే ఐరన్ ఒక్కటే ప్రెగ్నెన్సీని నిర్ణయించదని అన్నారు. డాక్టర్ల సూచనమేరకు వేసుకునే మల్టీ విటమిన్ కూడా ఐరన్ కంటే ఫోలిక్ యాసిడ్ ద్వారా ఐరన్ కంటే ఫోలిక్ యాసిడ్‌నే ఎక్కువగా పొందుతామన్నారు. కాబట్టి ఐరన్ లోపం అని తెలిస్తే డాక్టర్ పర్యవేక్షణలో దానికి సంబంధించిన ఆహారం, మందులు తీసుకోవాలి. కానీ అధిక సప్లిమెంట్స్ తీసుకోవద్దని సూచిస్తున్నారు. పరిశోధకులు దీనికోసం 4600 మంది మహిళలను ఎనిమిది వారాల పాటు పరిశీలించారు.



**ఒకట్రెండు వర్షాలు పడితే.. పరిసరాలన్నీ చిత్తడిగా మారతాయి. కుంటల్లో నీళ్లు నిలుస్తాయి. అలాగే ఉంటే బురదగా మారుతుంది. వెంటనే ఈగలు వస్తాయి. వాటితోపాటు దోమలూ వస్తాయి. దోమలు వస్తూ వస్తూ.. ఎన్నో వ్యాధుల్ని మోసుకొస్తాయి! అలాంటి వ్యాధుల్లో అతి తీవ్రమైనది.. ప్రమాదకరమైనది మలేరియా. వర్షాకాలంలో ఎక్కువగా విజృంభించే మలేరియాను ఎలా మట్టుబెడదామో తెలుసుకుందాం.**

# మలేరియాను మట్టుబెడదాం

**మలేరియా** నిశ్శబ్ద వ్యాధి. దేశవ్యాప్తంగా దీనివల్ల ప్రతీ నిమిషానికి ఇద్దరు చిన్నారులు మరణిస్తున్నారట. సరైన సమయంలో గుర్తించకపోతే ప్రాణాపాయం తప్పదు. కాబట్టి మలేరియా గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.

### మలేరియా రకాలు

వర్షాకాలం.. చినుకుల మాటున ఆనందాల్ని మాత్రమే కాదు.. వ్యాధులనూ వెంటపెట్టుకొని వస్తుంది. వాటిలో ముందుగా చెప్పుకునేది మలేరియా గురించే. ఈ వ్యాధి కారకం దోమలో పెరుగుతుంది. తీవ్రతను బట్టి మలేరియాను నాలుగు రకాలుగా వర్గీకరించారు. ప్లాస్మోడియం ఫాల్సిఫెరమ్, ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఓవలే, ప్లాస్మోడియం మలేరియే. వీటిలో ప్లాస్మోడియం ఫాల్సిఫెరమ్ చాలా ప్రమాదకారి.

### లక్షణాలేంటి?

మలేరియా లక్షణాలను మూడు దశల్లో గుర్తించవచ్చు.
చలిదశ : చలి, వణుకు, తలనొప్పి సమస్యలు వస్తాయి. 15 నిమిషాల నుంచి గంట వరకు తీవ్ర చలి ఉంటుంది.
వేడి దశ : ఒళ్లంతా మంటలతో కాలిపోతుంది. తీవ్రమైన జ్వరం, వాంతులు వస్తాయి. 2-6 గంటల వరకు శరీరం వేడితో ఉంటుంది. నాడులు కొట్టుకున్నట్టు అనిపిస్తాయి. దాహం ఎక్కువగా ఉంటుంది.
చెమట దశ : జ్వరం తగ్గుతుంది కానీ ఒళ్లంతా చెమటలు పడుతాయి. 2-4 గంటల వరకు చెమటలు పడుతూ ఉంటాయి. రోజు విడిచి రోజు జ్వరం వస్తుంది.

### మలేరియా కారకం

ఈ జ్వరం ప్లాస్మోడియం సూక్ష్మజీవి ద్వారా వస్తుంది. రోగి శరీరంలో ఇవి ఉంటాయి. అనాఫిలిస్ జాతికి చెందిన ఆడదోమ ఈ రోగిని కుట్టి రక్తంతోపాటు సూక్ష్మజీవులను కూడా పీల్చుకుంటుంది. అలాంటి దోమ ఇతర ఆరోగ్యవంతులను మళ్లీ కుట్టినప్పుడు వారికి సంక్రమిస్తుంది. 10-15 రోజుల తరువాత జ్వరం వస్తుంది. చెమటతో జ్వరం తగ్గి కొంత విరామం తర్వాత తరచుగా జ్వరం వస్తుంటే అది మలేరియాగా అనుమానించాలి.

### మెదడుకూ ప్రమాదం

ఆలస్యం చేస్తే మలేరియా ప్రభావం మెదడుపై చూపుతుంది. కన్ఫ్యూజన్, మాట తడబడటం, లివర్ ఫెయిల్యూర్, లంగ్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్‌కు కారణం అవుతుంది. ప్లాస్మోడియం ఫాల్సిఫారమ్ అనే మలేరియా క్రిమి ద్వారా మెదడుకుకు మలేరియా జ్వరం వ్యాపిస్తుంది. మెదడు మలేరియా ద్వారా ఫిట్స్ కూడా వస్తుంది. దీనిని సెర్కేల్ మలేరియా అంటారు. తీవ్రమైన స్థితిలో మరణం కూడా సంభవిస్తుంది.

### నిర్ధారణ ఎలా?

మలేరియా సోకినట్లు ఏమాత్రం అనుమానం కలిగినా వైద్యులను సంప్రదించాలి. గీంసా బ్లడ్ స్మీయర్ అనే పరీక్ష ద్వారా దీనిని నిర్ధారిస్తారు. వ్యాధిగ్రస్తుని నుంచి సేకరించిన రక్తం బొట్టును ఒక సన్నటి గాజు పలకపై ఉంచి, దానిపై గీంసా ద్రావకం వేస్తారు. దీనివల్ల సూక్ష్మదర్శిని ద్వారా మలేరియా జీవులను గుర్తించవచ్చు. అవి ఎర్ర రక్తకణాలను నాశనం చేయడం స్పష్టంగా కనిపిస్తుంది. అన్ని మలేరియా కారకాలకు ఒకేరకమైన చికిత్స ఉండదు. ఒక రకం ప్లాస్మోడియంకు పనిచేసే మందు వేరొక దానికి ఉండకపోవచ్చు. కొన్నిసార్లు రోగి ఉన్న ప్రదేశాన్ని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది.

### గర్భిణులు జాగ్రత్త

3నెలలు లోపు గర్భిణీ స్త్రీకి మలేరియా జ్వరం ఉన్నదని నిర్ధారించినట్లయితే మలేరియా జ్వరానికి సంబంధించిన మందులు వాడరాదు. 3 నెలలు దాటిన తర్వాత డాక్టరు సలహా తీసుకొని మాత్రమే మలేరియా జ్వరం చికిత్స చేయించాలి.

### నివారణ ఎలా?

దీనికి ఖచ్చితమైన నివారణ లేదు.. దోమకాటుకు గురికాకుండా ఉండటమే నివారణ మార్గం. దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా కిటికీలకు, వెంటిలేటర్లకు నెట్లు అమర్చుకోవాలి. దోమ తెరలు ఉపయోగించుకోవాలి. మొక్కలు, పూలకుండీలు, కూలర్లు, ఏసీలలో నీరు మారుస్తూ ఉండాలి. దోమలను అదుపుచేయడం అనేది చాలా మంచి పద్ధతి. ఇదికూడా ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటుంది. ఇదివరకు దోమలను అరికట్టడానికి డైక్లోరో డైఫినైల్ ట్రైక్లోరోఈథేన్ క్రిమి సంహారక మందును వాడేవారు. ఇది చాలా తక్కువధరలో లభిస్తుంది. పనితనం కూడా బాగానే ఉంటుంది. అయితే ఇది పర్యావరణంలో ఎక్కువసేపు ఉండి కాలుష్యాన్ని పెంచుతుందని కొందరు వాదించారు. ఈ వాదన మలేరియా బారిన పడని ధనిక దేశాలకు మాత్రమే వర్తిస్తుంది తప్ప మిగతా వాటికి కాదనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనినే సూచించింది.

### అందుబాట్లో వ్యాక్సిన్

ప్రపంచవ్యాప్తంగా ఏటా 4,35,000 మంది పిల్లలు మలేరియా బారినపడుతున్నట్లు అంచనా. ప్రతి రెండు నిమిషాలకు ఒక చిన్నారి మలేరియాతో మృత్యువాత పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ముఖ్యంగా ఆఫ్రికా దేశాలను మలేరియా అధికంగా పీడిస్తున్నది. ప్రతీ సంవత్సరం ఆఫ్రికా దేశాల్లో రెండున్నర లక్షల మందికి పైగా చిన్నారులు మలేరియాతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మహమ్మారి మలేరియాను మట్టుబెట్టేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాక్సిన్ వాడకానికి శ్రీకారం చుట్టింది. ప్రపంచంలోనే మొట్టమొదటిగా మలేరియా వ్యాక్సిన్ వాడకాన్ని మలావీ ప్రభుత్వం ప్రారంభించింది. ఆఫ్రికాలోని మలావీ సర్కారు చేపట్టిన ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్వాగతించింది. మలేరియా నుంచి చిన్నారులను కాపాడుకునేందుకు దాదాపు 30 ఏళ్లకు పైగా నిరంతరాయంగా శ్రమించిన ఫలితమే 'ఆర్టీఎస్ఎస్'గా నామకరణం చేసిన ఈ టీకా అని పేర్కొంది. ఇక, ఘనా, కెన్యాల్లో త్వరలోనే ఈ వ్యాక్సిన్ చిన్నారులకు అందుబాటులో ఉంటుందని ప్రకటించింది.






### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- జ్వరం వచ్చినప్పుడు రక్త పరీక్ష చేయించాలి. మలేరియా అని నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవాలి.
- ఇంటి పరిసరాలలో గుంతలు గోతులు లేకుండా జాగ్రత్త పడాలి.
- ఇంటి బయటపడుకునేవారికి దోమ తెర, వంటి నిండా బట్ట ఉంచుకోమని తెలియజేయాలి.
- వేపనూనె ఒంటికి రాసుకుంటే దోమ కుట్టదు.
- చిన్నచిన్న చెరువులు, గుంటలలో గంబూసియా లేక గప్పి చేపలు వదలడం.
- ఇంటిపై కప్పుపైనున్న ట్యాంకుల్లో దోమలు పెరగకుండా చూసుకోవాలి.

**డాక్టర్ శ్రీరంగ్ ఆబ్కారీ**
జనరల్ ఫిజీషియన్,
ఉదయ్ ఓమిని హాస్పిటల్,
హైదరాబాద్



# పోషకాహారమే ముఖ్యం!

**స్కూళ్లు ప్రారంభం అయ్యాయి కదా? మీ పిల్లలకు ఏం తినిపిస్తున్నారు? మీరు తినిపించే ఆహారం ఆరోగ్యకరమేనా? ఒక్కసారి ఆలోచించండి. ఎదిగే పిల్లలకు ఏది పడితే అది పెట్టకండి. వారి ఆరోగ్యం పాడవుతుంది. శారీరక.. మానసిక అభివృద్ధిలో పోషకారం ప్రభావం చూపిస్తుంది. ఏది తినిపించాలో.. ఎంత తినిపించాలో తెలుసుకోండి.**

**పిల్లలు** త్వరగా లేవాలి. రెడీ అవ్వాలి. టైమ్‌కు స్కూల్‌కు వెళ్లాలి.. ఇవి తప్ప వారి ఆరోగ్యంపై శ్రద్ధ లేదా? ఉంటే కుర్‌కురేలు.. చిప్సలు ఎందుకు పెడుతున్నారు? ఇవి ఆరోగ్య పరంగా చాలా ప్రమాదకరమైనవి.

### ఏం పెడుతున్నారు?

ఇండియన్ స్కూల్ పిల్లల లంచ్ బాక్సుల్లో వేయించిన ఆహారమే పెడుతున్నారని కాలిఫోర్నియాకు చెందిన పరిశోధకులు అంటున్నారు. అవి పిల్లలకు ఏమాత్రం శ్రేయస్కరం కాదని వారు సూచిస్తున్నారు. అంత చిన్న పిల్లలకు వేపుళ్లు అవసరం లేదనీ.. స్టెరాయిడ్స్ కలిసి ఉండి గాలితో నింపిన చిప్స్ వంటి స్నాక్స్‌కు దూరంగా పిల్లలను ఉంచాలన్నారు.

### పోషకాహారం లోపిస్తే?

పిల్లల్లో పౌష్టికాహారం లోపిస్తే శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటారు. ఎదుగుదల ఉండదు. అర్థం చేసుకొనే శక్తి లోపిస్తుంది. ఈ తరహా పిల్లలు బడి మానేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. వ్యాధి నిరోధక శక్తి లోపించడం వల్ల తరచూ వ్యాధుల బారినపడుతారు. ముఖ్యంగా విటమిన్-ఎ, ఐరన్, కాల్షియం, అయోడిన్ వంటి పోషక పదార్థాల లోపానికి గురవుతారు. రోగ నిరోధకశక్తి మందగిస్తుంది. ఏ సమస్య వచ్చినా తట్టుకోలేరు.

### వ్యాధులు తప్పవు

పిల్లల శారీరక పెరుగుదల వారి ఆరోగ్యాన్ని సూచిస్తుంది. పెద్దవారిలో కంటే పిల్లల్లో శరీర పెరుగుదల చాలా ఎక్కువగా ఉంటుంది. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించడం, వారికి సమతుల పోషక ఆహారం ఇవ్వడం తల్లిదండ్రులకు ఒక సమస్య. దేశంలో దాదాపు 60 శాతం పిల్లలు బరువు తక్కువగాను, ఎదుగుదల లోపంతోను బాధపడుతున్నారు. తీవ్ర పోషకాహార లోపం కారణంగా నంజు జబ్బులు వస్తాయి. జబ్బులు పోషకాహార లేమికి పరాకాష్ట, కాళ్ళు ఉబ్బడంతో నంజు జబ్బు మొదలవుతుంది. క్రమంగా చేతులు మొత్తం శరీరం ఉబ్బుతుంది. కట్టె నంజు పిల్లలు కదిలే అస్థిపంజరాల్లా ఉంటారు. ఈ వ్యాధికి గురైన పిల్లల చర్మం గరుకుగా మారుతుంది. జుట్టు ఊడిపోతుంది.




### అలవాటు చేయాలి

వేళకు తినడం, వేళకు నిద్రపోవడం వంటి మంచి అలవాట్లు ఉన్నట్లయితే ఆరోగ్య సమస్యలు తలెత్తవు. సక్రమమైన ఆహారపు అలవాట్లు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పేచీలు పెడుతున్నారు కదా అని పెట్టడం మానేస్తే అదే అలవాటైపోతుంది. శరీరానికి అవసరమైనంత మోతాదులో ఆహారం లభించకపోవడంతో బలహీనంగా తయారవుతారు. ఒకే రకమైన ఆహారం ఇవ్వడం వల్ల కూడా సరిగా తినరు. కొత్త రుచులు, కొత్త వాతావరణం కూడా పిల్లలు బాగా ఆహారం తీసుకోవడానికి దోహదం చేస్తాయి.

### మితమే హితం

కొంతమంది పిల్లలు తమకు ఇష్టమైన పదార్థాలను ఎక్కువగా తిని వ్యాధులు తెచ్చుకొంటారు. ఈ అలవాటు కూడా మంచిది కాదు. ఇందువల్ల శరీరంలో కొవ్వు పెరిగి పిల్లలు స్థూలకాయులుగా తయారవుతారు.పిల్లలు సరిగా తినడం లేదనికానీ లేదా ఎక్కువగా తింటున్నారని కానీ తల్లిదండ్రులు గుర్తించి వారి అలవాట్లను సరిచేస్తే మంచిది.

ఎండాకాలం వేడిమి నుంచి వర్షాకాలం మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. కానీ పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని దెబ్బతీస్తుంది. గాలి, నీటి ద్వారా వచ్చే వ్యాధులు వస్తాయి. చలి, జ్వరం, డయేరియా, వాంతులు, పసరికలు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలవచ్చు.

- కాబట్టి పిల్లలకు సమతుల ఆహారం ఇవ్వాలి. ఇది రోగ నిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. వారిని ఆరోగ్యంగా ఉంచుతుంది.
- బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరిగా తినిపించాలి. పాలు ఒక్కటే తాగించి బ్రేక్‌ఫాస్ట్ అంటే సరిపోదు. మంచి పోషక విలువలున్న ఆహారం తగిన మోతాదులో తినిపించాలి.
- కాయ ధాన్యాలు, పప్పులు, బీన్స్, గుడ్లు, ఓట్స్ బ్రేక్‌ఫాస్ట్‌లో కచ్చితంగా ఇవ్వాలి.
- సీజనల్ పండ్లు, కూరయలు పెడితే వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయి.
- శుద్ధమైన.. శుభ్రమైన నీళ్లు మాత్రమే పిల్లలకు ఇవ్వాలి.
- ఇంట్లో చేసిన ఆహారం మాత్రమే తినిపించాలి. లంచ్ బాక్స్‌ల్లోనూ పెట్టివ్వాలి.



**అశ్విని సాగర్,** కన్సల్టెంట్ న్యూట్రిషనిస్ట్

## సుడోకు

**డైలీ సుడోకు 66 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 1 | 6 | 3 | 9 | 4 | 2 | 8 | 7 |
| 4 | 9 | 7 | 2 | 6 | 8 | 3 | 5 | 1 |
| 2 | 8 | 3 | 1 | 5 | 7 | 9 | 6 | 4 |
| 8 | 4 | 5 | 9 | 7 | 6 | 1 | 2 | 3 |
| 3 | 7 | 1 | 8 | 2 | 5 | 6 | 4 | 9 |
| 9 | 6 | 2 | 4 | 3 | 1 | 5 | 7 | 8 |
| 7 | 3 | 9 | 6 | 8 | 2 | 4 | 1 | 5 |
| 1 | 2 | 8 | 5 | 4 | 3 | 7 | 9 | 6 |
| 6 | 5 | 4 | 7 | 1 | 9 | 8 | 3 | 2 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు -67**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | | | | 6 | | 9 | 3 | |
| 7 | | 2 | | | | | 1 | |
| | | | | 4 | 3 | | | |
| 6 | | | 5 | | | 3 | | |
| | 7 | | | | | | 8 | |
| | | 5 | | | 9 | | | 7 |
| | | | 2 | 9 | | | | |
| | 9 | | | | | 2 | | 8 |
| | 2 | 1 | | 8 | | | | 4 |

## ట్వీట్



**పరిణీతి చోప్రా**
@ParineetiChopra

**అంతకు ముందు.. ఆ తర్వాత. సైనా నెహ్వాల్ ఎలా ఆడతారు ఇంతకష్టమైన ఆట. ఎలా చేయగలుగుతారు కష్టమైన పని.**

పరిణీతి చోప్రాను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య 13,070,775

## కామన్‌మ్యాన్ వాయిస్

సర్ మెట్రో స్టేషన్‌లో రద్దీ ఫొటో వచ్చింది ఎలా కవర్ చేద్దాం. ఏముంది ఆగిపోయిన మెట్రో ఎక్కే అవకాశం లేక బయటే నిలబడిపోయిన జనం అని రాసేయ్.

-Om Prasad

ఇక్కడ కాళేశ్వరం ట్రెండ్ అవుతుంటే, కమలముల కండ్లు మండుతున్నయి. అందుకే వాళ్లు పేకుడుతో పీక్కుంటున్నరు.

-Burra Manohar Goud

బీజేపీ తెలంగాణకు ఏం చేసింది. ఏం ఇచ్చింది. ఈ రోజు ఆసియాలోనే రికార్డు స్థాయిలో దేశం గర్వించదగ్గ కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మొండి చెయ్యి చూపించి తానేంటో చెప్పకనే చెప్పింది.

-Tajnoth Raghuveer Rathode

## వైరల్ వీడియో




**తెలుగులో అర్జున్‌రెడ్డి, హిందీలో కబీర్‌సింగ్, తమిళంలో ఆదిత్య వర్మగా రాబోతున్నది. హీరో విక్రమ్ కొడుకు ధృవ్ తొలిసారి తెరకు పరిచయం అవుతున్నాడు. దీనికి సంబంధించిన టీజర్ యూట్యూబ్ ట్రెండింగ్ నంబర్ వన్‌గా నిలిచింది.**

Adithya Varma | Official Teaser HD | Dhruv Vikram | Gireesaaya | Ravi K Chandran ISC | BanitaSandhu

Total views : 2,996,943+

Premiered Jun 15, 2019

**III.**

నమస్తే తెలంగాణ
# శాస్త్ర
[ కరీంనగర్ ]
మంగళవారం 18 జూన్ 2019

ప్రకృతి పాఠం

## తామరాకు తడి నిరోధకత

**ప్రకృతిలో అరటి, తామర ఆకుల స్వచ్ఛత మరి వేటికీ రావు. ఎలాంటి దుమ్ము, ధూళి, నీరు వంటి వాటిని అవి తమ తలాలపై ఎంతమాత్రం నిలువనీయవు. ప్రత్యేకించి తామర ఆకులోని జలనిరోధక (water proof) గుణాన్ని స్ఫూర్తిగా తీసుకొని శాస్త్రవేత్తలు సృష్టిస్తున్న అద్భుతాలకు కొదువ లేదు. పెయింట్ల నుంచి సౌరవిద్యుత్ పలకల (solar panels) వరకు ఎన్నో అసాధారణ ఆవిష్కరణలు సాధ్యమవుతున్నాయి.**

తామరాకును 'నెలుంబా నుసిఫెరా' (Nelumbo nucifera) గా పిలుస్తారు. జర్మనీకి చెందిన వృక్ష శాస్త్రవేత్త విల్‌హెల్మ్ బార్త్‌లట్ (Wilhelm Barthlott) 1973లోనే తామరాకు నిర్మాణ రీతిని అధ్యయనం చేసి, దాని ధర్మాల్ని వెల్లడించారు. ఈ ఆకులలోని జలనిరోధక లక్షణాన్ని ఆధారంగా చేసుకొనే సిలికాన్ నానోకణాలతో శాస్త్రవేత్తలు అతిసూక్ష్మ తలాలతో కూడిన రంగులను రూపొందించారు. ఈ పెయింట్స్‌ను భవనాలకు వేసుకొంటే దుమ్ము, ధూళి వంటి కాలుష్యాలు దరి చేరవని అంటున్నారు. కార్లకూ ఈ రంగులను వాడుతున్నారు. సిలికాన్ డయాక్సైడ్ నానోపార్టికల్స్ (అతిసూక్ష్మకణాలు), హైడ్రోఫోబిక్ పాలిమర్ల సంయుక్త కలయికతో ఈ రంగులు తయారవుతున్నాయి.

సిరమిక్ రూఫ్ టైల్స్‌ను, ప్రత్యేక గ్లాసులను కూడా తామరాకు శక్తి ఆధారంగా శాస్త్రవేత్తలు తయారుచేశారు. కొంత మార్పుతో ముడతలు పడని వస్త్రాలను కూడా ఇదే సాంకేతికతతో సృష్టిస్తున్నారు. ఇవి తామరాకు మాదిరిగానే దుమ్ము, ధూళి, నీటిని తమపైకి చేరనీయవని వారు అంటున్నారు. తామరాకు గుణంతో తయారైన పాలిస్టర్ డ్రెస్‌లు (షర్ట్‌లు, ప్యాంట్‌లు) అభివృద్ధి చెందిన దేశాలలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చినట్టు తెలుస్తున్నది. లోటస్ ఎఫెక్ట్, నానోసాంకేతికతలతో తయారైన స్టాప్ వాచీలు, పుస్తకాలు, టిష్యూ పేపర్లు వంటి వస్తువులు సైతం నీళ్లలో తడవ్వు. ఇలా తయారైన సాక్స్ అయితే బ్యాక్టీరియా చర్యలకు లోనుకాక చెమట దుర్వాసన వేయవనీ శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు. తామరకు గల ఈ జలనిరోధక సాంకేతికతను సౌరవిద్యుచ్ఛక్తి ఉత్పాదనకు వినియోగించే ప్యానెల్స్ (పలకలు)కూ వర్తింపజేస్తున్నారు. దీంతో అవి వర్షపు నీటిని నిరోధిస్తూ మరింత ఎక్కువ కాంతిని గ్రహించగలుగుతాయని వారు తెలిపారు.

**- డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి**



## 'ఫేస్' బుకింగులు!

**'ఒక దేశం తర్వాత మరొక దేశం, ఒక ఉపగ్రహం తర్వాత మరో ఉపగ్రహం ప్రయోగిస్తున్నాయి కదా! ఇలా పంపుతూ పోతే అంతరిక్షంలో శాటిలైట్ జామ్ ఏర్పడదా?' అని ఓ రచయిత పరిహాసానికి రాశారు. ఈ చమత్కారం మది నుంచి ఇంకా తొలగక ముందే 'శాటిలైట్ గార్బేజ్ అనేది అంతరిక్షంలో పెద్ద సమస్య' అనే వార్త వచ్చింది. సౌలభ్యాలున్న చోటే సమస్యలు కూడా పొంచి ఉంటాయి. ఇదెందుకు గుర్తుకు వచ్చింది? ప్రతి రోజు ఉదయం 8-9 గంటల సమయంలో ఫేస్‌బుక్ నోటిఫికేషన్లలో ఆ రోజు పుట్టిన వారి జాబితా కనబడుతుంది. చక్కగా మనకు నచ్చిన వారికి, వీలైనంత మేర శుభాకాంక్షలు చెప్పవచ్చు. ఇదే సమయంలో ఇంకో విషయం గమనిస్తుంటాను. వారిలో ఎంతమంది యాక్టివ్‌గా ఉన్నారు అని.**

ప్రతి రోజు కొందరు ఇనాక్టివ్ ఫ్రెండ్స్ కనబడుతారు. ఆరు నెలలకు పైగా అప్‌డేట్ చేయలేదంటే, ఇనాక్టివ్ ఫ్రెండ్‌గా పరిగణించి, నేను అన్‌ఫ్రెండ్ చేస్తా. లేకపోతే కొత్త మిత్రులు, మెరుగైన మిత్రులు ఎలా అదనంగా రాగలరు? అలాగే, తొలిదశలో ఫ్రెండ్ రిక్వెస్ట్ వస్తే చాలాని యాక్సెప్ట్ చేసి ఉంటాం. కనుక ఫ్రెండ్స్ జాబితాను తగ్గించడం, అలాగే కొందరిని వదిలించుకోవడం జరుగుతుంది. వాళ్లు యాక్టివ్‌గా లేరు అంటే వారు చూడటం గాని, అప్‌డేట్ చేయడం గాని ఉండదు. ఇదే సమయంలో మరి కొందరు కేవలం బర్త్ డే గ్రీటింగ్స్ పెట్టేస్తూ ఉంటారు. అందుకే కొందరి అకౌంట్లలో కొన్ని తాజా గ్రీటింగులు, అంతకు ముందు సరిగ్గా సంవత్సరం క్రితపు గ్రీటింగ్ మెసేజ్‌లు కనబడతాయి.

ఇంకో తమాషా కూడా జరుగుతుంటుంది. ఒక ఫేస్‌బుక్ ఫ్రెండ్ మరణిస్తారు. అది ఇతరుల ఫేస్‌బుక్ అప్‌డేట్స్ ద్వారా తెలుస్తుంది. ఐతే, గతించిన వ్యక్తి ఫేస్‌బుక్ అప్‌డేట్ చేస్తున్నట్టు మనం గమనించవచ్చు. ఇదెలా సాధ్యమంటే, కనుమూసిన వ్యక్తి అకౌంట్‌కు మరొకరు అదే పాస్‌వర్డ్ వాడుతూ ఉంటారు. అదే పాస్‌వర్డ్ వాడితే ఫేస్‌బుక్ అభ్యంతరం చెప్పజాలదు. కానీ, ఇది సవ్యమైన పద్ధతి కాదు. హుందాతనం కాదు. ఠక్కున చూసేవారికి కొంత ఆశ్చర్యం కూడా కలుగుతుంది. నిజానికి ఫేస్‌బుక్‌లో ఇటువంటి సమస్యకు కొంత పరిష్కారముంది. మనకు తెలియకపోవడం లేదా తెలుసుకొనే ఆసక్తి లేకపోవడం ఒక రకం సమస్య కాగా, సాయం చేయడానికి వేరొకరి సాయం తీసుకోవడం ఇంకో రకమైన విషయం.

ఫేస్‌బుక్ మొదలై 15 సంవత్సరాలు అయినా, అది మన మధ్య ప్రచారంలోకి వచ్చి ఏడెనిమిది సంవత్సరాలు. లేదా ఒక దశాబ్దం మాత్రమే అయ్యింది. ఈ మధ్య కాలంలోని ఫేస్‌బుక్ విధివిధానాలు మారుతూ, మెరుగవుతూ వస్తున్నాయి. కొంత సమాచారం ఇవ్వకపోతే అకౌంట్ ప్రారంభించడం వీలు పడదు. అందుకే కొన్ని పేర్లు 'గోపాల్ గోపాల్'లాగా ఉంటాయి. అలాగే, ఒక ప్రఖ్యాత రచయిత బర్త్‌డేకు మూడుసార్లు నోటిఫికేషన్లు కనబడ్డాయి. పరిశీలిస్తే తేలింది

అంతర్జాలం



ఏమంటే, వారు వేరు వేరు వయసు వివరాలతో అకౌంట్లు తెరిచారని. సినీతారల బొమ్మలతో అకౌంట్లు కొనసాగించడంలా ఇదో అనందం. ఫేస్‌బుక్‌లో అకౌంట్ తొలగించవచ్చు లేదా స్మృత్యర్థం (మెమరలైజ్) చేయవచ్చు. ఈ రెండింటికీ సదరు వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రం అవసరం. ఇది కూడా బ్యాంక్ అకౌంట్ వంటిదే. మనకు మనం సమాచారం అందజేస్తే కానీ సాధ్యం కాదు. బ్యాంకు అకౌంట్‌లో నామిని ఉన్నట్టు ఇక్కడ కూడా ఫేస్‌బుక్ అకౌంట్ హోల్డర్ తన తర్వాత ఎవరు ఫేస్‌బుక్ అకౌంట్ నిర్వహిస్తారో స్పష్టంగా ప్రకటించాల్సి ఉంటుంది. (Note: How to delate/ memorialize a facebook account అనే వివరాలు వాట్సప్‌లో విడిగా పంపుతున్నారు).

ఒకరి అకౌంట్‌ను మరొకరు నిర్వహించినపుడు 'రిమెంబరింగ్' అనే మాట ప్రొఫైల్ నేమ్ తర్వాత కనబడుతుంది. ఇలాంటి అకౌంట్లకు అన్ని సదుపాయాలుండవు. ప్రొఫైల్ ఫొటో మార్చవచ్చు. స్మృత్యర్థం రాయవచ్చు. లేదా ఫ్రెండ్ రిక్వెస్ట్‌కు స్పందించవచ్చు! ఇలాంటి సదుపాయం ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా ఉంది. ట్విట్టర్‌లో అకౌంట్ కొనసాగించే సదుపాయం లేదు. కానీ, నడపకుండా డీ యాక్టివేట్ చేయవచ్చు. మరో యాభై ఏండ్లకు అంటే 2070కు 1.4 బిలియన్ల మంది ఫేస్‌బుక్ వాడతారనీ, 2100కు ఈ సంఖ్యతో సమానమైన మంది మరణించే ఫేస్‌బుక్ అకౌంట్ హోల్డర్స్ అని గత సంవత్సరం సమాచారం ఆధారంగా 'ఆక్స్‌ఫర్డ్ ఇంటర్‌నెట్ ఇన్‌స్టిట్యూట్' లెక్కించింది. అంటే సమస్య తీవ్రంగా ఉందని తెలుస్తున్నది. మరో సమస్య ఏమంటే సగటున ఏడెనిమిది అకౌంట్లు కలిగి ఉన్నారనీ, వాటిల్లో చాలా వ్యక్తిగతమైన, విలువైన సమాచారం ఉందని తెలుస్తున్నది. పత్రికల్లో స్మృతి ప్రకటనల సమాచారం ఆధారంగా హ్యాకర్స్, గతించిన వారి ఫేస్‌బుక్ అకౌంట్లు హ్యాక్ చేసి ఆర్థిక మోసాలకు పాల్పడతారని! ఇది సరే, వాడని అకౌంట్లలో ఉండే సమాచారం, గార్బేజ్‌గా మారిన సమాచారం ఏమవుతుంది? ఈ సందేహం తీరలేదు.

**-డా॥ నాగసూరి వేణుగోపాల్**

# అమృత ఫలం వైపు..

వ్యవసాయ శాస్త్రం



**ఈనెల 26 నుంచి జూలై 3వ తేదివరకు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ (ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్)లో జరుగనున్న 32వ 'ఇస్టా' (International Seed Testing Association: ISTA) కాంగ్రెస్ (సదస్సు) సందర్భంగా విత్తన వైవిధ్యం, నాణ్యతలపై ప్రత్యేక వ్యాసం చదువండి.**

**విత్తు** మంచిదైతే చెట్టు మంచిదవుతుంది. విత్తనాలు ఎంత గొప్పవైతే బంగారం లాంటి పంటలు పండుతాయి? ఒకనాటి వైభవోపేతమైన అమృత ఫలసాయం వైపు రైతులను నడిపించడానికి అద్భుత విత్తనాలు కావాల్సిందే. ఎంతటి వ్యావసాయిక సవాళ్లనైనా ఎదుర్కొంటూ అనేక విభిన్న పంటలతో సస్యశ్యామలంగా వెలుగొందిన వారి సుసంపన్నమైన విత్తన వైవిధ్యం, నైపుణ్య విధానాలు ఇవాళ ఏమైనాయి? 2050 కల్లా వెయ్యికోట్లకు పడగలెత్తనున్న ప్రపంచజనాభా ఆహార ధాన్యాల అవసరాలను తీర్చడానికి 'జన్యుపరివర్తిత వ్యవసాయమే' (Genetically modified agriculture) శరణ్యమా? రైతు ప్రపంచం కోల్పోయిన బీజసంరక్షణ ప్రావీణ్యాలను భవిష్యత్ తరాలకైనా అందించవలసిన బాధ్యత మనపైన లేదా? జీవకోటి కంతటికీ ప్రాణశక్తిని ప్రసాదించే విత్తనాలకు తిరిగి అంతటి సామర్థ్యాన్ని ఆపాదింపజేయడానికి మనమేం చేయాలి? 32వ 'ఇస్టా' సదస్సు నేపథ్యంలోనైనా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ఈ మౌలిక అంశాలపై ఒక కార్యాచరణను సిద్ధం చేసుకోగలిగితే మంచిది.

**ఇదీ వాస్తవ దృశ్యం!**

ప్రపంచ ఆహార ఉత్పత్తిపై ప్రత్యక్ష ప్రభావం చూపిన 'రైతు నైపుణ్య మార్పిడి' పర్యవసానం పుణ్యమా అని అంతర్జాతీయ స్థాయిలో పంటల వైవిధ్యం, నాణ్యతలపైన సుమారు 75 శాతానికి పైబడిన నష్టాలే సంభవించినట్టు ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఆహార, వ్యవసాయ సంస్థ (UN Food and Agriculture Organisation: FAO) అంచనా వేసింది. 'అనేకమంది రైతులు ఏవో ఒకటో లేక రెండో విభిన్నమైన విత్తనాలనే కొనుగోలు చేసే పరిస్థితి నెలకొన్నది. ఒకవేళ వర్షం పంట పక్వానికి రావడానికంటే ముందే కురిసినా, లేక ఆలస్యంగా వచ్చినా మొత్తం పంట దెబ్బ తినే దుస్థితి. వాతావరణ మార్పులు వ్యవసాయ రంగాన్ని పెద్ద ఎత్తున దెబ్బతీస్తున్నందున వివిధ రకాల వైవిధ్యకరమైన విత్తనాలు లేకపోవడం రైతులకు పెద్ద లోపంగా కనిపిస్తున్నది. దశాబ్దాల కిందటి తమ సాంప్రదాయిక విత్తన సంరక్షణ విధానాలు ఇప్పుడు అందుబాటులో లేకుండా పోయాయి' అని ఒక పరిశోధనాత్మక నివేదిక ఇటీవల వెల్లడించింది. దీనిని ఎక్యుమెనికల్ అడ్వొకెసీ అలయెన్స్ (Ecumenical Advocacy Alliance), గెయా ఫౌండేషన్ (Gaia Foundation), ఆఫ్రికన్ బయోడైవర్సిటీ నెట్‌వర్క్ (African Biodiversity Network) సంస్థలు సంయుక్తంగా రూపొందించాయి.

అభివృద్ధి వేగంలో ఆధునిక మానవుడు అంతకంతకూ దూసుకుపోతున్నా 'ఆకలి రహిత సమాజాన్ని' మాత్రం సాధించలేక పోతున్నాడు. ఎందుకిలా జరుగుతున్నది? ఎక్కడుంది లోపం? ఆహారధాన్యాల ఉత్పత్తిలో ఆయా దేశాల వ్యవసాయ రంగాలు కావలసినంత స్థాయిలో ఫలసాయాన్ని సాధించలేకపోతున్నాయి. తత్ఫలితంగానే ప్రపంచప్రజల క్షుద్బాధ తీరడం లేదన్నది చాలా స్పష్టం. ప్రామాణిక గణాంకాల మేరకు ప్రతి పదిమందిలో ఒకరికి 'ఆకలి మంట తీరకుండానే' తెల్లవారుతున్నది. సమీప భవిష్యత్తు దృశ్యాలైతే మరింత భయానకం. ఈ క్రమంలోనే పలు సాగు వ్యవస్థలను బాగుపరిచే లక్ష్యాలలో కీలకమైందిగా పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు 'పంటల అధిక దిగుబడి'నే సూచిస్తున్నారు. కానీ, వాస్తవానికి అంతకంటే ముఖ్యమైన అంశం విత్తనాల వైవిధ్యం, వాటి నాణ్యత అని పలువురు పరిశోధకులు అంటున్నారు.

విత్తు, చెట్టు రెండింటిలో ఏది ముందు అన్నది అప్రస్తుతం. విత్తు చెట్టులా ఎదగడానికి క్షేత్రం (భూమి) తప్పనిసరి. భూమికి విత్తనం, విత్తనానికి భూమి- రెండూ అవినాభావ సంబంధం కలవి. ఒకటి లేకపోతే మరొకటి వృథా. విత్తులోని బలాన్ని బట్టే ఫలసాయం వస్తుంది. అది అమృత తుల్యం కావడానికి భూసారంతోపాటు నీరు, సేంద్రియ ఎరువులు, పోషకాలు, వాతావరణ పరిస్థితులు అన్నీ తప్పనిసరి. అయితే, ఇవన్నీ ఎంత సవ్యంగా, సమపాళ్లలో ఉంటున్నా విత్తులో అసలు సత్తువ లేకపోతే ఫలితం శూన్యమే. అందుకే, విత్తన వైవిధ్యం, నాణ్యత ప్రధానంగా చర్చనీయాంశమవుతున్నాయి.

భూమ్మీద ఇతరేతర వృక్షజాలమంతా ఒక ఎత్తయితే ఒక్క మానవజాతికి మనుగడను ప్రసాదించే ఆహారధాన్యాల కోసం పండించే పంటల ప్రపంచం ఒక్కటీ మరో ఎత్తు. నాణ్యమైన విత్తనాల వల్ల పంట ఉత్పాదకతలో కనీసం 15-20 శాతం మేర పెరుగుదల సాధ్యమని నిపుణుల అంచనా. కారణాలు ఏవైనా, భూసారం వలె విత్తనాల్లో కూడా కాలం గడుస్తున్న కొద్దీ శక్తి, సామర్థ్యాలు తగ్గుముఖం పడతున్నాయన్నది నిజం. దీని ఫలితం దిగుబడి, ఆహారధాన్యాల నాణ్యతలపైన తీవ్రంగా పడుతున్నది. దిగజారిన వ్యవసాయ స్థితిగతులలో విత్తన వైవిధ్యం, నాణ్యత అత్యంత ప్రాధాన్యాన్ని కలిగివుంటున్నాయి. అందుకే, మన తాత ముత్తాతలు తిన్న తిండిగింజల్లోని నాణ్యతకు ప్రస్తుత తిండిగింజల్లోని బలానికి చాలా వ్యత్యాసం కనిపిస్తున్నది. అసలే విత్తనాల్లో నాణ్యత లోపిస్తున్నదనుకుంటుంటే మరొక వైపు వ్యవసాయ రంగంలో సేంద్రియ, ప్రాకృతిక విధానాలు సన్నగిల్లి పోతుండడం, వాతావరణ మార్పులు వంటివి పంట దిగుబడిని, గింజల్లోని శక్తిని తగ్గిస్తున్నాయని నిపుణులు అంటున్నారు. ఫలితంగా 'సంకర (hybrid) విత్తనాలు' రాజ్యమేలుతున్నై.

వేల సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్తంగా రైతులు అవలంబించిన విత్తన వైవిధ్య విధానాలు, సంరక్షణ, నిలువ పద్ధతులు అన్నీ గత కొన్ని దశాబ్దాలుగా నాటికీయంగా అడుగంటి పోయాయి. 'ఈ పరిణామం మానవ వ్యవసాయరంగ చరిత్రలోనే తొలిసారి' అని శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. కోల్పోయిన విత్తన వైవిధ్యాన్ని తిరిగి పొందడానికి జన్యుపరివర్తనా వ్యవసాయమే శ్రేయస్కరమని కొందరు పరిశోధకులు అభిప్రాయపడుతున్నా మరికొందరు వ్యతిరేకిస్తున్నారు.

**- దోర్బల బాలశేఖరశర్మ**

### ఎవరేమన్నారు?



మనిషి గొప్పతనం అతని ఆలోచనా శక్తిపైనే ఆధారపడి ఉంటుంది!

**-బ్లేజ్ పాస్కల్**
గణిత, భౌతిక శాస్త్రవేత్త (ఫ్రాన్స్)

* జయంతి: 19 జూన్ (జీవితకాలం : క్రీ.శ. 1623-1662)

ఆరోగ్యశాస్త్రం

## ఇయర్‌హెల్త్‌తో చెవుల పరీక్షలు

**చిన్న పిల్లల నుంచి టీనేజ్ యువకుల వరకు చెవి అంటువ్యాధుల పరీక్షల కోసం శాస్త్రవేత్తలు 'ఇయర్ హెల్త్' పేరున ఒక స్మార్ట్ ఫోన్ యాప్‌ను అభివృద్ధి పరిచారు. దీనికి అమెరికాలో అధికారిక గుర్తింపు రావడమే ఇక తరువాయి.**



అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, సియాటిల్ చిల్డ్రెన్స్ హాస్పటల్ అండ్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి పరిచిన 'ఇయర్‌హెల్త్' స్మార్ట్‌ఫోన్ యాప్ పిల్లలు, టీనేజ్ యువకుల చెవుల చెకింగ్ సమస్యలకు చాలావరకు చెక్ పెట్టనుంది. ఈ ఏడాది చివరికల్లా అక్కడి ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) అనుమతి రావడానికి సిద్ధంగా ఉన్న ఈ సాఫ్ట్‌వేర్ సాంకేతికత ఇటీవల ప్రయోగాత్మకంగా నిరూపితమైనట్టు పై శాస్త్రవేత్తలు ప్రకటించారు. 18 నెలల నుంచి 17 సంవత్సరాల టీనేజ్ యువకుల వరకు మొత్తం 53 మందిపై జరిపిన పరీక్షలు పూర్తిగా విజయవంతం అయినట్లు వారు తెలిపారు. ఈ యాప్‌ను పనిచేయించే పరికరం ఉపయోగించడం చాలా తేలిక కూడా.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

### ఎయిర్ఇండియాలో

**ముంబైలోని ఎయిర్ ఇండియా లిమిటెడ్ ఖాళీగా ఉన్న ఆపరేషన్స్ ఏజెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- **పోస్టు:** ఆపరేషన్స్ ఏజెంట్
- **మొత్తం ఖాళీలు-52** (జనరల్-27, ఈడబ్ల్యూఎస్-5, ఓబీసీ-15, ఎస్సీ-5, ఎస్టీ-5)
- **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. సైన్స్ డిగ్రీ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఎయిర్‌లైన్ షెడ్యూలింగ్ (క్రూ రోస్టరింగ్, మూమెంట్ కంట్రోల్)లో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 2019 జూన్ 1 నాటికి 35 ఏండ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పేస్కేల్:** రూ. 25,200/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ.500/-
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** జూన్ 24
- **వెబ్‌సైట్:** www.airindia.in

## టీఎస్ ఐటీఐలో ప్రవేశాలు

**తెలంగాణలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లు, గురుకుల పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఆర్ఐటీఐ)లు, ప్రభుత్వ, ప్రయివేట్ మైనార్టీ ఐటీఐల్లో 2019-20కిగాను వివిధ ట్రేడుల్లో ప్రవేశాల కోసం తెలంగాణ ఉపాధి శిక్షణ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- **కోర్సు పేరు:** ఐటీఐ
- **విభాగాలు:** ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్
- నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ (ఎన్‌సీవీటీ) అనుబంధంగా రాష్ట్రంలో 54 ప్రభుత్వ ఐటీఐలు, 215 ప్రయివేట్ ఐటీఐలు కలవు. స్టేట్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ (ఎస్‌సీవీటీ) అనుబంధగా తెలంగాణ రాష్ట్రంలో 10 ఐటీఐలు ఉన్నాయి.
- **కోర్సు వ్యవధి:** రెండేండ్లు (నాలుగు సెమిస్టర్లు) లేదా ఏడాది(రెండు సెమిస్టర్లు) లేదా ఆరు నెలలు (ఒక సెమిస్టర్ మాత్రమే)

గమనిక: వివిధ ట్రేడ్‌లను బట్టి కోర్సు వ్యవధి మారుతూ ఉంటుంది.

- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డ్/సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐఓఎస్), తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీఓఎస్ఎస్) నుంచి ఎస్ఎస్‌సి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా కొన్ని ట్రేడులలో ప్రవేశానికి అర్హులు.
- **వయస్సు:** 2019 ఆగస్టు 1 నాటికి 14 ఏండ్లు నిండి ఉండాలి. దరఖాస్తుదారులకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **కోర్సు ఫీజు:** ట్యూషన్‌ఫీజు+ కామన్ మనీ డిపాజిట్‌లు కలిపి ప్రభుత్వ ఐటీఐలో రూ. 60/-,
  **ప్రయివేట్ ఐటీఐలో:**
  ఇంజినీరింగ్ ట్రేడులకు - గ్రామీణ ప్రాంతాల్లో రూ. 15,000/- పట్టణాల్లో రూ.16,500/-
  నాన్ ఇంజినీరింగ్ ట్రేడులకు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 12,000/- పట్టణాల్లో రూ. 13,200/-
- **సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ఫీజు:** రూ.10/-
- **ఎంపిక:** ఎస్ఎస్‌సీ మార్కులు, నియమ నిబంధనల మేరకు మెరిట్ కం రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూన్ 26
- **వెబ్‌సైట్:** http://iti.telangana.gov.in

### ఏడీఆర్ఐఎన్‌లో

**సికింద్రాబాద్‌లోని అడ్వాన్స్‌డ్ డాటా ప్రాసెసింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఏడీఆర్ఐఎన్)లో ఖాళీగా ఉన్న టెక్నీషియన్-బీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- **మొత్తం ఖాళీలు:** 6
- టెక్నీషియన్ బీ
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి ఎస్ఎస్‌సీ+ ఐటీఐ (ఎలక్ట్రానిక్స్/అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ మెకానిక్/ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సిస్టమ్ మెయింటెనెన్స్/ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ మెయింటెనెన్స్) ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019, జూలై 12 నాటికి 18 నుంచి 35 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పేస్కేల్:** రూ. 33,600/-
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 12
- **చిరునామా:** Sr. Admin Officer, ADRIN, 203, Akbar Road, Tarbund, Manovikasnagar (PO), Secunderabad - 500009

### ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

**భారత రక్షణ దళానికి చెందిన సికింద్రాబాద్ (ఏఓసీ సెంటర్)లోని కేంద్రంలో వివిధ పోస్టుల భర్తీకి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నది.**



పోస్టులు- ఖాళీలు
- సోల్జర్ టెక్
- సోల్జర్ జనరల్ డ్యూటీ అండ్ అవుట్ స్టాండింగ్ స్పోర్ట్స్ మెన్ (బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ).
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతోపాటు సంబంధిత స్పోర్ట్స్ కేటగిరీలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో పాల్గొని ఉండాలి.
- **వయస్సు:** 17 ఏండ్ల 6 నెలల -21 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్పోర్ట్స్ ట్రయల్స్ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీ:** జూలై 13-ఆగస్టు 18
- **చిరునామా:** ఏవోసీ సెంటర్ ఈస్ట్ మారేడ్‌పల్లి, తిరుమలగిరి, సికింద్రాబాద్-500015
- **వెబ్‌సైట్:** www.indanarmy.nic.in

### జేఎన్‌టీయూహెచ్‌లో

**హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూహెచ్, సెంట్రల్ మిచిగాన్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో 2019-20కిగాను ఎంబీఏ ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**

- రెండేండ్ల ఎంబీఏ
- మొదటి ఏడాది జేఎన్‌టీయూహెచ్, రెండో ఏడాది సెంట్రల్ మిచిగాన్ యూనివర్సిటీలో చదవాల్సి ఉంటుంది.
- మొత్తం సీట్ల సంఖ్య: 20



- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో నాలుగేండ్ల బ్యాచిలర్ డిగ్రీ (బీఈ/బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్, బీడీఎస్) ఉత్తీర్ణత.
- **దరఖాస్తు ఫీజు:** రూ. 1000/-
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చిరునామా:** డైరెక్టర్, అడ్మిషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500085
- **చివరితేదీ:** జూలై 3
- **వెబ్‌సైట్:** www. jntuh.ac.in

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 18 జూన్ 2019



# రచయితగా విజయ్ దేవరకొండ?

పైన హెడ్డింగ్ చూసి విజయ్ దేవరకొండ ఏ సినిమా కోసమో రచయితగా మారుతున్నాడనుకుంటే పొరపడినట్లే. అసలు విషయం ఏమిటంటే...తాను కథానాయకుడిగా నటిస్తున్న ఓ సినిమాలో విజయ్ రచయిత పాత్రలో కనిపించబోతున్నారు. వివరాల్లోకి వెళితే..క్రాంతిమాధవ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. రాశీఖన్నా, ఐశ్వర్యరాజేష్, ఇజాబెల్లె కథానాయికలు. ముక్కోణపు ప్రేమకథగా రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ రచయిత పాత్రను పోషిస్తున్నారని సమాచారం. ఆయన రాసిన మూడు కథలు వెండితెరపై ఆవిష్కృతమవుతాయట. వాటిలో ఆయనే హీరోగా కనిపించడం కథలో ఆసక్తికర అంశమని సమాచారం. సినిమాలో రచయిత పాత్రధారి రాసిన కథలు తెరపై ప్రాణం పోసుకునే కాన్సెప్ట్‌తో గతంలో చాలా సినిమాలు వచ్చాయి. తాజాగా అదే కాన్సెప్ట్‌ను ఈ సినిమాలో రొమాంటిక్ హంగులతో వినూత్నంగా ఆవిష్కరించబోతున్నారని తెలిసింది. ప్రస్తుతం ఈ చిత్రం ఫ్రాన్స్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది.

# తిరస్కరించిన వారే..

ఒకప్పుడు తనకు అవకాశాలివ్వడానికి నిరాకరించినవారే ఇప్పుడు తన డేట్స్ కోసం ఎదురుచూడటం గర్వంగా అనిపిస్తున్నదని చెప్పింది కియారా అద్వాణీ. 'భరత్ అనే నేను' 'వినయ విధేయ రామ' చిత్రాలతో ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకులకు చేరువైంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో భారీ అవకాశాలతో దూసుకుపోతున్నది. ఆమె కథానాయికగా నటించిన హిందీ చిత్రం 'కబీర్‌సింగ్' ('అర్జున్‌రెడ్డి' రీమేక్) ఈ నెల 21న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెరీర్ తొలినాళ్లలో తన అనుభవాల్ని మీడియా వారితో పంచుకుంది కియారా అద్వాణీ. ''ఫగ్లీ' చిత్రం ద్వారా నేను హిందీ చిత్రసీమలోకి అరంగేట్రం చేశాను. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. అనంతరం సినిమా అవకాశాలు రావడం కష్టమైపోయింది. ఎవరూ ఛాన్స్ ఇవ్వడానికి ముందుకురాలేదు. 'ఎం.ఎస్. ధోని' బయోపిక్‌లో నటించడం నా కెరీర్‌ను మార్చివేసింది. అక్కడి నుంచి వరుసగా అవకాశాలొస్తున్నాయి. దక్షిణాదిలో కూడా నాదైన ముద్రను వేయగలిగాను. ఒకప్పుడు నో చెప్పిన దర్శకనిర్మాతలే నా డేట్స్ కావాలని కోరడం నేను సాధించిన గొప్ప విజయంగా భావిస్తున్నాను. అన్ని భాషా చిత్రాల్లో నటిస్తూ పాన్ ఇండియా కథానాయికగా పేరు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం' అని చెప్పింది.


కియారా అద్వాణీ

# 1980నాటి 'కల్కి'


రాజశేఖర్, స్కార్లెట్ విల్సన్

రాజశేఖర్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కల్కి'. ప్రశాంత్‌వర్మ దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. ఈ నెల 28న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సినిమా థియేట్రికల్ హక్కుల్ని శ్రీసత్యసాయి ఆర్ట్స్ సంస్థ నిర్మాత కె.కె.రాధామోహన్ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''కల్కి' టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. సినిమా కథాంశం నచ్చడంతో పంపిణీ చేయడానికి సిద్ధమయ్యాం. పరిశోధనాత్మక థ్రిల్లర్‌గా ఈ సినిమా అందరిని ఆకట్టుకుంటుంది. ఇందులో రాజశేఖర్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది. స్కార్లెట్ విల్సన్ 'హార్న్ ఓకే ప్లీజ్' అనే ప్రత్యేకగీతం యువతరాన్ని ఆకట్టుకుంటుంది' అన్నారు. 1980దశకంలో జరిగే కథ ఇదని, యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందించామని, అసాంఘిక శక్తులపై కల్కి పోరాటమేమిటన్నది ఆసక్తికరంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. ఆదాశర్మ, నందితాశ్వేత, పూజితా పొన్నాడ, స్కార్లెట్ విల్సన్, రాహుల్ రామకృష్ణ, నాజర్, అశుతోష్ రాణా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, స్క్రీన్‌ప్లే, స్క్రిప్ట్: విల్, సమర్పణ: శివాని, శివాత్మిక.


పూజాగాంధీ

# గమ్మత్తైన ఆపిల్

పూజా గాంధీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఆపిల్'. శంకర్ దర్శకుడు. బాసర రవి చిన్న నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాత రాజ్‌కందుకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'గమ్మత్తైన కథ, కథనాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. రొమాన్స్, సస్పెన్స్ థ్రిల్లర్ హంగులతో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశం మిళితమై ఉంటుంది. పూజా గాంధీ గ్లామర్, అభినయం సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. యువతరాన్ని మెప్పించే అన్ని అంశాలున్నాయి. జూలైలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం' అని తెలిపారు. యశస్, నాగేంద్ర, విజయ్ చందర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేమ్స్, కెమెరా:ఎం.ఆర్ శీను.


కార్తికేయ, అనఘ

# గుణ ప్రేమకథ

కార్తికేయ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'గుణ 369'. అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి నిర్మాతలు. అర్జున్ జంధ్యాల ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అనఘా కథానాయిక. సోమవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదలచేసింది. 'మనం చేసే తప్పుల వల్ల మన జీవితానికి ఏం జరిగినా ఫర్వాలేదు. కానీ పక్కవాడి జీవితానికి ఏ హానీ జరగకూడదు' అంటూ సాయికుమార్ నేపథ్య గళంతో టీజర్ ఆసక్తికరంగా ప్రారంభమైంది. 'నేను ఎప్పుడూ అనుకోలేదండీ ఇలా బలవంతంగా షట్టర్ క్లోజ్ చేసి ఒక అమ్మాయితో మాట్లాడుతాననీ, నాతో మీరు మాట్లాడాల్సిన పనిలేదు. మీతో మీరు మాట్లాడేయండి' అంటూ హీరోహీరోయిన్ల మధ్య సాగే సంభాషణలు వినోదాన్ని పంచుతున్నాయి. నిర్మాతలు మాట్లాడుతూ 'టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. యువతరంతో పాటు మాస్ ప్రేక్షకులు కోరుకునే హంగులన్నీ ఉన్నాయని ప్రశంసిస్తున్నారు. మూడు రోజులు మినహా చిత్రీకరణ పూర్తయింది. ఈ సన్నివేశాల్ని త్వరలోనే తెరకెక్కిస్తాం. ఈ నెలాఖరున పాటలను విడుదల చేస్తాం. ప్రేక్షకుల్ని మెప్పించే హిట్ సినిమా తీశామనే నమ్మకంతో ఉన్నాం. కార్తికేయతో పాటు మా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అని తెలిపారు. టీజర్‌కు మించి సినిమా వెయ్యి రేట్లు బాగుంటుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: చైతన్ భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: రామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: శివమల్లాల, సత్యకిషోర్.

# రాజా నరసింహ

మమ్ముట్టి, జై, మహిమా నంబియార్ ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'మధుర రాజా'. వైశాక్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని 'రాజా నరసింహ' పేరుతో నిర్మాత సాధుశేఖర్ తెలుగులోకి అనువదిస్తున్నారు. జూలైలో ఈ చిత్రం విడుదల కానుంది. నిర్మాత మాట్లాడుతూ 'యాక్షన్ హంగులతో ముడిపడిన సందేశాత్మక చిత్రమిది. అసాంఘిక శక్తులపై రాజా నరసింహ ఎలాంటి పోరాటాన్ని సాగించాడన్నది ఆసక్తిని పంచుతుంది. మమ్ముట్టి నటన, పాత్ర చిత్రణ అలరిస్తాయి. ప్రతినాయకుడిగా జగపతిబాబు పాత్ర శక్తివంతంగా ఉంటుంది. సన్నీలియోన్‌పై చిత్రీకరించిన ప్రత్యేక గీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ప్రస్తుతం అనువాద పనుల్ని జరుపుతున్నాం. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.


మమ్ముట్టి


జీవీఆర్, శంకర్, ఆర్.కె.గౌడ్, సాయివెంకట్

# తెలంగాణ నిర్మాతల్ని అవమానిస్తున్నారు

తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌లో తెలంగాణ వారికి సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు ప్రతాని రామకృష్ణగౌడ్. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారితో పోలిస్తే నిజాయితీగా పని చేసిన తెలంగాణ నిర్మాతలకు అవకాశాలు ఇవ్వకుండా అవమానిస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించకుండా సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే బాగుంటుంది. దీని వల్ల కౌన్సిల్ డబ్బును, కాలాన్ని ఆదా చేయవచ్చు. ఎన్నికల బరిలో నిలిచిన ప్యానల్‌లు తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకోవాలని కోరుతున్నాను. ప్రొడ్యూసర్ కౌన్సిల్ గౌరవంగా కార్యకలాపాల్ని నిర్వహిస్తున్న రోజుల్లో దిల్‌రాజు, అల్లు అరవింద్ లాంటి కొందరు అగ్ర నిర్మాతలు ఎల్.ఎల్.పి పేరుతో ప్రత్యేకమైన గిల్డ్‌ను ఏర్పాటుచేసుకున్నారు. దీని వల్ల కౌన్సిల్‌కు వచ్చే ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. ఈ ఎల్.ఎల్.పి గిల్డ్‌ను ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌లో విలీనం చేస్తే బాగుంటుంది. మన ప్యానెల్ పేరుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్న సి. కల్యాణ్, ప్రసన్నకుమార్‌లు గెలిచిన తర్వాత రాజీనామా చేసి గిల్డ్‌కు బాధ్యతల్ని అప్పగిస్తామని చెప్పారు. అలా కాకుండా ఎన్నికలే లేకుండా ముందుగానే నామినేషన్లు విత్‌డ్రా చేసుకోవాలని కోరుతున్నాను. వెల్ఫేర్ ప్యానల్ పేరుతో మేము ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్నాం. నాతో పాటు మా ప్యానెల్ మొత్తం నామినేషన్లు విత్ డ్రా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఎల్.ఎల్.పి గిల్డ్ సభ్యులు 70, మిగతా వారు ముప్పై శాతం ఉండేలా ఏకగ్రీవంగా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకొని కలిసిమెలసి పనిచేస్తే ఆదాయం పెరుగుతుంది. ఎన్నికలు వద్దన్నది చాలా మంది నిర్మాతల అభిప్రాయం. అందుకే కల్యాణ్ ప్యానెల్ తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకోవాలి' అని అన్నారు. కౌన్సిల్‌లో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ప్రసన్నకుమార్ ఓటు వేయడానికి అనర్హుడని చెప్పిన కల్యాణ్ తన ప్యానెల్‌నుంచి అతడిని సెక్రటరీగా పోటీ చేయిస్తున్నారని, తెలంగాణ వారికి ఒక్కరికి ప్యానల్ నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని శంకర్‌గౌడ్ ఆరోపించారు. కుర్చీలు, పదవుల గురించే తప్ప చిన్న నిర్మాతల కష్టాల్ని కల్యాణ్, ప్రసన్నకుమార్ ఏ రోజు పట్టించుకోలేదని రమణారెడ్డి పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ఎన్నికల బరిలో నిలిపి కౌన్సిల్‌ను నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని సాయివెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషోర్, జీవీఆర్, వింజమూరి మధు, ఈశ్వర్, నరేష్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


కాజల్ అగర్వాల్

# సూపర్ మార్కెట్ నేపథ్యంలో..


ఎల్లా, కృష్ణ

హాస్యనటుడు గౌతంరాజు తనయుడు కృష్ణ హీరోగా నటిస్తున్న చిత్రం 'కృష్ణారావ్ సూపర్‌మార్కెట్'. బీజేఆర్ ఫిల్మ్ అండ్ టీవీ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీనాథ్ పులకరం దర్శకుడు. ఆదివారం హైదరాబాద్‌లో టీజర్ విడుదలైంది. సీనియర్ నటుడు సుమన్ మాట్లాడుతూ ' రెండున్నర గంటల పాటు ఆహ్లాదాన్ని పంచే చిత్రమిది' అని తెలిపారు. గౌతంరాజు మాట్లాడుతూ 'సూపర్ మార్కెట్ నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది. ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది. సెన్సార్ పూర్తయింది' అని పేర్కొన్నారు. నా కెరీర్‌కు చక్కటి శుభారంభాన్ని అందిస్తుందనే నమ్మకం ఉందని హీరో కృష్ణ చెప్పారు.

# స్వీయ నిర్మాణంలో...

కాజల్ అగర్వాల్, దర్శకుడు తేజ కాంబినేషన్‌లో నాలుగో సినిమా రాబోతుందా? అంటే ఔననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. మహిళా ప్రధాన ఇతివృత్తంతో తేజ సిద్ధం చేసిన కథ నచ్చడంతో కాజల్ ఈ సినిమాలో నటించడానికి సంసిద్ధతను వ్యక్తంచేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత సమాజ పోకడలు, మహిళల పట్ల కొనసాగుతున్న వివక్ష నేపథ్యంలో వినూత్నమైన ఇతివృత్తంతో తేజ ఈ సినిమా తెరకెక్కించనున్నట్లు తెలిసింది. హీరోయిన్‌గా నటిస్తూనే కాజల్ ఈ చిత్రాన్ని స్వయంగా నిర్మించబోతున్నట్లు సమాచారం. స్క్రిప్ట్ పనులు తుదిదశకు చేరుకున్నట్లు తెలిసింది. కాజల్, తేజ కలయికలో ఇటీవలే విడుదలైన 'సీత' చిత్రం ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది.


